ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY




మంగళవారం 07 జూలై 2026 | Tuesday 07 July 2026 | హైదరాబాద్ | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 93 | Vol.No 28 Issue No .93 | Hyderabad | www.visionandhra.in



## శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

**ఘనంగా నివాళి అర్పించిన ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ,జూలై6 :భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగం, ప్రజాసేవ పట్ల చూపిన అంకితభావం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన జీవితం 'ధైర్యానికి, మాతృభూమి పట్ల అచంచలమైన నిబద్ధతకు కాలాతీత ఉదాహరణ' అని కొనియాడారు. మిగతా 2లో..

### ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ

## నేటితో పూర్తి కావాలి

- పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధవహించాలి
- బిఎల్‌వోలు సక్రమంగా పనిచేసేలా చూడాలి
- కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్,జూలై6 : ఈ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నాటికి ఎట్టి పరిస్థితులలో పూర్తి చేయాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలతో పాటు పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధవహించి వందశాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. అదనపు సిఇఒ వాసం వెంకటేశ్వర్లు తో కలిసి సోమవారం ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమ పురోగతిపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాలను




పూరించడంలో సూపర్ వైజర్ల ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఎక్కడైతే బిఎల్ఒలు మిగతా 2లో..

### పర్యాటక ప్రాంతాల

## అభివృద్ధికి పెద్దపీట

- తారామతి బారాదరి, దుర్గం చెరువుల అభివృద్ధి
- మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌ల ఆధునీకరణ
- ఎకో టూరిజం పార్కుల అభివృద్ధికి చర్యలు
- పర్యాటకంపై సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్,జూలై6 : తారామతి బారాదరి, దుర్గం చెరువులను పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పర్యాటక కేంద్రాలను గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధికి అసవరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పర్యాటకశాఖపై సీఎం సమీక్ష మిగతా 2లో..



### కాళేశ్వరంను

## కూలేశ్వరం చేసింది ఎవరు?

- లక్ష కోట్లు పెట్టి ప్రజల సొమ్ము దుబారా చేశారు,
- కాళేశ్వరంపై కెటిఆర్ డ్రామాలు కట్టిపెడితే మంచిది
- బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి సీతక్క




మహబూబాబాద్,జూలై6 : కాళేశ్వరం పేరుతో కెటిఆర్ డ్రామాలు చేస్తున్నారని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ తీరుపై పై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మహబూబాబాద్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌కు అధికార దాహమే తప్ప... ప్రజలపై ప్రేమ లేదని విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. కాళేశ్వరం కట్టింది.. కూలిపోయింది బీఆర్ఎస్ హయాంలోనే అని ప్రస్తావించారు. కాళేశ్వరం పేరుతో లక్షన్నర కోట్లను వృథా చేశారని ఆరోపించారు. మళ్లీ అధికారం కావాలంటున్నారని.. ఆ ప్రాజెక్టులో నీటిని నిల్వచేస్తే పరివాహక గ్రామాలన్నీ మిగతా 2లో..

## కాళేశ్వరంపై పాపం కడుక్కోండి

- అసెంబ్లీకి వచ్చి నిజాలు చెప్పండి
- లక్ష కోట్లు ఎలా,ఎందుకు ఖర్చు పెట్టారో చెప్పాలి
- పేదలకు ఎందుకు ఇళ్లు నిర్మించలేదో చెప్పండి
- కెసిఆర్‌కు సవాల్ చేసిన మంత్రి పొంగులేటి

సిద్దిపేట,జూలై6 : గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడానికి లక్షల కోట్ల రూపాయల నిధులు వెచ్చిందని కానీ, పేదవాడికి ఒక సొంత ఇల్లు కట్టించి ఇవ్వడానికి మాత్రం వారికి మనసు రాలేదని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది వాళ్లే, దాన్ని ఓపెన్ చేసింది వాళ్లే, చివరకు అది కూలిపోయింది కూడా వాళ్ల హయాంలోనేనని మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు వాళ్లే కాళేశ్వరం దగ్గరకు పోయి తామేదో చేశామంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.సిద్దిపేట జిల్లా ములుగులో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లపట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాజెక్టులో నీళ్లు నిల్వ ఉంచితే కింద ఉన్న ప్రాంతమంతా కొట్టుకుపోతుందని ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరించినా, . మిగతా 2లో..



## అయోధ్య విరాళాల దోపిడీ వ్యవహారం

**దేశానికి బిజెపి క్షమాపణలు చెప్పాలన్న పొన్నం**



మిగతా 2లో..

### తెలంగాణ అసెంబ్లీ లో

## కొత్త శకం మొదలు



మిగతా 2లో..

## బిజెపి కార్యాలయంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

- ఘనంగా నివాళి అర్పించిన నేతలు రాంచంద్రరావు, దత్తాత్రేయ
- కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల తీరుపై మండిపడ్డ రాంచంద్రరావు



హైదరాబాద్,జూలై6 : జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొని శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. అఖండ భారత సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహానేత శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలను స్మరించుకున్నారు. దేశ సమైక్యత, జాతీయత కోసం ఆయన చేసిన త్యాగాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలపై స్పందించిన ఆయన కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మిగతా 2లో..

### హైడ్రా దూకుడుతో

## పేదలకు నష్టం

- పేదల ఇళ్లు కూలగొట్టి పెద్దలకు కట్టబెట్టే పన్నాగం
- సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ ఎంపి ఈటెల రాజేందర్



హైదరాబాద్,జూలై6 : హైదరాబాద్‌లో హైడ్రా వ్యవహరిస్తున్న తీరు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న విధానాలపై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలొచ్చినా సీఎం రేవంత్ రెడ్డి ఓడిపోవడం ఖాయమని ప్రజలు అంటున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అబద్దాలు చెప్పడంలో ఉన్న క్లారిటీ ప్రజలకు లేదని, అమెరికా గడ్డపై నిలబడి ఆయన అబద్దాలు చెబితేనే జనం నమ్ముతారనే భ్రమల్లో మిగతా 2లో..

## ముఖర్జీ సేవలు నిరుపమానం

- దలైలామాతో అనుబంధం గుర్తు చేసుకున్న కిషన్ రెడ్డి
- హైడ్రా తీరుపై మరోమారు ఆగ్రహం

హైదరాబాద్,జూలై6 : శ్యామప్రసాద్ జయంతి, దలైలామా జన్మదినం సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. ముఖర్జీ సేవలను ఆయన కొనియాడారు. అలాగే దలైలామా ఆయురారోగ్యాలతో మిగతా 2లో..



## ఎపిలో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు

**ప్రమాణం చేయించిన ప్రధాన న్యాయమూర్తి లీసాగిల్**



అమరావతి,జూలై6 : ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ వారి చేత ప్రమాణ స్వీకారం మిగతా 2లో..

## దలైలామా దీర్ఘాయుష్షుతో జీవించాలి

**ఎక్స్‌లో చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు**



అమరావతి,జూలై6 : టిబెట్‌కు చెందిన బౌద్ధ మత గురువు దలైలామా పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. దలైలామాకు సంపూర్ణ మిగతా 2లో..

## ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు.. లక్ష ఉద్యోగాలు

- ఎపి లక్ష్యం ఇదేనని వెల్లడించిన మంత్రి లోకేశ్



అమరావతి,జూలై6 : ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. సోమవారం దక్షిణ కొరియాలో సియోల్ బిజినెస్ ఏజెన్సీ కొరియన్ స్టార్టప్ ఫౌండర్లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొని మాట్లాడారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లోకి కొరియన్ స్టార్టప్‌లకు ఆహ్వానం పలికారు. భారతదేశ ఏఐ రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతామని చెప్పుకొచ్చారు. అమరావతి మిగతా 2లో..

## గిరిజన ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లు



- పబ్లిక్ గ్రీవెన్స్ సమస్యలు తక్షణం పరిష్కరించాలి
- అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు

అమరావతి,జూలై6 : గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గిరిజనులకు నాణ్యమైన భోజనం అందించాలన్నదే లక్ష్యమని అన్నారు. పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని వ్యాఖ్యానించారు. పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో జీరో వేస్ట్ లక్ష్యమని పేర్కొన్నారు. సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ నుంచి వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు అంశాలపై ముఖ్యమంత్రి మిగతా 2లో..

## ఎపిలో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు

చేయించారు. కొత్తగా నియమితులైన సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తమ్ కుమార్ చింతలపూడి అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో కేంద్ర న్యాయశాఖ అధికారిక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నియామకాలతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 29 నుంచి 32కు పెరిగింది. హైకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన అదనపు న్యాయమూర్తులకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ శుభాకాంక్షలు తెలిపారు.

## దలైలామా దీర్ఘాయుష్షుతో జీవించాలి

ఆరోగ్యం, ఆనందం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్ట్ చేశారు. ప్రపంచ శాంతి, మానవ హక్కుల కోసం దలైలామా కృషి ప్రశంసనీయమని కొనియాడారు. 'శాంతి, కరుణ, మానవత్వానికి దలైలామా ప్రతీక. దశాబ్దాలుగా ప్రపంచాన్ని ప్రేరేపిస్తున్న మహోన్నతుడు దలైలామా. దయ, జ్ఞానం, అహింసను ఆచరించాలని దలైలామా సందేశం ఇచ్చారు. ప్రపంచ శాంతి, మానవ హక్కుల కోసం దలైలామా కృషి ప్రశంసనీయం. దలైలామాకు సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, దీర్ఘాయుష్షు కలగాలి. శాంతి, కరుణ వ్యాప్తి చేసే దలైలామా సేవలు చిరస్మరణీయం. దలైలామా తన మహోన్నత సేవలను మరింత కాలం కొనసాగించాలి' అని ఆకాంక్షిస్తూ ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల పోరాట యోధుడు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు నివాళు లర్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'సామాజిక న్యాయ సాధనకు, బడుగు బలహీన వర్గాల సాధికారతకు, సమాన అవకాశాలు కలిగిన సమసమాజ నిర్మాణానికి జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్. దేశ వ్యవసాయ రంగంలో హరిత విప్లవానికి బలమైన పునాది వేసి, ఆహార భద్రత సాధనలో విశిష్ట పాత్ర పోషించిన దూరదృష్టి గల నాయకుడు. ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్ఫూర్తిదాయక సేవలను స్మరించుకుంటూ ఘన నివాళు లర్పిస్తున్నాను' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

## ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు.. లక్ష ఉద్యోగాలు

కేంద్రంగా ఆర్టీఐహెచ్.. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, అనంతపురంలో ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. ఇప్పటికే 2,500కు పైగా స్టార్టప్‌లకు ఆర్టీఐహెచ్ మద్దతు ఇచ్చిందని వివరించారు. 5,200 మందికి పైగా వ్యవస్థాపకులకు ఇన్నోవేషన్ హబ్ భాగస్వామ్యం కల్పించిందని వెల్లడించారు. స్టార్టప్‌లకు సీడ్ ఫండ్, డీప్ టెక్ గ్రాంట్లు, పెట్టుబడి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. భాగస్వామ్యంతో డీప్ టెక్ ఏంజెల్ ఫండ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇండియా-కొరియా స్టార్టప్ కారిడార్ ఏర్పాటుకు కలిసి పనిచేద్దామని మంత్రి లోకేశ్ సూచించారు. కొరియన్ కంపెనీల కోసం ప్రత్యేక 'కొరియా డెస్క్' ఏర్పాటుకు ప్రతిపాదన చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టార్టప్‌లకు కొరియా మార్కెట్.. కొరియా స్టార్టప్‌లకు భారత్ మార్కెట్ ఉంటుందని చెప్పుకొచ్చారు. లాజిస్టిక్స్, ఫిన్‌టెక్, డీప్‌టెక్, అడ్వాన్స్‌డ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్‌లో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. అమరావతిలో దేశ తొలి క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అమరావతి క్వాంటం వ్యాలీలో 133 క్యూబిట్ ఎః్ఓ క్వాంటం సిస్టమ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌తో స్టార్టప్‌లకు భారీ కంప్యూటింగ్ సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

## పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట

నిర్వహించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలని.. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. అక్కడ వీరభద్ర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు యాదగిరిగుట్ట తరహాలో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని అటవీశాఖ భూములను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలన్నారు. గుర్రంగూడ ఎకో పార్కు తరహాలో నగరంలో మరిన్ని పార్కులను తీర్చిదిద్దాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలి. అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టుల కోసం ప్రత్యేకాధికారులను నియమించాలన్నారు. పురానాపూల్, హెరిటేజ్ బ్రిడ్జిలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి. ట్రాఫిక్‌ను మళ్లించి బ్రిడ్జిపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలి. డిసెంబర్‌లో జరిగే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమిట్ ఏర్పాట్లు ప్రారంభించాలని సీఎం రేవంత్ దిశానిర్దేశర చేశారు.

## శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

ప్రధాని మోదీ తన బ్లాగ్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవిత విశేషాలను ప్రస్తావించారు. శ్యామా ప్రసాద్ సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ, దేశసేవనే జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారని చెప్పారు. వలస పాలన, విభజన రాజకీయాలు, సామాజిక సవాళ్ల వంటి అంశాలపై ఆయన రాజీపడకుండా పోరాడారని గుర్తు చేశారు. దేశ సమైక్యతే శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రజాజీవితానికి మూల సూత్రమని ప్రధాని అన్నారు. దేశ విభజన సమయంలో పశ్చిమ బెంగాల్ భారతదేశంలోనే కొనసాగడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అనంతరం జమ్మూ కశ్మీర్ సంపూర్ణ విలీనానికి కృషి చేస్తూ నిర్బంధంలోనే ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. మ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35ఏలను 2019లో తమ ప్రభుత్వం రద్దు చేసిందని, అది శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు నిజమైన నివాళి అని ప్రధాని మోదీ అభివర్ణించారు (ఎనిటతిజీ బీనితిబా). అలాగే కలకత్తా విశ్వవిద్యాలయానికి అత్యంత పిన్న వయసులో వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్యామా ప్రసాద్.. పరిశోధన, గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. స్వతంత్ర భారత తొలి పరిశ్రమల మంత్రి అయిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్, సింద్రి ఎరువుల కర్మాగారం వంటి కీలక ప్రాజెక్టులకు పునాది వేశారని ప్రధాని గుర్తు చేశారు.

## గిరిజన ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లు




దిశానిర్దేశం చేశారు. పురపాలక, పంచాయతీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై ఈ సమావేశంలో సీఎం చర్చించారు. విశాఖపట్నం సముద్రం తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తక్షణ స్పందనగా ఏయే విభాగాలు ఎలా స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ఏపీ అభివృద్ధిలో ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్‌మెంట్ - బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలని దిశానిర్దేశం చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మూడు నెలల్లో యూఎల్‌బీల్లో చెత్త తొలగింపు పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యలపై సమాచారం ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని నిర్దేశిరచారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ లాంటి అంశాల్లో స్పష్టమైన ఎస్‌ఓపీ జారీ చేయాలని ఆదేశించారు. నెలరోజుల్లోగా అన్ని ప్రభుత్వ శాఖలూ అవేర్ 2.0 ద్వారా ఏ మేరకు ఫలితాలు వచ్చాయో విశ్లేషించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కనెక్టివిటీ కోసం మారుమూల ప్రాంతాల్లోని టవర్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

# కాళేశ్వరంపై పాపం కడుక్కోండి

బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్న తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు కట్టినప్పుడు గత పాలకులకు చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే కాళేశ్వరానికి ఈ గతి పట్టేది కాదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దుయ్యబట్టారు. కేవలం అధికారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపడం ఆపాలని హితవు పలికారు. కాళేశ్వరం ప్రపంచంలోనే ఎనిమిదో వింత అన్న పెద్దమనిషి కేసీఆర్ ఇప్పటికైనా అసెంబ్లీకి రావాలి. కాళేశ్వరాన్ని ఎలా కట్టారో సమాధానం చెప్పి.. తాము చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలని సవాల్ విసిరారు. వారు ఏవైనా సలహాలు, సూచనలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీ వేదికగా చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కేసీఆర్ సభకు వచ్చి కాళేశ్వరంపై పూర్తి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే కాళేశ్వరం కట్టారని.. ఆ ప్రాజెక్టు పేరుతో నిధులు మెక్కారని ఎద్దేవా చేశారు. కానీ నిందలేమో తమ ప్రభుత్వంపై వేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని.. ప్రతిసారి కర్రు కాల్చి వాత పెడుతున్నారని హెచ్చరించారు. పేదోడి కష్టం తెలియని బీఆర్ఎస్ ప్రభుత్వానికి మాత్రం కాళేశ్వరం కట్టడానికి లక్ష కోట్ల రూపాయలు ఎలా వచ్చాయని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. అధికారం కావాలనే దాహంతో తమ ప్రభుత్వంపై నిందలు మోపడం బీఆర్ఎస్ నేతలు ఆపాలని హితవు పలికారు. చిత్తశుద్ధితో సలహాలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీకి రావాలని కోరారు. ప్రపంచంలో ఉన్న ఏడు వింతలు కాదని.. ఎనిమిదో వింత కాళేశ్వరమని ఆనాడు చెప్పిన పెద్దమనిషి అసెంబ్లీకి రావాలని సూచించారు. కాళేశ్వరం ఎలా కట్టారో చెప్పాలని, కేసీఆర్ తెలంగాణకు చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అసంపూర్తిగా కట్టి మధ్యలోనే వదిలేశారని మంత్రి పొంగులేటి ఆరోపించారు. గుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం వదిలేసిన ఆ అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అన్నింటినీ రిపేర్ చేసి త్వరలోనే పేదలకు అందిస్తామని భరోసా ఇచ్చారు. అవసరమైతే తల తాకట్టు పెట్టి అయినా సరే, అర్హులైన ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చడమే తమ ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో 32 వేల పూరి గుడిసెలు ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. మొదటి విడతలో ఇవ్వలేక పోయిన వాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో ఇస్తామని.. వారికే మొదటి ప్రాధాన్యం కల్పిస్తామని వెల్లడించారు. ఏ పార్టీల్లోని లబ్దిదారులైనా.. పైరవీ లేకుండా చిత్తశుద్ధితో ఇళ్లను మంజూరు చేస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో సిద్దిపేట గజ్వేల్, సిరిసిల్ల, నియోజకవర్గాల్లో మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అత్యధికంగా కట్టుకున్నారని చెప్పారు. వేరే నియోజకవర్గాల్లో అరకొరగా 50, 60 ఇళ్లు కట్టి అసంపూర్తిగానే వదిలేశారని తెలిపారు. రెండోవిడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని వ్యాఖ్యానించారు. గతంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కూడా డబ్బులు ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయించామని చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న 500 ఇళ్లకు నిధులు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు

# ముఖర్జీ సేవలు నిరుపమానం

వర్ధిల్లాలని ఆకాంక్షించారు. దలైలామాతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి సర్కారుకు మజ్లిస్ పార్టీ అంటే భయమా, ప్రేమా లేక రెండూ ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. భూములు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో కమిషన్ల కోసం ఆరాటపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఇందుకోసం సామాన్య ప్రజల జీవనోపాధిని బలిచేస్తోందని ఆరోపించారు. అదే సమయంలో మజ్లిస్ పార్టీ అగ్రనేతల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ ప్రభుత్వం ఎంత దూరమైనా వెళ్లేందుకు వెనుకాడటం లేదని మండిపడ్డారు. రేవంత్ సర్కార్ సాగిస్తున్న పక్షపాత పాలనకు హైడ్రా చర్యలే ప్రత్యక్ష ఉదాహరణ అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సామాన్య ప్రజల ఇళ్లు, నిర్మాణాల విషయంలో మాత్రం మెరుపు వేగంతో నిర్ణయాలు తీసుకుంటూ, కఠినంగా బుల్డోజర్లతో వ్యవహరిస్తున్న ప్రభుత్వం.. ఒవైసీ కుటుంబానికి చెందిన బారిష్టర్ ఫాతిమా ఓవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ విషయంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తోందని దుయ్యబట్టారు. సల్కం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్‌ను ఆక్రమించి ఈ క్యాంపస్ నిర్మించారనే ఆరోపణలపై తెలంగాణ హైకోర్టు పలుమార్లు జోక్యం చేసుకుని, ప్రభుత్వ జాప్యంపై చీవాట్లు పెట్టినా సర్కారు తీరు మారలేదన్నారు. హైడ్రా, విద్యాశాఖ సహా పలు శాఖల నుంచి కోర్టు వివరాలు కోరినా, సామాన్యులపై చూపించే తొందరపాటును ఫాతిమా కాలేజీ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మజ్లిస్‌ను యావత్ ముస్లిం సమాజానికి ఏకైక ప్రతినిధిగా భావిస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని కిషన్ రెడ్డి విమర్శించారు. హైడ్రా చర్యల వల్ల ఎంతోమంది పేద ముస్లింల ఇళ్లు కూలిపోయి, వారి జీవనోపాధి దెబ్బతిన్నప్పుడు మజ్లిస్ గానీ, కాంగ్రెస్ గానీ ఒక్క మాట కూడా మాట్లాడలేదని గుర్తుచేశారు. ఒవైసీ సోదరుల సొంత ఆస్తుల విషయానికి వచ్చేసరికి మాత్రం ఈ రెండు పార్టీలు ఒకే తాటిపైకి వస్తున్నాయన్నారు. పేదల ఇళ్లపై బుల్డోజర్లతో విధ్వంసం సృష్టించి, కాంగ్రెస్-మజ్లిస్ రాజకీయ బంధం కోసం పెద్దల ఆస్తులకు నిరంతర రక్షణ కల్పించడమే ఈ ప్రభుత్వ ప్రాధాన్యతగా మారిందని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలందరికీ 'ఒకే చట్టం, ఒకే న్యాయం' అనే సూత్రాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

# హైడ్రా దూకుడుతో పేదలకు నష్టం

ఉన్నారని ఎద్దేవా చేశారు. దానికి పరాకాష్టగా తాను హిట్లర్ నుంచి 'హైడ్రా' అనే పదాన్ని తీసుకున్నానని సీఎం స్వయంగా ఒప్పుకున్నారని, దీన్నిబట్టే ఆయన నైజం ఏంటో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. గత ప్రభుత్వాలు పేదలకు ఇళ్ల జాగాలిచ్చి ఆదుకుంటే, రేవంత్ రెడ్డి మాత్రం పేదవాడి ఇళ్లను కూలగొట్టి, ఆ స్థలాలను పెద్దవాళ్లకు అంటగట్టడమే ఎజెండాగా పెట్టుకున్నారని, ఇలాంటి హిట్లర్ వారసత్వ సంస్థతో ప్రజలకు న్యాయం జరుగుతుందనుకోవడం భ్రమ అని దుయ్యబట్టారు. తాను మొదట్లో ఒంటరిగా నాలుగు నెలల పాటు హైడ్రాకు వ్యతిరేకంగా పోరాడినప్పుడు చాలామంది ప్రశ్నించారని, కానీ ఇప్పుడు హైడ్రా నిజస్వరూపం ఏంటో అందరికీ తెలిసిందని, చివరకు న్యాయస్థానాలు కూడా అదే విషయాన్ని స్పష్టం చేశాయని ఈటల రాజేందర్ గుర్తుచేశారు. రాజ్యాంగ బద్ధంగా పనిచేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగాన్ని పక్కనబెట్టి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తనకు ఏ చట్టాలతో, కోర్టులతో సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శని, ఆదివారాలు చూసుకుని ఇళ్లను ధ్వంసం చేయడంపై కోర్టు సైతం తీవ్రంగా మందలించిందని.. 'నీకు చట్టమంటే గౌరవం లేదా? నువ్వు చట్ట పరిధిలోకి రావా? జాగ్రత్తగా ఉండకపోతే జైల్లో పెడతాం' అని హెచ్చరించినా ఆయన తీరు మార్చుకోవడం లేదని, ఇలాగే మున్ముందు వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అస్మత్‌పేటలో ఇల్లు కూల్చివేతతో ఒక మహిళ ఏడ్చిన విధానం హైదరాబాదు బస్తీల్లో ఉన్న ప్రతి పేదవాడి ఆవేదనకు అద్దం పడుతోందని, వీరందరికీ తెలంగాణలోని పేదల మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. హైడ్రా పేరుతో సాగుతున్న ఈ డ్రామాలకు, రేవంత్ రెడ్డి అహంకారానికి రాబోయే మున్సిపల్, జీహెచ్ఎంసీ (ఉఊఓఅ) ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా తగిన సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఈటల రాజేందర్ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ ప్రజావ్యతిరేక నిర్ణయాల వల్ల రాబోయే ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని జోస్యం చెప్పారు. పేదవాడి గూడును చెడగొట్టి కూల్చివేతల రాజకీయం చేస్తున్న రేవంత్ రెడ్డి అరాచక పాలనకు అంతం దగ్గర పడిందని, ప్రజల ఆగ్రహానికి ఈ ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని ఈటల రాజేందర్ ఘాటుగా విమర్శించారు.

# బిజెపి కార్యాలయంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

పార్టీలు రాజకీయ నాటకాలు ఆడుతున్నాయని ఆరోపించారు. కాళేశ్వరం డ్యాం భద్రతపై జాతీయ డ్యాం భద్రతా సంస్థ హెచ్చరికలు చేసినప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికీ మరమ్మతులు ప్రారంభించకపోవడం ప్రభుత్వ ఘోర నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా మార్చుకుని భారీ అవినీతికి పాల్పడిందని ఆరోపించిన రాంచందర్ రావు, ఆ అవినీతి అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. అవినీతిపై నామమాత్ర చర్యలతో ప్రభుత్వం చేతులు దులుపుకుందని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. మరోవైపు హైడ్రా చర్యలపై కూడా ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను మాత్రమే కూల్చివేస్తున్నారని, అయితే ఎంఐఎంకు చెందిన అక్రమ నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఫాతిమా విద్యాసంస్థలలో నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు అధికారులే కోర్టుకు తెలిపారని, హైకోర్టు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఆక్రమణలు జరిగినట్లు అంగీకరించినప్పటికీ అక్రమ నిర్మాణాలను తొలగించకపోవడం వెనుక కాంగ్రెస్, ఎంఐఎం దోస్తీ కారణమని రాంచందర్ రావు ఆరోపించారు. హైడ్రా నిష్పక్షపాతంగా పనిచేసి అందరికీ ఒకే విధమైన న్యాయం చేయాలని, హైకోర్టు ఆదేశాల మేరకు ఎంఐఎంకు చెందిన అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్, ఎంఐఎం, హైడ్రా వైఖరికి వ్యతిరేకంగా బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజాపోరాటం చేపడుతుందని రాంచందర్ రావు అన్నారు.

# అయోధ్య విరాళాల దోపిడీ వ్యవహారం

సిద్దిపేట,జూలై6 : అయోధ్య విరాళాల చోరీపై బిజెపి దేశానికి క్షమాపణలు చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. జేపీ నాయకులు.. రాముని పేరుతో, అక్షింతలపై విరాళాలు అడుక్కున్నారని విమర్శించారు. బీజేపీ నాయకుల అవినీతిని గుర్తించి అయోధ్య ప్రజలే ఆ పార్టీ ఎంపీని ఓడించారన్నారు. ఈ విషయంలో బీజేపీ స్పందించి.. దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీరామునికి రామ జన్మభూమిలో రామ మందిర విరాళారం నిర్మాణానికి ప్రజలు ఎవరి స్థితికి తగ్గట్టు వారు విరాళాలు ఇచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. విరాళాల్లో కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని ఆరోపించారు. రాజకీయంగా ఎదగడానికి రాముని పేరును కమలం పార్టీ వాడుకుందని ఆరోపించారు. రాజకీయం వేరు, భక్తి వేరని మంత్రి తెలిపారు. ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షా, యూపీ ముఖ్యమంత్రిదే బాధ్యత అని అన్నారు. రాముడి హుండీలోని విరాళాలను ఎత్తుకెళ్లడం దేశ ప్రజలకు అవమానకరమన్నారు. భక్తి పేరుతో, రాముని పేరుతో రాజకీయం చేసే వారి రంగును ప్రజలు గుర్తించాలని తెలిపారు. దేవుడి పేరుపై బీజేపీ స్కాం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. అయోధ్యలో రామ జన్మభూమి నిర్మాణం జరగాలనీ శిలాన్యాసం రాజీవ్ గాంధీ గారు వేశారు..అయోధ్య ట్రస్ట్ నిర్వాహకులు ప్రధాని మోదీ, అమిత్ షా,ముఖ్యమంత్రి గారికి సన్నిహితులు వారు ఎందుకు స్పందించడం లేదన్నారు. హుండీలు కొల్లగొట్టారు..రాముని పేరు మీద దేశ వ్యాప్తంగా వసూలు చేసిన చందాలు ఎత్తుకొని పోయారు.. ఇక్కడ ప్రతి ఊర్లో అక్షింతలు పంచి ఓట్లు అడిగారు.. మీకు రామునికి వ్యతిరేకం కాదు..మేము శ్రీరాముడి కళ్యాణంలో పాల్గొంటాం..ఇల్లంతకుంట రామాలయంలో నేను ఎంపీగా ఉన్నప్పుడు ప్రారంభించిన బోజన కార్యక్రమం ఇప్పటికీ నడుస్తుంది..రామాలయం పై బీజేపీ పెద్దలు స్పందించాలి...భక్తి పేరు మీద రాముని పేరు మీద రాజకీయాలు చేసే వారు మాట్లాడాలని పొన్నం అన్నారు. అక్కడ జరిగిన దానిపై పొరపాటు అని దేశ ప్రజలకు క్షమాపణలు అడగాలి..రామ జన్మభూమి అయోధ్య ఆలయంలో సొమ్ములు దొంగిలించడంపై హిందువులు అందరికీ అవమానం..దేవుడి పేరు మీద జరిగిన స్కాం.. దేవుడి స్కాం కి వాడుకున్న పార్టీ బీజేపీ అన్నారు. మజ్లిస్ పేరు తీయంది కిషన్ రెడ్డి బతకడు..కిషన్ రెడ్డి గెలవాలంటే మజ్లిస్ ను తిట్టాలి ఇది వారి రాజకీయాలు అంటూ విమర్శించారు. రాష్ట్రంలో ఓటరు సవరణ ప్రక్రియ జరుగుతుంది. ఓటరు సవరణ ప్రజాస్వామ్యంలో చాలా ముఖ్యమైంది..ప్రతి ఇంటింటా ఎన్యూమరేషన్ ఫారాలు చేరాయి.. బిఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ అర్హత కలిగిన ఒక ఓటు కూడా మిస్ కాకుండా చూడాలన్నారు. నేను స్వయంగా ఏడు మండలాలు ప్రత్యక్షంగా తిరిగాను..మా పార్టీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాం..హైదరాబాద్ ,సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో బతిస పై ఉప ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగింది..ఓటరు సవరణ ప్రక్రియ విజయవంతంగా జరగాలని అన్నారు.

## కాళేశ్వరంను కూలేశ్వరం చేసింది ఎవరు?

కొట్టుకుపోవాలని కేటీఆర్ చూస్తున్నారా.. అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవితాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందని మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో నీటి పారుదల శాఖను నాశనం చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు ఏది ముట్టుకుంటే అది నాశనమని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నాయకుల లాభం కోసం కాళేశ్వరం కట్టారు తప్ప.. తెలంగాణ ప్రజల కోసం కాదని చెప్పుకొచ్చారు. కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టు ఇచ్చారని మంత్రి తెలిపారు. ఆ ప్రాజెక్టులు అన్ని అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది కేసీఆర్ హయాంలోనే.. కూలిపోయింది వాళ్ల హయాంలోనే అని ఇంజినీర్లు రిపోర్ట్ ఇచ్చారని ప్రస్తావించారు. కన్నెపల్లి పంపు దగ్గరకు పోయి ప్రాణహిత పంపు ఆన్ చేసి నీళ్లు ఇవ్వాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ నాటకాలు ఆడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సరిగ్గా కడితే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ వల్లే కాళేశ్వరం నీళ్లు ఉపయోగించలేక పోతున్నామని అన్నారు. నాసిరక నిర్మాణం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు ఉపయోగించలేక పోతున్నామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫౌండేషన్ తప్పుగా ఉందని అధికారులు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. కాళేశ్వరం ఇలానే కొనసాగిస్తే ప్రమాదమని అంతర్జాతీయ, జాతీయ నీటి నిపుణులు నివేదిక ఇచ్చారని అన్నారు. కేటీఆర్ కన్నా ఎన్డీఎస్ఏ అధికారులకు నాలెడ్జ్ ఎక్కువగా ఉందని తాను అనుకుంటున్నానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు స్టోరేజ్ చేసినప్పుడు కూలిపోతే కింద ఉన్న 40 ఊర్లు, భద్రాచలం కొట్టుకుపోతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు కమిషన్లకు కక్కుర్తి పడి తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టకుండా తెలంగాణ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. లేకపోతే ఎప్పుడో ఉత్తర తెలంగాణ సస్యశామలం అయ్యేదని వివరించారు. తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసింది కాక ఇప్పుడు ఎదురుదాడి విమర్శలు చేయడంపై మంత్రుఇ సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ నేటితో పూర్తి కావాలి

బలహీనంగా ఉన్నారో వారిని గుర్తించి ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో వారికి సూపర్ వైజర్లు సహకరించాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో స్థానికంగా వాలంటీర్లను గుర్తించి వారి ద్వారా పూరించేందుకు ఓటర్లకు సహకరించాలని సూచించారు. సంబంధిత సూపర్ వైజర్ల ఫోన్ నెంబర్లను మీడియా ద్వారా తెలియజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. హైదరబాద్లో ఇప్పటికే ప్రారంభమైన 16 హెల్ప్ డెస్క్ లతో పాటు అవసరమైన చోట అదనంగా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్లను సిఇఒ ఆదేశించారు. పూర్తయిన ఎన్యూమరేషన్ ఫారాలలో సదరు ఓటరు, బిఎల్ఒ సంతకాలు ఉండేలా చూడాలని దీంతో పాటు ఫోటోలు ఉండేలా చూడాలని సిఇఒ ఆదేశించారు. ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు విస్తృతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలకు సంబంధించి డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను కూడా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వివిధ పోలింగ్ కేంద్రాలలో కాకుండా ఒకే పోలింగ్ కేంద్రంలో వారి పేర్లు ఉండేవిధంగా చూడాలన్నారు. ఆన్ లైన్ ద్వారా వచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను కూడా బిఎల్ఒలు సరి చూసు కోవాలని, ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో మరోసారి బిఎల్ఒలకు, సూపర్ వైజర్లకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లను సిఇఒ ఆదేశించారు. బిఎల్ఒలు తప్పనిసరిగా రాజకీయ పార్టీలతో సమావేశాలు జరిగేవిధంగా చూడాలని, సర్ ప్రక్రియపై వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సిఇఒ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ ఎన్నికల అధికారి చారి, డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య, చిరంజీవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ అసెంబ్లీ లో కొత్త శకం మొదలు





హైదరాబాద్,జూలై6 : తెలంగాణ అసెంబ్లీలో నూతన శకం ప్రారంభమైంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోనూ... ఇటు తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి కూడా అసెంబ్లీలో మీడియా అడ్వైజరీ కమిటి కి ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. కానీ సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారి ఆదేశాలతో అసెంబ్లీ.. మండలి కార్యదర్శులు మీడియా అడ్వైజరీ కమిటి కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు పనులు దగ్గరుండి పర్యవేక్షించారు. అసెంబ్లీ అడ్వైజరీ కమిటి కోసం ప్రత్యేకంగా దేశం లో ఏ అసెంబ్లీ లో ప్రత్యేక కార్యాలయం లేదు. పార్లమెంట్ లో కూడా ఇలాంటి వసతి ఏర్పాటు జరగలేదు. కాని మొదటి సారు తెలంగాణ అసెంబ్లీ లో మీడియా అడ్వైజరీ కమిటి కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు జరిగింది.మీడియా అడ్వైజరీ కమిటి కార్యాలయం ఇవాళ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి..స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. ఎంపీ వేం నరేందర్ రెడ్డి లు ప్రారంభించారు. కమిటి చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కో చైర్మన్ పరిపూర్ణ చారి. కమిటి సభ్యులు.. ఉదయం పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

# ప్రజా ఫిర్యాదుల పట్ల బాధ్యతగా స్పందించాలి

## - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప,జూలై 6 (విజన్ ఆంధ్ర) ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల బాధ్యతాయుతంగా స్పందిస్తూ.అర్జీదారులకు సంతృప్త స్థాయిలో నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారుసోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి ముఖ్య అతిథిగా హాజరు కాగా, జేసీ డా. నిధీమీనా, డిఆర్వో మల్లికార్జునుడు ఇతర జిల్లా స్థాయి అధికారులు ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోందన్నారు. ఈవేదిక ద్వారా అంతే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని, అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ క్లినిక్ ల ద్వారా భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశీలనలో.పిజిఆర్ఎస్ వ్యవస్థ నిర్వహణలో జిల్లా పనితీరు బాగుందని అర్జీల పరిష్కారంలో ఇంకా కొద్దిపాటి ఆలస్యంపై అన్ని శాఖకు అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల పరిష్కార నివేదిక అందివ్వడంలో గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీ బాధ్య అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన, నేరుగా అర్జీదారులతో మాట్లాడటం జరగాలన్నారు. పొంతనలేని సమాధానాలు అర్జీదారులకు అందివ్వకూడదని, అర్జీదారుడు అందించే ఫిర్యాదుకు సరైన, సూటి సమాధానం ఇవ్వాలన్నారు. ఈ విషయంలో తహసీల్దార్లు శాఖాధిపతులు ఎల్లపుడు పైస్థాయి అధికారులు, పిజిఆర్ఎస్ సిబ్బంది, ఫిర్యాదుదారులు సమాచారం అందిపుచ్చుకునేలా అందుబాటులో ఉండాలని, ఎక్కడా కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చేసుకోవాలన్నారు. కార్యాలయ వ్యవస్థను పదిలం చేయడంలో ప్రధాన భూమిక పోషించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు.

1) సికేదిన్నె మండలం బలిజపల్లి గ్రామానికి చెందిన కొండయ్య తమ గ్రామానికి బస్సు సర్వీస్ నిలిపి వేశారని. ఆటోలు లేక ప్రయాణానికి ఇబ్బందిగా ఉందని బస్సు సౌకర్యం కల్పించాలని అర్జీని సమర్పించారు. 2) చెన్నూరు మండలంకు చెందిన పి.సుబ్బన్న వృద్ధాప్య పెన్షన్ మంజూరు కొరకు జిల్లా కలెక్టర్ వారికి అర్జీని సమర్పించారు. 3) సికేదిన్నె మండలం కొలుమల పల్లెకి చెందిన ఆర్ పెద్ద మల్లారెడ్డి... కొలుమలపల్లె, జమాల్ పల్లె, ఇప్పపెంట గ్రామాలలోని పంట పొలాలలో 765 కేవీ ట్రాన్స్మిషన్ లైన్స్ వేస్తున్నారని ప్రభుత్వానికి ట్రాన్స్మిషన్ లైన్స్ వేయవద్దని విన్నవించుకున్నా కూడా లైన్స్ వేశారని ప్రస్తుతం ప్రభుత్వానికి లైన్స్ వేయకుండా చర్యలు తీసుకోవాలని అర్జీని సమర్పించారు. 4) వీరబల్లి మండలానికి చెందిన బి. భాస్కర్ రెడ్డి వీరబల్లి సబ్ స్టేషన్ వెనకాల 1980 సం నుండి ఉన్న ఆశ్రమంలో 1994 లో నాటిన దేవత మరి చెట్టుని మీాణచీ సరస్వతిఏ కుంటి స్వామి అకారణంగా 18.06.2024 న నరికి వేయడం జరిగిందని విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని అర్జీని సమర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఓ సుబ్రమణ్యం,ఇంచార్జి డీపీవో వెంకటసుబ్బయ్య, డిఆర్డిఏ పిడి జి.రాజ్యలక్ష్మి, డీఎస్ఓ రఘురాం, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా,జూలై 06,(విజన్ ఆంధ్ర); ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగులందరూ తప్పనిసరిగా ప్రతి రోజూ ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భారత దేశ మాజీ ఉప ప్రధాని స్వర్గీయ శ్రీ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



ఖమ్మం అర్బన్ 06( విజన్ ఆంధ్ర) కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్వర్యంలో భారత దేశ మాజీ ఉప ప్రధాని,స్వాతంత్ర్య సమర యోధులు స్వర్గీయ శ్రీ బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటానికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కోండబాల కోటేశ్వరరావు తో కలిసి పూల మాలలు వేసి నివాళు లు అర్పించారు భారత సమాజానికి, ముఖ్యంగా వ్యవసాయం మరియు కార్మిక రంగాలకు ఆయన చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని కొనియాడారు దేశ స్వాతంత్ర్యం కోసం,సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శ నేత బాబు జగ్జీవన్ రామ్ అని రాయల నాగేశ్వరరావు అన్నారు తర తరాలుగా సామాజిక ఆర్థిక వివక్షకు గురౌతున్న దళిత సమాజాభివృద్ధికి ప్రభుత్వం పాటుపడుతున్నదని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్.టి.ఎ మెంబర్ గజ్జెల వెంకన్న మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య,కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్,యస్.సి.సెల్ అధ్యక్షులు బోడ్డు బోందయ్య,సయ్యద్ హుస్సేన్ గౌస్ కిలారు అనిల్ బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ గజ్జి సూర్య నారాయణ,అజ్గార్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు

## ఈ నెల 10న జడ్పీ సర్వసభ్య సమావేశం.

కడప,జూలై 6: (విజన్ ఆంధ్ర) ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని అనివార్య కారణాల వల్ల ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసినట్లు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి (సీఈఓ) సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ఈ సమావేశాన్ని జూన్ 18న నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ, గౌరవ అధ్యక్షుల ఆదేశాల మేరకు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. వాయిదా పడిన ఈ సమావేశాన్ని జూలై 10 (శుక్రవారం) ఉదయం 10 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సమాచారాన్ని గుర్తెరిగి ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జెడ్పీటీసీ) సభ్యులు, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని ఈ సందర్భంగా సీఈఓ కోరారు.

## ప్రజావాణికి 131 ఫిర్యాదులు



నిజామాబాద్, జూలై 06 : (విజన్ ఆంధ్ర )ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 131 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్, భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, డీఆర్డీఓ సాయన్న, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి - అదనపు కలెక్టర్

నల్లగొండ జిల్లా జూలై 06(విజన్ ఆంధ్ర); ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలనీ రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం జాప్యం చేయవద్దని,ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అలాగే ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులు కూడా జాప్యం లేకుండా పరిష్కరించాలని చెప్పారు.వివిధ శాఖలలో ఔట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను వెంటనే సమర్పించాలని జిల్లా అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి ,గృహనిర్మాణ శాఖ పిడి రాజకుమార్, డిఆర్ఓ దశరథ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్యామ ప్రసాద్ ముఖర్జీని స్మరించుకోవడం మన అందరి బాధ్యత



నిజామాబాద్ జూలై 06:( విజన్ ఆంధ్ర) జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి , పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మారెడ్డి వనిత అధ్యక్షతన శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో "విద్యార్థుల సమ్మేళనం" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... అఖండ భారత నిర్మాణానికి పునాదులు వేసిన గొప్ప దేశభక్తుడు, డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ని స్మరించుకోవడం మనందరి బాధ్యత. వారి జీవితం నేటి యువతకు ఆదర్శం.డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వ్యక్తిత్వం అసాధారణమైనది. కేవలం 33 ఏళ్ల అతి చిన్న వయసులోనే విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ కావడమే ఆయన మేధస్సుకు నిదర్శనం. వయసు చిన్నదైనా, ఆలోచన గొప్పగా ఉంటే ఏ శిఖరాన్నైనా అధిరోహించవచ్చని ఆయన మనకు నిరూపించారు. స్త్రీ విద్యపై ఆయనకు అపారమైన నమ్మకం ఉండేది. ఒక మహిళ విద్యావంతురాలైతే, ఆ కుటుంబమే కాదు, సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుందని ఆయన నమ్మేవారు. నేడు మనం టెక్నాలజీ యుగంలో ఉన్నాం. AI మరియు డిజిటల్ టూల్స్‌ను ఉపయోగించుకుని మీరంతా గ్లోబల్ సిటిజన్స్‌గా ఎదగాలి. ముఖర్జీ చెప్పిన 'స్వదేశీ' స్ఫూర్తిని తీసుకుందాం. స్థానిక వనరులను వాడుకుంటూ, కొత్త ఆవిష్కరణలు చేద్దాం. ఆయన కలలుగన్న స్వదేశీ ఆర్థిక విధానానికి నేడు 'మేక్ ఇన్ ఇండియా' తోడై, భారత్ 'ఆత్మనిర్భర్ భారత్'గా దూసుకుపోతోంది అని, క్రమశిక్షణ, దేశభక్తి, నిరంతర అభ్యాసం – ఇవే మీ ఆయుధాలు. మీరు కేవలం విద్యార్థులు మాత్రమే కాదు, రేపటి భారతదేశాన్ని నిర్మించే శిల్పులు" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గద్దె భూమన్న, పోతన్ కార్ లక్ష్మీనారాయణ, నగ్గోల్ల లక్ష్మీనారాయణ, ప్రమోద్ కుమార్, నిమ్మల శ్రీనివాస్, రాంచందర్, జ్యోతి, సవిత ఉప్పు, వర లక్ష్మి, వైష్ణవి , బిలోజి నాయక్, బొబ్బిలి వేణు, ఓం సింగ్, పురుషోత్తం, చింత శ్రీనివాస్ రెడ్డి, పుట్ట వీరేందర్, పిల్లి శ్రీకాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

## - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి




నిజామాబాద్, జూలై 06 :( విజన్ ఆంధ్ర ) పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సూచించారు. ఎస్ఐఆర్ పురోగతిపై సోమవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బీఎల్ఓలు, సూపర్వైజర్లు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అర్హులైన ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని మంగళవారం లోపు పూర్తి చేయాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూరించే విషయంలో ఓటర్లకు సహకరించేలా పట్టణ ప్రాంతాల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, వివరాల డిజిటలైజేషన్ సమాంతరంగా జరిగేలా చూడాలన్నారు. ముఖ్యంగా బీఎల్ఓ సూపర్వైజర్లు ఎన్యూమరేషన్ ఫారంల స్క్రూటినీలో అప్రమత్తంగా ఉంటూ కీలకంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారంపై ఓటరు సంతకం, లేటెస్ట్ పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, బీఎల్ఓ సంతకం ఉందా లేదా అన్నది క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కాగా, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను కూడా నిర్ణీత గడువు లోపు పూర్తి చేసి వివరాలు పంపాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు అందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 96 శాతం పూర్తయిందని, నిజామాబాద్ అర్బన్ లో కూడా మంగళవారం వరకు పూర్తి చేస్తామని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఓటర్లకు సహకరించేలా నిజామాబాద్ నగరంలో సర్కిల్ వారీగా హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేశామని అన్నారు. ఓటర్ల నుండి ఎన్యూమరేషన్ ఫారంల సేకరణ జరుపుతూ డిజిటలైజ్ చేయిస్తున్నామని, ఇప్పటికే 16శాతం పూర్తయ్యిందని సీ.ఈ.ఓ దృష్టికి తెచ్చారు. కాగా, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని నిర్ణీత గడువు లోపు పూర్తి చేయడంలో బీఎల్ఓ సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు అంకిత భావంతో కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ భుజంగరావు, సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, డీపీఓ శ్రీనివాస్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

## - అదనపు కలెక్టర్ మధుమోహన్



గద్వాల జూలై 06 ( విజన్ ఆంధ్ర బ్యూరో) : కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను జిల్లాలో సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్ అన్నారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియపై సోమవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి సంబంధిత అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఎన్నుమరేషన్ పత్రాలను ప్రతి ఇంటికి అందజేయడమే కాక పూరించిన పత్రాల వివరాలను నిర్దేశిత యాప్ లో ఎప్పటికప్పుడు బిఎల్వోలు నమోదు చేసేలా మండలాల అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. పత్రాలను పూరించడంలో ఇబ్బందులు పడుతున్న ఓటర్లకు బిఎల్ఎలు, వాలంటీర్లు సహకరించేలా చూడాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ పై ప్రతి బుధవారం సమావేశం నిర్వహించాలన్నారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ మధుమోహన్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపుగా ప్రతి ఇంటికి ఎన్నుమరేషన్ పత్రాలను ఇవ్వడం జరిగిందని, వాలంటీర్ల సహకారంతో ఓటర్లు ఆ పత్రాలను ఫిలప్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ నిబంధనల ప్రకారం చేయడం జరుగుతుందని తెలిపారు. వీసీ అనంతరం వివిధ మండలాల తహసిల్దార్లతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. బిఎల్ఓ లకు ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా సూపర్వైజర్లు, ఏఈఆర్వోలు వాటిని పరిష్కరించాలన్నారు. ఒకే కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ స్టేషన్లో నమోదయ్యేలా చూడాలన్నారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా పారదర్శకంగా రూపొందించేందుకు నిర్వహిస్తున్న ఓటరు జాబితా సమగ్ర సవరణను జిల్లాలో పచ్చడ బందీగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులందరూ చిత్తశుద్ధి తో పనిచేయాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టరు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

## - వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్



వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై06(విజన్ ఆంధ్ర); పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి ప్రజలకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సోమవారం ఆమె తొలిసారిగా హనుమకొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను తనిఖీ చేసి, వాటి స్వాధీనానికి గల కారణాలు, కేసుల పురోగతి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసు నమోదులు, ఇతర పరిపాలనా అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను తెలుసుకుని, వారి విధి నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, పోలీసులు ప్రజల సేవకులనే భావనతో విధులు నిర్వహించాల్సిన బాధ్యత ఉందన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి రసీదు అందజేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించారనే నమ్మకం ప్రజల్లో కలిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను అనవసరంగా ఎక్కువసేపు వేచి ఉండే పరిస్థితి రాకుండా చూడాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో వచ్చే అత్యవసర ఫిర్యాదుల విషయంలో విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి, వెంటనే స్టేషన్ అధికారులకు సమాచారం అందించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే శాఖాపరమైన సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ఇకపై పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే సమర్పించాలని, వాటి పరిష్కార ప్రక్రియను స్టేషన్ అడ్మిన్ ఎస్ఐ పర్యవేక్షించి, బాధ్యతాయుతంగా నిర్వహించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ఏసీపీలు నర్సింహరావు, సత్యనారాయణ, హనుమకొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావులేదు - జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, జూలై 06 (విజన్ ఆంధ్ర): ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును నిర్దేశిత గడువులోగా పరిష్కరించడం అధికారుల ప్రథమ బాధ్యత అని ఆయన అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధి హామీ పథకం, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 94 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రతి అర్జీపై సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి, సమన్వయంతో చర్యలు తీసుకుని సమస్యలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోగా పరిష్కరించాలని, మండల స్థాయిలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహించి, తీసుకున్న చర్యల వివరాలను సకాలంలో ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని, అప్పీల్ కేసులను రెండు నుంచి మూడు రోజుల్లోనే పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్.ఎస్. చిత్రు, డీఆర్ఓ స్రవంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను వాహనాలకు బిగించరాదు: ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్, జూలై 06(విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ పట్టణంలో యువత తమ వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లను, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను బిగించరాదని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. చిన్నపిల్లలకు, మహిళలకు, వృద్ధులకు ఆసుపత్రి పరిసరాలలో ఇబ్బందులు కలిగించే తరుణంలో జిల్లా పోలీసు యంత్రాంగం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు నెల రోజులుగా పట్టణంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో భాగంగా పట్టణంలో 121 మోడిఫైడ్ సైలెన్సర్లను గుర్తించినట్లు తెలిపారు. వాటిని వాహనాల నుండి తొలగించి కంపెనీ నుండి కేటాయించబడిన సైలెన్సర్లను మాత్రమే బిగించి వాహనదారులకు విడిచిపెట్టారు. ఇలా సేకరించిన 121 మోడిఫైడ్ సైలెన్సర్లను సోమవారం స్థానిక కలెక్టర్ చౌరస్తా నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సమక్షంలో రోడ్డు రోలర్ తో తొక్కించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. యువత ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా మోడిఫైడ్ సైలెన్సర్లను బిగించకూడదని సూచించారు. ఇకనుండి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించబడుతుందని, మాడిఫైడ్ సైలెన్సర్లను బిగించిన, పటాకా సౌండ్స్ వచ్చేలా ఏర్పాటు చేసిన సైలెన్సర్లను వారి వాహనాల నుండి తొలగించి వారిపై కేసుల నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ కింద వారిపై కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు. స్థానిక మెకానిక్ లకు తెలియజేస్తూ ఎవరైనా మోడిఫైడ్ సైలెన్సర్లను బిగించమని విజ్ఞప్తి చేస్తే బిగించకుండా ఉండాలని తెలియజేశారు. అదేవిధంగా నిబంధనల అతిక్రమించి పోలీస్ సైరన్ ను అనధికారికంగా వినియోగిస్తున్న వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మాడిఫైడ్ సైలెన్సర్లపై లేదా పోలీస్ సైరన్ ను వినియోగిస్తున్న వారి ఫోటోను తీసి ఆ సమాచారాన్ని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ 8712659922 నెంబర్ కు తెలియజేయాలని అన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ ఇప్పటివరకు పట్టణంలో స్థానిక ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రణయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు బి. సునీల్ కుమార్, ప్రణయ్ కుమార్, ఎస్ఐలు దేవేందర్, ప్రణయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్న' రావణ్ పై 'ఉపా' కేసు ఉపసంహరించాలి

**- కక్ష సాధింపు చర్యలను, వేధింపులను మానాలి - రైతు కూలీ సంఘం .**



ములుగు జూలై 06 ,విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిపై యూట్యూబర్ 'ప్రశ్న' రావణ్ అభ్యంతర వ్యాఖ్యలు చేశారనే అభియోగంపై కోర్టు బెయిల్ ఇచ్చినా, ఇప్పటివరకు 5 సార్లు అరెస్టు చేసి, చివరకు 'ఉపా' చట్టం కింద జైలుకు పంపడం కక్షపూరిత చర్య అని రైతు కూలీ సంఘం (ఆర్.సి.ఎస్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు లిపట్లోళ్ల నాగిరెడ్డిలి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లివెల్తురు సదానందంలి, ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ లిమండల యుగేందర్‌లి ఖండించారు. తమను ప్రశ్నించే వారిని బెదిరించి అణచివేసేందుకు రాష్ట్ర ఎన్.డి.ఏ ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష నాయకులు ఒకరిపై ఒకరు దిగజారుడు వ్యాఖ్యలు చేస్తుండగా, సామాన్య యూట్యూబర్‌ను మాత్రం క్రూర చట్టాలతో వేధించడం సరికాదన్నారు. 'ప్రశ్న' రావణ్ పై పెట్టిన అన్ని కేసులు ఉపసంహరించి, వేధింపులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. బూర్జువా రాజకీయాలు, మీడియా నైతిక పతనం వల్లే సమాజంలో విద్వేషాలు పెరుగుతున్నాయని, ప్రజలు వాటిని తిరస్కరించాలని పిలుపునిచ్చారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ కలెక్టరేట్ ముట్టడి.



ములుగు జూలై 06, విజన్ ఆంధ్ర ప్రతినిధి : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ములుగు కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ఎల్. రవి మాట్లాడుతూ మల్లంపల్లి సోషల్ వెల్ఫేర్ పాఠశాలను ఏటూరునాగారానికి షిఫ్ట్ చేయాలని, జిల్లా కేంద్రంలో ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాస్టల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నీచర్ వంటి కనీస సదుపాయాలు కల్పించాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించకపోతే మరింత ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జాగటి రవితేజ, ఉపాధ్యక్షులు కోగిల బాలు తో పాటు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బందికి రైన్ కోట్లు అందజేత.

**విధుల్లో అలసత్వం వద్దు - జిల్లా ఎస్.పి సుధీర్ రామ్నాథ్ కేకన్ .**



ములుగు జూలై 06, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వర్షాకాలంలో విధి నిర్వహణలో సిబ్బంది ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సోమవారం జిల్లా ఎస్.పి లిసుధీర్ రామ్నాథ్ కేకన్ ఎస్.పి కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి రైన్ కోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్.పి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఏమాత్రం అలసత్వం వహించరాదని సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో ఏవైనా ఆటంకాలు లేదా సమస్యలు ఎదురైతే వెంటనే పై అధికారులకు తెలియజేయాలని సూచించారు. అవసరమైతే తనను ఎప్పుడైనా సంప్రదించవచ్చని, క్రింది స్థాయి సిబ్బందికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్.పి లిసదానందంలి, ఆర్.ఐ లిస్వామిలి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

**- అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 06 (విజన్ ఆంధ్ర) : ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి, అందుకు సంబంధించిన సమాచారాన్ని ఫిర్యాదుదారుకు తెలియజేయాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బిఎన్. ఖీమ్యా నాయక్‌బి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన అదనపు కలెక్టర్ రెవెన్యూ బివినోద్ కుమార్‌బితో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును ఎప్పటికప్పుడు పరిష్కరించి, ఆ వివరాలను సంబంధిత ఫిర్యాదుదారుకు పంపడంతో పాటు ఆన్‌లైన్‌లోనూ అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఫిర్యాదు తమ శాఖ పరిధిలో లేనట్లయితే వెంటనే సంబంధిత శాఖకు లేఖ ద్వారా పంపాలని తెలిపారు. పరిష్కరించలేని అంశాలు ఉంటే వాటిని పెండింగ్‌లో ఉంచకుండా పై అధికారులకు నివేదించాలని, లేదా ఏ నిబంధన ప్రకారం పరిష్కరించలేమో ఫిర్యాదుదారుకు వివరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను కూడా ప్రాధాన్యత క్రమంలో సత్వరం పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం బి44 దరఖాస్తులుబి అందగా, ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో బి11 దరఖాస్తులుబి అందాయి. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో బియాదయ్యాబి, శిక్షణ ఉప కలెక్టర్లు బిమేడం శ్రావ్య, రజనీకాంత్ రెడ్డిబి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సహకార వారోత్సవాల ముగింపు వేడుకలు



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 6 (విజన్ ఆంధ్ర) : భారత ప్రభుత్వ సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటై 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం వనపర్తిలో సహకార వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిసహకార మంత్రిత్వ శాఖ 5వ వార్షికోత్సవంబిను పురస్కరించుకుని సహకార సంఘాల కార్యదర్శులను, ఉత్తమ ఉద్యోగులను సన్మానించారు. క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కో–ఆపరేటివ్ క్లబ్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జిల్లా సహకార అధికారి బి. రాణి మాట్లాడుతూ, సహకార రంగం గ్రామీణాభివృద్ధి, రైతుల ఆర్థిక సాధికారతలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పిఏసిఎస్ పాత్రను వివరించారు. "సహకార్ సే సమృద్ధి" లక్ష్యంతో సహకార ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జూన్ 29 నుండి జూలై 6 వరకు జిల్లాలో మొక్కలు నాటడం, అవగాహన సదస్సులు, రైతులతో ముఖాముఖి, క్విజ్, వ్యాసరచన పోటీలు, సోషల్ మీడియా ప్రచారం వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ అధికారులు, పిఏసిఎస్ కార్యదర్శులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

**- అదనపు కలెక్టర్ మధుమోహన్**



గద్వాల జూలై 06( విజన్ ఆంధ్ర బ్యూరో ) : ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా సంబంధిత అధికారులు సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధు మోహన్ అన్నారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసి సమావేశపు మందిరంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులతో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ వారం మొత్తం 89 ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి ఎంతో ప్రాధాన్యత ఉందని, హైదరాబాద్ నుంచి కూడా రాష్ట్ర ఉన్నతాధికారులు వీటిపై సమీక్ష చేస్తారన్నారు. గద్వాల మున్సిపాలిటీకి సంబంధించి వచ్చిన అర్జీలు అత్యధికంగా పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపిన కొంతమంది అధికారులకు ఇదివరకే మెమోలు ఇవ్వడం జరిగిందన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రజావాణికి గైర్హాజరయితే ముందుగానే ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి ఎవరైనా జిల్లా అధికారులు రాలేని పరిస్థితి ఉన్నప్పుడు వారి స్థానంలో పాల్గొనేందుకు సంబంధిత శాఖల తర్వాతి స్థాయి అధికారులను పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్.ప్రోగ్రాంపై అవగాహన సదస్సు

**- బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు**



ఆలంపూర్ జులై 06 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్ చౌరస్తా ఏజీఆర్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్. ప్రోగ్రాంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు అధ్యక్షత వహించగా, బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇంచార్జి మెట్టు శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ ఎస్ఐఆర్. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏ) ప్రభుత్వ బిఎల్ఓ.లతో సమన్వయంగా పనిచేస్తూ ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా నింపేలా చూడాలని సూచించారు. ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జి మెట్టు శ్రీనివాసులు మాట్లాడుతూ, ఎస్ఐఆర్.కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా తయారుచేయడమేనని తెలిపారు. ఒకే వ్యక్తి రెండు ప్రాంతాల్లో ఓటరుగా నమోదై ఉంటే అలాంటి నమోదులను గుర్తించి, ప్రతి వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా ఎన్యుమరేషన్ ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించి ప్రతి ఇంటిని చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆలంపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**స్వయం సహాయక సంఘాల సభ్యులకు పిలుపునిచ్చిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.**



కడప,జూలై 6 (విజన్ ఆంధ్ర:) భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు చురుకుగా పాల్గొని ఓటరు జాబితాను మరింత ఖచ్చితంగా రూపొందించేందుకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటన ద్వారా కోరారు. ఇప్పటికే ఎన్యుమరేషన్ ఫారం (ఈఎఫ్) పూరించిన వారు ఆలస్యం చేయకుండా తమ ఆర్‌పీ/యానిమేటర్ ద్వారా లేదా నేరుగా బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ)కి అందజేయాలని సూచించారు. ఫారం సమర్పించని పక్షంలో డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు నమోదుకాకపోయే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంకా ఫారం పూరించని వారు వెంటనే ఆర్‌పీ, యానిమేటర్ సహాయంతో పూర్తి చేసి బీఎల్ఓకు సమర్పించాలని సూచించారు. ఫారం పూరించేందుకు బీఎల్ఓ అందించిన ఈఎఫ్ ఫారం, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్ (ఐచ్ఛికం), అలాగే 2002లో కుటుంబ సభ్యులు ఓటరుగా నమోదై ఉంటే వారి వివరాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. 2002 నాటి ఓటరు వివరాలు తెలియకపోయినా, అప్పట్లో ఓటు వేసిన గ్రామం లేదా పట్టణం పేరు తెలిస్తే బీఎల్ఓ సహకారం అందిస్తారని పేర్కొన్నారు. ఫారంలో పుట్టిన తేదీ, తల్లిదండ్రుల వివరాలు, మొబైల్ నంబర్ వంటి వ్యక్తిగత వివరాలను పూర్తిగా నమోదు చేయాలని, ఓటరు లేదా కుటుంబంలోని వయోజన సభ్యుడి సంతకం లేదా బొటనవేలు ముద్ర తప్పనిసరిగా ఉండాలని, ఫోటో సక్రమంగా అతికించి పూర్తి చేసిన ఫారాన్ని బీఎల్ఓకు అందజేయాలని సూచించారు. ఇంకా ఓటరుగా నమోదు కాని అర్హులు అవసరమైన గుర్తింపు పత్రాలు, ఫోటోతో బీఎల్ఓను సంప్రదించి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఈ కార్యక్రమంలో భాగస్వామి కావడం ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని, అందరూ బాధ్యతగా సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# ఎన్యూమరేషన్ ఫారంలను గడువు లోపు అందించాలి

**- కలెక్టర్ ఇలా త్రిపాఠి**



నిజామాబాద్, జూలై 06 :( విజన్ ఆంధ్ర ) ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారంను పూరించి, నిర్ణీత గడువు లోపు ప్రతి ఓటరు తప్పనిసరిగా బూత్ లెవెల్ అధికారికి అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సోమవారం ప్రజావాణి అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు అందరూ విధిగా ఈ నెల 24వ తేదీ లోపు ఎన్యూమరేషన్ ఫారంను నింపి బీ.ఎల్.ఓలకు అందించాలన్నారు. లేని పక్షంలో ఆగస్టు 5న ప్రచురించే ఓటర్ల ముసాయిదా జాబితాలో పేరు కోల్పోతారని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తేలికగా తీసుకోకూడదని, అధికారులు ఎంత పెద్ద హోదాలో, ఏ స్థాయిలో ఉన్నా ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఎన్యూమరేషన్ ఫారం అందించాల్సిందేనని అన్నారు. జిల్లాలో దాదాపుగా అన్ని ప్రాంతాలలో ఇప్పటికే ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. అయితే తీసుకున్న ఎన్యూమరేషన్ ఫారంలను తగిన వివరాలతో పూరించి, బీ.ఎల్.ఓలకు గడువు లోపు అందించడం ఎంతో ముఖ్యమని సూచించారు. ఈ మేరకు ఓటర్లకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని, వివిధ శాఖల జిల్లా అధికారులకు, మండల స్పెషల్ ఆఫీసర్లు అవకాశం మేరకు తహసిల్దార్ కార్యాలయాలను సందర్శించి, ఎస్.ఐ.ఆర్ అమలు తీరును, బీ.ఎల్.ఓల పనితీరును పరిశీలించాలని అన్నారు. కాగా, ఎన్యూమరేషన్ ఫారం భర్తీ విషయంలో, ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు సంబంధించి ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ, తగిన సహకారం అందిం చేందుకు వీలుగా కలెక్టరేట్ లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్ ను ఆదేశించారు. ఇదిలా ఉండగా, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్ ను క్రమం తప్పకుండా సందర్శించాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. విద్యా సంస్థలను మొక్కుబడిగా సందర్శించకుండా, వాటి పనితీరును నిశితంగా పరిశీలించాలని, ఏమైనా సమస్యలు ఉన్నాయా అన్నది గమనించాలని అన్నారు. అధికారుల సందర్శనతో విద్యా సంస్థల పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించాలన్నారు. ఓపెన్ బావులు వంటి ప్రమాదకర పరిస్థితులు నెలకొని ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. విద్యార్థులు పాముకాటు, విష కీటకాల బారిన పడకుండా అన్నివిద్యా సంస్థల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అంకిత భావంతో ఉత్తమ స్థాయిలో విధులు నిర్వర్తించే మండల స్పెషల్ ఆఫీసర్ ను ఎంపిక చేసి తగిన ప్రోత్సాహకం అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కొత్తగా రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలి

**- జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్**



నిజామాబాద్ జూలై 06:( విజన్ ఆంధ్ర ) డొంకేశ్వర్ మండలం, డొంకేశ్వర్ గ్రామంలో ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ, వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ వారి ఆధ్వర్యం లో PREUNIQUE ఇండియా Pvt. Ltd. కంపెనీ వారు నేడు రైతులకు ఆయిల్ పామ్ పంటపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ నుండి జిల్లా ఉద్యాన అధికారి శ్రీనివాస్ , ఆర్మూర్ డివిజన్ ఉద్యాన అధికారి సంధ్య రాణి, మోర్తాడ్ డివిజన్ ఉద్యాన అధికారి రాజు, భీమ్గల్ డివిజన్ ఉద్యాన అధికారి రోహిత్, HEO లు, అగ్రికల్చర్ శాఖ నుండి ADA విజయలక్ష్మి, AO మధుసూదన్, AEO ప్రశాంత్, MRO ప్రసాద్, డొంకేశ్వర్ మండలం సర్పంచ్ లు బైండ్ల అనిత శ్రీనివాస్, సుమన్, బట్టు సంజీవ్ రాజ్, అల్లరి గంగాధర్, రాచర్ల సవిత మరియు ాపీజ చైర్మన్ భరత్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. కొత్తగా రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలి అని, ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులు సంతోషంగా దిగుబడులు తీస్తున్నట్టు జిల్లా ఉద్యాన అధికారి శ్రీనివాస్ సూచించారు.

# ఓటర్ల నుండి పూరించిన ఫారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

**- బి.ఎల్.ఓ లకు ఆర్డీఓ సుబ్రమణ్యం ఆదేశం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 6 (విజన్ ఆంధ్ర) : ఓటర్ల నుండి పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించి వాటిని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్డీఓ, ఓటరు నమోదు అధికారి బిసుబ్రమణ్యంబి బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి ఫారాలను సేకరించాలని, ఫారం నింపడం తెలియని ఓటర్లకు బి.ఎల్.ఓలు దగ్గరుండి సహాయం అందించాలని సూచించారు. సోమవారం ఆయన పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల్లో పర్యటించి బూత్ లెవల్ అధికారులు, సూపర్వైజర్ల పనితీరును, జిల్లాలో కొనసాగుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పరిశీలించారు. వనపర్తి శాసనసభ నియోజకవర్గంలో ఓటర్ జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ – ఎస్ ఐఆర్ లో భాగంగా పెబ్బేరు మండలంలోని బిరంగాపూర్, కంచిరావుపల్లిబి మరియు శ్రీరంగాపూర్ మండలంలోని బికంబాలాపూర్‌బి గ్రామాలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్లు నెం. 222, 223, 225, 252, 253 మరియు 202 లను సందర్శించారు. అక్కడ బూత్ లెవల్ అధికారులు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రక్రియలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

# వనపర్తి నియోజకవర్గంలో 99.87% ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి

**- డిజిటలైజేషన్, రేషనలైజేషన్ పనులు ముమ్మరం**

**- అదనపు కలెక్టర్ టి. వినోద్ కుమార్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 6 (విజన్ ఆంధ్ర): వనపర్తి నియోజకవర్గంలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా 99.87% ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయినట్లు అదనపు కలెక్టర్ రెవెన్యూ బిటి. వినోద్ కుమార్‌బి తెలిపారు. సోమవారం రాష్ట్ర సీఈఓ బిసుదర్శన్ రెడ్డిబి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని మంగళవారం లోగా పూర్తి చేయాలని, పూరించిన ఫారాలను సేకరించి డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. వనపర్తిలో 2,75,570 మంది ఓటర్లు ఉండగా 2,75,214 ఫారాలు పంపిణీ చేసినట్లు అదనపు కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకు 17,411 ఫారాల డిజిటలైజేషన్ పూర్తయింది. బి.ఎల్.ఓల సహాయం కోసం వచ్చిన 291 ఫోన్ కాల్స్‌లో 222 కు స్పందించామన్నారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1200 మందికి మించకుండా, 2 కి.మీ పరిధిలో రేషనలైజేషన్ ప్రక్రియ కూడా ప్రారంభమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ బిసుబ్రమణ్యంబి, సూపరింటెండెంట్ బివెంకటేశ్వర్లుబి పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి

**- సందర్భంగా ఘన నివాళులు**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 6 (విజన్ ఆంధ్ర) : సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానేత, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సోమవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. దేశానికి, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ సామాజిక సమానత్వం కోసం నిరంతరం కృషి చేసిన గొప్ప నాయకుడని అన్నారు. ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలనే ఆయన ఆశయాలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు కదిరె రాములు మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ రాజకీయాల్లో విలువలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మం చారి మాట్లాడుతూ, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సామాజిక న్యాయం సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పీతాంబరం, పరుశురాం, చుక్క రాజు, నాగులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులర్పించారు.

## ఎస్ ఐఆర్-2026 కార్యక్రమం సజావుగా కొనసాగుతోంది

**- 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కొండోజు గోపీనాథ్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 6 (విజన్ ఆంధ్ర) : ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ( ఎస్ ఐఆర్ )–2026 కార్యక్రమం జవాబుదారీతనంతో సజావుగా సాగుతోందని బీజేపీ నాయకుడు, 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కొండోజు గోపీనాథ్ తెలిపారు. అక్రమ ఓటర్లను గుర్తించి తొలగించడం, ఓటరు జాబితాలో పారదర్శకత పెంచడం ఈ కార్యక్రమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. 13వ వార్డులో బీఎల్ఓలు, వీఆర్వోల పర్యవేక్షణలో కార్యక్రమం నిర్దేశిత విధానంలో చురుకుగా జరుగుతోందన్నారు. గత పాలకుల హయాంలో అక్రమ వలసలతో దేశ ఆర్థిక వ్యవస్థకు, భద్రతకు నష్టం వాటిల్లిందని ఆరోపించారు. ప్రస్తుతం దేశం ప్రపంచ అగ్రదేశంగా ఎదుగుతోందంటే అది ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వ ఫలితమేనని కొనియాడారు. సుపరిపాలన, అభివృద్ధి కోసం ప్రజలు బీజేపీకి మద్దతు ఇవ్వాలని, అవకాశవాద రాజకీయాలకు దూరంగా ఉండి పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఈనెల 24లోగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

- పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పారదర్శకంగా చేపట్టాలి.
- కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు.
- జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశాలు.

నారాయణపేట, జులై 6 (విజన్ ఆంధ్ర) : రాష్ట్రంలో ఓటరు జాబితాల ప్రత్యేక సర్వే (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని, ముఖ్యంగా ఫారాల డిజిటలైజేషన్‌ను ఈ నెల 24వ తేదీలోగా శాతం వందకు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, ప్రతి పోలింగ్ కేంద్రంలో సుమారు 1000 నుంచి 1200 మంది ఓటర్లు ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష సమావేశంలో ఆయన ఎస్ఐఆర్ పురోగతి, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, ఫారాల డిజిటలైజేషన్, రాజకీయ పార్టీలతో నిర్వహించాల్సిన సంప్రదింపులు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ ఎన్నికల వ్యవస్థలో అత్యంత కీలకమైనదని తెలిపారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఫీల్డ్ స్థాయిలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల ఓట్లు సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని, కొత్తగా రూపొందించే పోలింగ్ కేంద్రాల ముసాయిదాపై ఈ నెల 25వ తేదీ నుంచి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు స్వీకరించాలని ఆదేశించారు. అనంతరం ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుంచి పాల్గొన్న నారాయణపేట జిల్లా కలెక్టర్ సి హెచ్ ప్రియాంక జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ఈ నెల 7 వరకు పూర్తి అవుతుందని తెలిపారు. జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఫారాలు అందజేస్తున్నారని, తిరిగి నింపిన ఫారాలను స్వీకరించి వాటిలోని వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు.ఫారాల స్వీకరణతో పాటు వాటి డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా వేగవంతం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ఈ నెల 24వ తేదీ నాటికి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య సమతుల్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు సౌకర్యవంతంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు జరిగేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ నెల 25వ తేదీ నుంచి అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పోలింగ్ కేంద్రాల ముసాయిదాను సిద్ధం చేస్తామని వెల్లడించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీఓ రమేష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జయ సుధ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరిత గతిన పరిష్కరించాలి..

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ జిల్లా ప్రతినిధి జులై08(విజన్ ఆంధ్ర): వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజలనుండి వినతులు స్వీకరించారు. ఈ ప్రజావాణి కి మొత్తం 211 దరఖాస్తులు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు 67, మున్సిపాలిటీకి 55, హౌసింగ్ శాఖకు 29, ఇతర శాఖలకు సంబంధించి 60 దరఖాస్తులు వచ్చాయి.వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు తక్షణమే ఎండార్స్ చేసి సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నిర్వహించిన ప్రజావాణికి రెవెన్యూ హౌసింగ్ జడ్పీఎంపీ సమస్యలపై ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయని అట్టి దరఖాస్తులను పరిశీలనార్థం సంబంధిత శాఖలకు ఎండార్స్ చేస్తూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డి ఆర్ డి ఓ నాగ పద్మజ, డిప్యూటీ డి ఎం ఎం హెచ్ ఓ ప్రకాష్, ఏబిసిడివో పుష్పలత మరియు సంబంధిత జిల్లా అధికారులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విశేషంగా అలరించిన ఉస్తాద్ సికిందర్ ఖాన్ 'గజల్ గానామృతం'



హైదరాబాద్ జులై 2026 విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ విశ్వనాథ్) : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజాకళ 99 రోజుల కళారూపాల ప్రదర్శనలో భాగంగా 95వ రోజు రవీంద్రభారతి పాల్కురికి సోమన్న మూల వేదికలో సంగీత రసికులతో కళకళలాడింది. ప్రముఖ గజల్ గాయకుడు ఉస్తాద్ సికిందర్ ఖాన్ తన హృదయాన్ని హత్తుకునే గజల్స్‌తో ప్రేక్షకులను విశేషంగా అలరింపజేస్తూ సంగీతానుభూతి సభికులలో విహరింపజేశారు. ప్రతి గజల్‌కు ప్రేక్షకుల నుంచి ఘనమైన చప్పట్లు, ప్రశంసలు వెల్లువెత్తడంతో సభా ప్రాంగణం మారుమ్రోగింది. ఈ సంగీత విభావరికి తబ్లాపై నజీముద్దీన్, కీబోర్డుపై రఫి బక్ష్, ఆక్టోప్యాడ్‌పై తాజ్ బక్ష్ తమ అద్భుతమైన సహకారాన్ని అందించి గజల్ గానాన్ని మరింత రసవత్తరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్. ఏనుగు నర్సింహా రెడ్డి, ఐఏఎస్ , సహాయ సంచాలకులు పి. నర్సింలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. పి. విజయ్ కుమార,అలాగే సాంస్కృతిక సలహా మండలి సభ్యులు ముచర్ల దినకర్, పల్లె నర్సింహ హాజరై కళాకారుల ప్రతిభను ప్రశంశించి అభినందించారు. ముందుగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు మాపల్లె శంకర్, బాలుప్రసాద్, జ్యోత్స్న, బాబు. సమాజంలో నెలకొన్న వివిధ సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించే చైతన్య గీతాలతో పాటు జానపద గీతాలను ఆలపించి సభలో ఉత్తేజభరితమైన వాతావరణాన్ని నెలకొల్పారు. ఔత్సాహిక కళాకారులుగా మహారాజ్, రాఘవులు, భరత్ కుమార్ ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది.ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన విద్యానందాచారి, శ్రీనివాస రాజు తమ అద్భుతమైన వ్యాఖ్యానంతో కార్యక్రమాన్ని ఆద్యంతం ఆసక్తికరంగా నడిపించారు. సంగీతం, సాహిత్యం, సమ్మేళనంగా సాగిన ఈ సాయంత్రం గజల్ ప్రేమికుల హృదయాలను ఆకర్శించింది.

# పట్టా భూముల్లో సాగు చేస్తున్న ఆదివాసీలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

- అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఆదివాసీ నవనిర్మాణ సేనలి
- ఏజెన్సీ విద్య అధ్వాన్నం: ఏకోపాధ్యాయ పాఠశాలలు బాలకార్మిక కేంద్రాలుగా మారుతున్నాయని ఆవేదన.



ములుగు, జులై 4;విజన్ ఆంధ్ర ప్రతినిధి, పట్టా భూముల్లో తరతరాలుగా సాగు చేసుకుంటున్న ఆదివాసీలపై అటవీ శాఖ అధికారులు అక్రమ కేసులు పెడుతున్నారని, ఏజెన్సీ ప్రాంతంలో విద్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు లికొర్స నర్సింహా మూర్తిలి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ లిహేమంత్‌లి ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు.

1. భూముల వివాదం: చట్టాలను ఉల్లంఘిస్తున్న అటవీశాఖ

పేరూరు గ్రామంలో రెవిన్యూ పట్టాలు ఉన్న ఆదివాసీల భూములను అటవీశాఖ అధికారులు దౌర్జన్యంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సాగు చేస్తున్న రైతులపై, పని చేస్తున్న మిషన్‌పై ఎఫ్‌బీఓ, సెక్షన్ ఆఫీసర్లు అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. "షెడ్యూల్ ఏరియాలో సమత జడ్జిమెంట్, ఎల్.టి.ఆర్, పెసా చట్టాలు, అటవీ హక్కుల గుర్తింపు చట్టాలను అధికారులు అగౌరవపరుస్తున్నారు. షెడ్యూల్ ఏరియాలో ప్రభుత్వమే గిరిజనేతరుడిలా వ్యవహరిస్తోంది. కేసులు పెట్టే ముందు రైతులకు నోటీసులు ఇవ్వలేదు, పట్టాలు ఉన్నాయా లేవా అని కూడా అడగలేదు" అని నర్సింహా మూర్తి మండిపడ్డారు. జాయింట్ సర్వేలో అవి రెవిన్యూ పట్టా భూములని తేలినా కేసులు ఎత్తివేయలేదన్నారు. పెసా గ్రామసభకే భూ వివాదాలపై తుది నిర్ణయాధికారం ఉందని, దానిని గౌరవించకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

డిమాండ్:

అక్రమ కేసులను ఎటువంటి షరతులు లేకుండా రద్దు చేయాలి. ఎల్.టి.ఆర్, పెసా చట్టాలను ఉల్లంఘించిన అటవీశాఖ అధికారులపై కేసులు పెట్టాలి. లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

2. ఏజెన్సీ విద్య: "అడవికాసిన వెన్నెల"లివెంకటాపురం, వాజేడు ఏజెన్సీ మండలాల్లో విద్య పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వాజేడు, వెంకటాపురం మండలాల్లో 18 ఏకోపాధ్యాయ పాఠశాలలు, 8 ఉపాధ్యాయులు లేని పాఠశాలలులి ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. "ఏకోపాధ్యాయ పాఠశాలలు బాలకార్మికులను తయారు చేసే ప్రభుత్వ సంస్థలుగా మారాయి. విద్య ద్వారానే సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని అందరూ చెబుతున్నారు. కానీ ఆదివాసీ ప్రాంతాల్లో విద్య మిథ్యగానే మిగిలిపోయింది" అని అన్నారు. కొంతమంది ఉపాధ్యాయులు ఏజెన్సీ మండలాలు అనే నిర్లక్ష్యంతో సమయపాలన పాటించడం లేదని తెలిపారు.

1. ఏకోపాధ్యాయ పాఠశాలలను రద్దు చేసి ఉపాధ్యాయులను నియమించాలి
2. 1:20 విధానం కాకుండా తరగతుల ఆధారంగా ఉపాధ్యాయులను నియమించాలి
3. ఏజెన్సీలో విద్యా వాలంటీర్లను తక్షణమే నియమించాలి
4. ఏజెన్సీ విద్యపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించాలి

రాజ్యాంగబద్ధంగా ప్రాథమిక ఉచిత నిర్బంధ విద్య ఆదివాసీలకు అందడం లేదని, ప్రభుత్వ చిత్తశుద్ధి లోపిస్తోందని ఆయన విమర్శించారు. అన్ని సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని కలెక్టర్ హేమంత్ హామీ ఇచ్చినట్లు నర్సింహా మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

## 'ఆత్మహత్య' జీవిత లక్ష్యం కాదని తెలిపే "ఇదంనమమ" సందేశాత్మక నాటిక ప్రదర్శన



హైదరాబాద్ జులై 2026 విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర టి.వి. నాటక రంగ సంస్థ, హైదరాబాద్ సౌజన్యంతో ప్రముఖ నాటకరంగ సంస్థ తెలుగు – వెలుగు సాహిత్య సాంస్కృతిక సంస్థ, జనప్రియ, మల్లాపూర్, హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహణలో "ఇదంనమమ"సందేశాత్మక నాటిక ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం అంబేద్కర్ కళాభవన్, మల్లాపూర్, హైదరాబాద్ లో ప్రదర్శించిన ఈ సందేశాత్మక నాటిక ప్రదర్శనను రచించి,నిర్వహించి, దర్శకత్వం వహించి నాటికలో ప్రధాన పాత్ర పోషించిన "రక్తకన్నీరు నాగభూషణం", "బళ్ళారి రాఘవ" బిరుదుల గ్రహిత మాడుగుల కృష్ణమోహన్ వహించారు. కృష్ణమోహన్ తన అద్భుతమైన ప్రతిభా పాటలతో పాత్రలో జీవించి అందరి హృదయాలను దోచుకున్నారు. ఈ "ఇదంనమమ" నాటికలో ఇతర పాత్రలను పోషించిన నటీనటులు జి. మనుప్రియ నటచంద్రకళ, సహజ నటి, చలాకి తార బిరుదుల గ్రహిత, దొంతి జంగయ్య గౌడ్ ప్రముఖ రంగస్థల టి.వి. సిని నటుడు, రామాయణం సత్యనారాయణ రంగస్థల టి.వి. సిని నటుడు, గోవింద్ సత్యనారాయణ సహజ నటుడు రంగస్థల కళాకారుడు తమ నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ నాటికకు సంగీతం ఆర్. ప్రసాద్ అందించగా, లైటింగ్ సురభి రాయలు అందించారు. ఈ నాటికలో కోరిన కట్నాలు ఇవ్వలేక బాధపడుతూ కృంగిపోయి తన జీవితానికి అర్థం లేదని చివరికి ఆత్మహత్య చేసుకునే అమ్మాయిని కథానాయకుడు ప్రసాద్ కాపాడి ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు. ఆమెకు ఒక మంచి జీవితాన్ని ప్రసాదిస్తాడు. ఆత్మహత్య చేసుకోవడం జీవిత లక్ష్యం కాదని అనుకున్నది సాధించాలని, శ్రీమూర్తులు లేకుంటే లోకమే లేదని, శ్రీమూర్తులలు భావితరాలను తీర్చిదిద్దే గొప్ప రూపకర్తలుగా చూపించే సందేశాత్మక నాటికే ఈ 'ఇదంనమమ' అని తెలుపుతూ, 'ఇదం' అంటే ఇక్కడ అని 'నమమ' అంటే ఏమీ లేదని గొప్ప అర్థాన్ని చెప్పి అద్భుతంగా శోతులను చైతన్యవంతులను చేసి అలరించి మంచి సందేశాన్ని అందించిన నాటిక దర్శకుడు,, నిర్వాహకుడు మాడుగుల కృష్ణమోహన్, ఇతర కళాకారులను అతిథులు ఈ సందర్భంగా అభినందించి ఘనంగా సత్కరించారు తమ శుభాకాంక్షలు తెలిపారు.

# మేడారం అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా ప్రగతికి కార్యాచరణ వేగవంతం చేయాలి
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క



ములుగు జులై 06 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి మేడారం ఆలయ అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, ఐడీఓసీ పనుల పురోగతి, రామచంద్రపురం భూసర్వే, పైలాన్ నిర్మాణం, వర్షాల పరిస్థితి, రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సన్నాహాలపై సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు.

1. అభివృద్ధి పనులు – సీఎం పర్యటన

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రహదారుల అభివృద్ధి కోసం పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.6,000 కోట్ల విలువైన పనులకు టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు. సీఎం ములుగు పర్యటన సందర్భంగా జాతీయ రహదారి పక్కన గట్టమ్మ దేవాలయం రోడ్డు భూమిపూజ, నూతన కలెక్టరేట్, మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, కేంద్రీయ విద్యాలయం, పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్, కరకట్టల నిర్మాణం తదితర పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలను ఒకే శిలాఫలకంపై పొందుపరిచి ఆవిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

2. మేడారం మాస్టర్ ప్లాన్

సమ్మక్కసారలమ్మ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భూసేకరణ, రహదారుల విస్తరణ, క్యూ లైన్లు, అతిథి గృహం, ఆసుపత్రి, కాటేజీలు, పార్కింగ్, పారిశుధ్యం, జంపన్న వాగు అభివృద్ధితో సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. గట్టమ్మ దేవాలయం, పైలాన్, ట్రైబల్ యూనివర్సిటీ, కలెక్టరేట్‌ను అనుసంధానిస్తూ ములుగును ఆకర్షణీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని అన్నారు.

3. వ్యవసాయం, నీటి పారుదల

రామచంద్రపురం 10,600 ఎకరాల రీసర్వే, పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్, రామప్ప లక్నవరం పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని, జంపన్న వాగులో ఏడాది పొడవునా నీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు యూరియా కొరత లేకుండా తగిన నిల్వలు, సరఫరా ఉండేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

4. వర్షాకాల సన్నాహాలు

వర్షాల నేపథ్యంలో తాగునీరు కలుషితం కాకుండా పైప్‌లైన్ లీకేజీలు సరిచేయాలని, నీటి ట్యాంకులు శుభ్రం చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకల పరిసర గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని, అవసరమైతే గర్భిణీలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. మేడారం పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు, రైతుబంధు, జీతాల చెల్లింపుల అనంతరం పెండింగ్ బిల్లులను విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్‌లి, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో, డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డిలి, ఆర్డీవో కృష్ణవేణి, డీఆర్వో రవికుమార్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.



ములుగు జులై 06, విజన్ ఆంధ్ర ప్రతినిధి : సోమవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తుది దశకు చేరుకున్న నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భవనంలోని వివిధ విభాగాలు, కార్యాలయ గదులు, సమావేశ మందిరాలు, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, అంతర్గత రహదారులు, పార్కింగ్, పచ్చదనం, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాల ఏర్పాట్లను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

కలెక్టర్ సూచనలు: 1. భవన నిర్మాణానికి సంబంధించిన మిగిలిన పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి, 2. ప్రతి పనిలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి, 3. కార్యాలయానికి వచ్చే ప్రజలు, అధికారులు, ఉద్యోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలి తుది దశ పనులను వేగంగా పూర్తి చేసి నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లిసి.హెచ్. మహేందర్‌లి, తహసీల్దార్ లివిజయభాస్కర్‌లి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు అంకితం కావాలి

- మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్



మల్కాజిగిరి, జనవరి 6, (విజన్ ఆంధ్ర): దేశ మాజీ ఉప ప్రధాని,స్వాతంత్ర్య సమర యోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ అంకితం కావాలని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ సూచించారు. సోమవారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బి జె ఆర్ నగర్ లో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఆయన పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...సామాజిక సమానత్వం, దళితుల అభ్యున్నతి కోసం జగజ్జీవన్ రామ్ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయక మన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబు, సత్యనారాయణ, మోహిన్, సలీం, కిషోర్,అశోక్ తదితరులు పాల్గొన్నారు

## చినరాయుని చెరువులో గుర్రపు డెక్కను తొలగించాలి

-మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి



అల్వాల్, జనవరి 6, (విజన్ ఆంధ్ర): అల్వాల్ చిన రాయుని చెరువులో పేరుకు పోయిన గుర్రపు డెక్కను తొలగించాలని మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి కోరారు. సోమవారం ఆమె స్థానికులు వినతి మేరకు చిన రాయుని చెరువును సందర్శించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...చిన రాయుని చెరువులో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్క వల్ల చుట్టుపక్కల కాలనీల వారికి దోమల బెడద ఎక్కువైందని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా ఈ చెరువులో గుర్రపు డెక్కను తొలగించాలని ఆమె, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించుటే తన ధ్యేయమని, స్థానికులు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలన్నీ దశల వారీగా పరిష్కారం చేస్తానని ఆమె హామీ నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు

## దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ

- బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 6 (విజన్ ఆంధ్ర) : భారత ఐక్యత, సమగ్రత కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా సోమవారం నాగవరంలోని బీజేపీ జిల్లా పార్టీ నూతన కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ మాట్లాడుతూ, 33 ఏళ్లకే కలకత్తా యూనివర్సిటీకి వీసీగా పనిచేసిన ముఖర్జీ గొప్ప విద్యావేత్త, రాజనీతిజ్ఞుడని కొనియాడారు. 1951లో భారతీయ జనసంఘ్‌ను స్థాపించి కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. జమ్మూకాశ్మీర్‌లో ఆర్టికల్ 370, 35ఏలకు వ్యతిరేకంగా "ఏక్ దేశ్ మే దో విధాన్ నహీ చలేగా" అని నినదించారని, పర్మిట్ లేకుండా వెళ్లినందుకు అరెస్టు చేసి జైల్లోనే హత్య చేశారని ఆరోపించారు. 2019లో ప్రధాని నరేంద్ర మోదీ ఆర్టికల్ 370 రద్దు చేసి ముఖర్జీకి నిజమైన నివాళి అర్పించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ ఆర్. లోకనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి బండారు కుమారస్వామి, కౌన్సిలర్లు, మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయానికి మరో రూ.2 కోట్లు మంజూరు

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి





వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 6 (విజన్ ఆంధ్ర): వనపర్తి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు జీవో ఆర్టీ నెంబర్ 147ను జారీ చేసింది. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో ఈ నిధులు సాధించినట్లు ఆయన తెలిపారు. గతంలో రూ.1 కోటి మంజూరు కాగా, ఇప్పుడు అదనంగా రూ.2 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పూజారుల గదులు, మండపాలు తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.వచ్చే ఏడాది మార్చిలో ఆలయం నిర్మించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా జరిగే బ్రహ్మోత్సవాలకు ముందే ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కరించాలి.

అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి



ములుగు జూలై 06, విజన్ ఆంధ్ర ప్రతినిధి : సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లిసంపత్ రావులి తో కలిసి ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ వారం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 96 దరఖాస్తులు అందాయి. వాటిలో లిఇందిరమ్మ ఇండ్లకు 38, పెన్షన్లకు 11, భూ సమస్యలకు సంబంధించి 21, ఇతర శాఖలకు సంబంధించినవి 26 దరఖాస్తులు ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందని తెలిపారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతనిస్తూ, నిర్ణీత గడువులోపు సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ విషయంలో ఎవరూ నిర్లక్ష్యం వహించరాదని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలపై తక్షణ స్పందన.. ప్రతి అర్జీకి ఫలితం కనిపించాలి..

## - కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం బ్యూరో జూలై 07(విజన్ ఆంధ్ర) : ప్రజావాణిలో ప్రజలు సమర్పించే ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతితో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా భూ వివాదాలు, రెవెన్యూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర అంశాలపై ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపిస్తూ, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, మిగిలిన వినతులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేసే విశ్వసనీయ వేదిక అని పేర్కొన్న కలెక్టర్, ఫిర్యాదులను నమోదు చేయడం మాత్రమే కాకుండా వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించి ఫలితాలు కనిపించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని పేర్కొన్న ఆయన, ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి ఏమాత్రం తావు ఉండకూడదని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చిత్తశుద్ధితో పనిచేయాలని అధికారులను కోరారు. ప్రజలు కూడా తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశముందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి..



సూర్యాపేట జూలై 06:(విజన్ ఆంధ్ర) : డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా సూర్యాపేట లోని బీజేపీ సూర్యాపేట జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సోమవారం ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగరాజు రుక్మారావు, బీజేపీ టీచర్స్ సెల్ రాష్ట్ర కోకన్వీనర్ తీకుళ్ళ సాయిరెడ్డి,రాష్ట్ర నాయకులు బూర మల్సూర్ గౌడ్ లు మాట్లాడుతూ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ స్వతంత్ర భారతదేశ తొలి కేంద్ర మంత్రివర్గంలో పరిశ్రమలు సరఫరాల శాఖ మంత్రిగా సేవలందించిన గొప్ప జాతీయవాది అని పేర్కొన్నారు. దేశ సమగ్రత, జాతీయవాదం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని, భారతీయ జనసంఘ్‌ను స్థాపించి భారత రాజకీయాలకు జాతీయవాద సిద్ధాంతాన్ని దిశానిర్దేశం చేసిన మహోన్నత నాయకుడని కొనియాడారు.జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదు అనే చారిత్రాత్మక నినాదంతో దేశ ఏకత్వం కోసం ఆయన నిరంతరం పోరాడారని తెలిపారు. ఆ ఉద్యమంలో భాగంగా జమ్మూ కాశ్మీర్‌కు వెళ్లిన సమయంలో అరెస్టై, 1953 జూన్ 23న నిర్బంధంలోనే ప్రాణత్యాగం చేశారని, దేశ సమగ్రత కోసం ఆయన చేసిన త్యాగం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం లో జమ్మూ కాశ్మీర్‌కు సంబంధించిన 370 ప్రత్యేక నిబంధనలను రద్దు చేయడం ద్వారా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారి సంకల్పాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చిందని, ఇది దేశ సమైక్యతను మరింత బలోపేతం చేసిన చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. దేశంలోనే అతిచిన్న వయస్సులో వైస్ఛాన్సలర్ అయ్యారని, నేటి ఐ ఐ టి ల స్థాపనలో అయన కృషి మరువలేనిదని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని దేశరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశభక్తి, త్యాగం, జాతీయ సమగ్రత పట్ల ఉన్న అంకితభావం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని, వారి ఆశయాలను ఆచరణలో కొనసాగించడమే వారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెల్లమళ్ళ నర్సింహా,దళితమోర్చ జిల్లా అధ్యక్షులు పరుశరామ్, రవివర్మ, దాసరి వెంకన్న యాదవ్,కోడి లింగయ్య, తన్నీరు వాసుదేవ్, రామచంద్రర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ విద్యార్థినులకు సువర్ణావకాశం

**- ఐ ఐ టి జె ఈ ఈ , నీట్ , క్లాట్ లక్ష్యంగా ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్**

**- 'యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్'లో అడ్మిషన్లు..**

**- జూలై 12న ప్రవేశ పరీక్ష**



కొత్తగూడెం బ్యూరో, జూలై 07 (విజన్ ఆంధ్ర): కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో (కేజీబీవీలు) చదువుతున్న విద్యార్థినులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించేలా తెలంగాణ ప్రభుత్వం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా 'యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాల్వంచ, చంద్రుగొండ, భద్రాచలం కేజీబీవీల్లో ఈ ప్రత్యేక కేంద్రాలు ప్రారంభం కానున్నట్లు జిల్లా విద్యాధికారి బి. వాసంతి తెలిపారు. విద్యార్థినులకు పూర్తిగా ఉచిత రెసిడెన్షియల్ విద్యతో పాటు ఐ ఐ టి జె ఈ ఈ , నీట్ , క్లాట్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రవేశ పరీక్షలకు అనుభవజ్ఞులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ప్రత్యేక కోచింగ్ అందించనున్నారు. అదనపు తరగతులు, ప్రత్యేక స్టడీ మెటీరియల్, సమ్మర్ కోచింగ్, పోటీ పరీక్షల ఫీజులకు ఆర్థిక సహాయం, ఆధునిక కంప్యూటర్ ల్యాబ్స్, హైస్పీడ్ ఇంటర్నెట్, ఈ–లెర్నింగ్ సదుపాయాలు, డిజిటల్ లైబ్రరీ, సైన్స్ ల్యాబ్స్, సైకాలజికల్ కౌన్సెలింగ్, యోగా, క్రీడలు వంటి సమగ్ర సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 202627 విద్యా సంవత్సరానికి జిల్లాలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో ప్రతి కేంద్రంలో 40 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులు మాత్రమే ఈ ప్రవేశాలకు అర్హులు. ప్రవేశాల కోసం జూలై 12, 2026న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లా స్థాయి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షలు పాల్వంచ, చంద్రుగొండ, భద్రాచలం కేజీబీవీల్లోనే జరుగుతాయి. దరఖాస్తుల స్వీకరణకు జూలై 5 చివరి తేదీగా నిర్ణయించారు. కేజీబీవీల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిని ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఉన్నత విద్యతో పాటు దేశంలోని అత్యున్నత పోటీ పరీక్షల్లో విజయాలు సాధించి తమ భవిష్యత్తును ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని జిల్లా విద్యాధికారి బి. వాసంతి ఆకాంక్షించారు.

# విద్య పేరుతో వ్యాపారం... ఫీజుల మోతలకు కిట్ల దోపిడీ తోడు

**-రాయికల్ మండలంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో యూనిఫాంలు, పుస్తకాలు,బూట్లు స్కూల్లోనే కొనాలంటూ ఒత్తిడి**

**-మధ్యతరగతి కుటుంబాలపై పెరుగుతున్న ఆర్థిక భారం**

**-మౌనంగా చూస్తున్న అధికార యంత్రాంగం**

**-అడ్మిషన్‌తో మొదలయ్యే ఆర్థిక భారం**




విజన్ ఆంధ్ర, జూలై 06,రాయికల్ : ఒకప్పుడు పిల్లలను పాఠశాలకు పంపడం అంటే విద్యాభ్యాసం కోసం పెట్టుబడి పెట్టినట్లుగా భావించేవారు. మంచి విద్య కోసం ఎంత ఖర్చయినా వెనుకాడని తల్లిదండ్రులు నేడు ప్రైవేటు పాఠశాలల ఫీజులు,అదనపు వసూళ్ల భారంతో ఆందోళన చెందుతున్నారు.విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో రాయికల్ మండలంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల వ్యవహారం తల్లిదండ్రుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది.

**-ఫీజులతో సరిపోక...కిట్ల పేరిట కొత్త వసూళ్లు**

ప్రవేశ సమయంలో స్కూల్ ఫీజులు చెల్లించిన తర్వాత కూడా యూనిఫాం కిట్లు,ప్రత్యేక పుస్తకాలు,బూట్లు, సాక్సులు,టైలు,బెల్టులు వంటి వస్తువులను పాఠశాలల నుంచే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.మార్కెట్‌లో అదే వస్తువులు తక్కువ ధరలకు అందుబాటులో ఉన్నప్పటికీ, పాఠశాలల్లోనే కొనుగోలు చేయాలని సూచించడం వల్ల తల్లిదండ్రులపై వేల రూపాయల అదనపు భారం పడుతోంది.

రాయికల్ మండలంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఒక్క విద్యార్థికి యూనిఫాం కిట్ పేరిట రూ.2,300 వరకు,ప్రత్యేక పుస్తకాల పేరిట రూ.2,000 వరకు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.ఫీజులతో పాటు ఈ ఖర్చులు కలిస్తే ఒక్క విద్యార్థిపైనే భారీ ఆర్థిక భారం పడుతోంది.ఒకే కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు చదువుతున్నట్లయితే పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది.

-ఒక్క విద్యార్థిపై అదనపు భారం
-యూనిఫాం కిట్ : రూ.2,300 వరకు
-ప్రత్యేక పుస్తకాలు : రూ.2,000 వరకు
-బూట్లు,సాక్సులు,టై,బెల్ట్
-అదనపు ఖర్చు
-రవాణా,ఫీజులు వేరు
-తల్లిదండ్రుల ఎంపిక హక్కుకు గండికొడుతున్నారా?

విద్యా నిపుణుల అభిప్రాయం ప్రకారం పాఠశాలలు పుస్తకాల జాబితా,యూనిఫాం నమూనాను మాత్రమే సూచించాలి.వాటిని ఎక్కడ కొనుగోలు చేయాలనేది తల్లిదండ్రుల నిర్ణయంగా ఉండాలి.అయితే కొన్ని పాఠశాలలు బయట కొనుగోలు చేసిన యూనిఫాంలను అంగీకరించడం లేదని,ప్రత్యేక పుస్తకాలు తప్పనిసరి అని చెబుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి.దీనివల్ల తల్లిదండ్రుల కొనుగోలు స్వేచ్ఛ పూర్తిగా దెబ్బతింటోంది.

**-విద్యా ప్రమాణాల కంటే వసూళ్లకే ప్రాధాన్యమా..?**

విద్యార్థుల విద్యాభివృద్ధి,నాణ్యమైన బోధన కంటే వసూళ్ల వ్యవస్థ బలపడుతోందనే అభిప్రాయం సమాజంలో వ్యక్తమవుతోంది.ప్రతి సంవత్సరం కొత్త పేర్లతో ఫీజులు,అదనపు చార్జీలు పెరుగుతుండగా,వాటిపై సరైన నియంత్రణ కనిపించడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చే ధోరణి ఆందోళన కలిగిస్తోంది.

**-అధికారుల మౌనం అనుమానాలకు తావిస్తోంది**

ప్రతి ఏడాది ఫీజుల భారం, యూనిఫాం కిట్ల దోపిడీ,పుస్తకాల పేరుతో అదనపు వసూళ్లపై తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వినిపిస్తున్నప్పటికీ,సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు అరుదుగా కనిపిస్తున్నాయి.తనిఖీలు జరుగుతున్నాయా? నిబంధనలు అమలవుతున్నాయా? అక్రమ వసూళ్లపై విచారణ జరుగుతోందా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లభించడం లేదు. కొన్ని పాఠశాలలు బహిరంగంగానే కిట్లు విక్రయిస్తున్నప్పటికీ,అధికార యంత్రాంగం మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో నియంత్రణ వ్యవస్థ పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

-తల్లిదండ్రుల ఆవేదన
– ఫీజులు ఏటా పెరుగుతున్నాయి
– యూనిఫాం, పుస్తకాలు బయట కొనుగోలు చేసే అవకాశం లేదు
– ఫిర్యాదు చేస్తే పిల్లలపై ప్రభావం పడుతుందనే భయం
– అధికారుల నుంచి స్పందన కరువు
-మధ్యతరగతి కుటుంబాలపై పెరుగుతున్న భారం

నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన ఈ కాలంలో విద్యా ఖర్చులు కూడా భారీగా పెరుగుతున్నాయి. ఉద్యోగులు,చిన్న వ్యాపారులు,రైతు కుటుంబాలు పిల్లల చదువుల కోసం తమ ఆదాయంలో గణనీయమైన భాగాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. ఫీజులతో పాటు యూనిఫాం కిట్లు, ప్రత్యేక పుస్తకాల పేరుతో అదనపు వసూళ్లు చేయడం వల్ల అనేక కుటుంబాలు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**-కఠిన చర్యలే పరిష్కారం**

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నిర్మాణం,యూనిఫాం కిట్ల విక్రయాలు, ప్రత్యేక పుస్తకాల వ్యవహారంపై విద్యాశాఖ ప్రత్యేక తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. నిబంధనలకు విరుద్ధంగా తల్లిదండ్రులను బలవంతం చేస్తున్నట్లు తేలితే సంబంధిత పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి.తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసే భద్రత,స్వేచ్ఛ కల్పించాలి. విద్య అనేది వ్యాపార వస్తువు కాదు. అది ప్రతి చిన్నారికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు.ఆ హక్కును లాభాల కోసం వినియోగించే ప్రయత్నాలు ఎంత వేగంగా పెరుగుతున్నాయో,వాటిని అరికట్టే చర్యలు కూడా అంతే వేగంగా ఉండాలి. రాయికల్ మండలంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో విద్యాశాఖ వెంటనే స్పందించి వాస్తవ పరిస్థితులను వెలికితీయాల్సిన అవసరం ఉంది.లేకపోతే విద్య పేరుతో సాగుతున్న ఈ వ్యాపారం మరింత విస్తరించే ప్రమాదం ఉంది.

# డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

## - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 06 ( విజన్ ఆంధ్ర ) : ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ లు, ఏ.ఈ.ఆర్.ఓ లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 25వ తేదీ నుండి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని, ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లు వివరాలు నమోదు చేసిన పిదప తిరిగి తీసుకొని సంబంధిత బిఎల్ఓ యాప్ లో డిజిటైజేషన్ చేపట్టాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలలో ఓటర్ల వివరాల నమోదుకు వాలంటీర్లను ఉపయోగించుకొని ఓటర్లకు సహాయ పడాలని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జూలై 20 వ తేదీ నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. డిజిటైజేషన్ పూర్తయిన తర్వాత పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని, ఒక పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 ఓటర్లకు మించి ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్లు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా తప్పుడు సమాచారం సమర్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులకు సూపర్వైజర్లు, వాలంటీర్లు సహాయం అందించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ జిల్లాలో నేటి వరకు 99 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ చేయడం జరిగిందని, 2.67 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని, వచ్చే సోమవారం నాటికి 50 శాతం డిజిటైజేషన్ పూర్తి చేస్తామని, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పకడ్బందీగా చేపడతామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు, బూత్ స్థాయి ఏజెంట్లకు కార్యాచరణ ప్రకారంగా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతం చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటాచారి, డిఆర్ ఓ స్వర్ణ లత , ఆర్ డి ఓ వాసు చంద్ర, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంచిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



మానకొండూరు జూలై 6. విజన్ ఆంధ్ర : గన్నేరువరం మండలానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కులను మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఆయన స్వయంగా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలిచేందుకే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు.గన్నేరువరం మండలానికి 26వ విడతలో భాగంగా 50 మంది లబ్ధిదారులకు రూ.18,66,500 మంజూరు కాగా, లబ్ధిదారులకు ఇప్పుడు చెక్కుల రూపంలో అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అనారోగ్యం, ప్రమాదాలు వంటి వైద్య చికిత్స కోసం అప్పుల పాలవకుండా, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, సంక్షేమ పథకాల అమలుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహశీల్దార్ ఇప్ప నరేందర్, బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సునిల్, మాజీ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, పార్టీ నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, అలువాల కోటి, జె.మన్మోహన్ రావు,మాతంగి అనిల్,చింతల శ్రీధర్ రెడ్డి, రాజేశ్వరి, న్యాత జీవన్, మాదరి శ్రీనివాస్, మార్కం మల్లేశ్, మల్ రెడ్డి, తిరుపతి, సంగు వేణు, డి.మల్లేశం, సంతోష్ తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ గ్రామశాఖల అధ్యక్షులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**మాదాపూర్ లో రేషన్ షాప్ ప్రారంభం**

గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన చౌక ధరల దుకాణాన్ని సోమవారం మానకొండూర్ శాసనసభ్యుడు, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి దుకాణాన్ని ప్రారంభించిన అనంతరం లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అందుకే కొత్త రేషన్ షాపులను మంజూరు చేసి గ్రామాల్లోనే సరుకులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రేషన్ షాపుల ద్వారా అందించే నిత్యవస సరకుల తూకంలో మోసం చేస్తే, సరుకులు పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇప్ప నరేందర్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సునిల్, మాజీ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, పార్టీ నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, మన్మోహన్ రావు, అలువాల కోటి, మాతంగి అనిల్,రాజేశ్వరి, అంజి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ జడ్పీటీసీ కుటుంబానికి బీ.ఆర్.ఎస్ మండల నాయకుల పరామర్శ



వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై08(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండలంలో కొంకపాక గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి మాదాసి సుధాకర్ శైలజ తల్లి లిమాదాసి ఉప్పలమ్మలి అనారోగ్య కారణంతో మరణించగా వారి స్వగృహానికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించిన ఏఎంసీ మాజీ డైరెక్టర్ పట్టాపురం ఏకాంతం గౌడ్, స్థానిక సర్పంచ్ రాయబారపు రమదేవివివేక్, మాజీ ఎంపీటీసీ కరిమిల మోహన్ రావు, మాజీ రైతుబంధు సమితి అధ్యక్షులు చిన్నపాక శ్రీనివాస్, బి ఆర్ఎస్ సీనియర్ నాయకులుచీమల బిక్షపతి యాదవ్,గూడ నరేందర్, బొట్ల మధు, ఏనుగల్లు గ్రామ పార్టీ అధ్యక్షులు మాసాని వెంకట్, కొంకపాక గ్రామ అధ్యక్షులు మదూరి దేవేందర్, స్థానిక వార్డు సభ్యులు మాదాసి వరదరాజు, తదితరులు పాల్గొన్నారు...

# శ్రీశ్రీశ్రీ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయ హుండీ లెక్కింపు



ఎల్బీనగర్ జులై 06 (విజన్ ఆంధ్ర): ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానములోని 102 రోజుల హుండీల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఉండి లెక్కింపు పర్యవేక్షణ అధికారిగా దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా సహాయ కమీషనరు ఏ.చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వహణాధికారి యన్. లావణ్య, మాజీ ధర్మకర్త ఎనుముల రవీందర్ రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది, వివిధ సేవా సంఘాల వాలంటీర్ల సమక్షములో లెక్కించారు. లెక్కింపు ప్రక్రియలో భాగంగా రూ.59,41,973 నగదు, విదేశీ కరెన్సీ 172 యు.ఎస్. డాలర్లు, 10 ఆస్ట్రేలియా డాలర్లు, 102 మలేషియా రింగిట్స్, 135 ఉ.ఏ.ఇ.దిర్హాంస్ వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎమ్‌లకు సబ్‌సెంటర్ల కేటాయింపు..

**- పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించిన వైద్యశాఖ**



కొత్తగూడెం బ్యూరో, జూలై 07 (విజన్ ఆంధ్ర): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని పలు ఆరోగ్య ఉపకేంద్రాల్లో రెగ్యులర్ ఏఎన్ఎమ్‌లు విధుల్లో చేరిన నేపథ్యంలో, ఖాళీగా ఉన్న సబ్‌సెంటర్లకు ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎమ్‌లను కేటాయించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్ మాట్లాడుతూ, కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, సీనియారిటీ మరియు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య ఉపకేంద్రంలో ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కొత్తగా కేటాయించిన ఉపకేంద్రాల్లో ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎమ్‌లు వెంటనే విధుల్లో చేరి గర్భిణీ స్త్రీలు, బాలింతలు, శిశువులు, చిన్నారులకు అవసరమైన ఆరోగ్య సేవలు, టీకాల కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య ఉపకేంద్రంలో ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా వైద్య సేవలు అందేలా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అన్ని చర్యలు తీసుకుంటోందని డా. తుకారాం రాథోడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రామకృష్ణ, డిప్యూటీ డెమో నాగలక్ష్మి, డిపిఎంవో మోహన్, హెల్త్ సూపర్వైజర్లు శ్రీనివాసరావు, రాంప్రసాద్, జానకి, సుశీల, ఉమాదేవి, విజయలక్ష్మి, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 06,(విజన్ ఆంధ్ర ) : కుక్కలు, పిల్లలకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మంచిర్యాల పట్టణంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత రేబిస్ టీకాల కార్యక్రమానికి జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డా. యాకూబ్ రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ సుదమల్ల హరికృష్ణ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెంపుడు జంతువుల యజమానులు తప్పనిసరిగా కుక్కలు, పిల్లలకు రేబిస్ టీకాలు వేయించాలని తెలిపారు. మనుషుల నుండి జంతువులకు, జంతువుల నుండి మనుషులకు జూనోటిక్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, రైతులు, పశుపోషకులు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న జంతువులను వేరుగా ఉంచడం, పాలు, మాంసాన్ని పరిశుభ్రంగా నిర్వహించడం, చనిపోయిన జంతువులను శాస్త్రీయ పద్ధతిలో పారవేయడం, అనుమానాస్పద లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే పశు వైద్యులను సంప్రదించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రేబిస్ వ్యాధి 100 శాతం నివారించ దగినదని, కుక్కలు, పిల్లలకు క్రమం తప్పకుండా రేబిస్ టీకాలు వేయించడం ద్వారా కుటుంబాలు, సమాజాన్ని సురక్షితంగా ఉంచవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన జంతువులు – ఆరోగ్యకరమైన మనుషులు – ఆరోగ్యకరమైన సమాజం లక్ష్యంతో అందరం సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా 32 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డా. శాంతి రేఖ, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సోనియా, సహాయకులు గోవర్ధన్, గోపాలమిత్ర వేణు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్వాంటమ్ ఎనర్జీ-హీరో ఫిన్కార్ప్ భాగస్వామ్యం

**- ఎలక్ట్రిక్ స్కూటర్ల కొనుగోలు మరింత సులభం**

హైదరాబాద్, జూలై 06 (విజన్ ఆంధ్ర) : ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీ సంస్థ క్వాంటం ఎనర్జీ, ప్రముఖ ఎన్.బి.ఎఫ్.సి హీరో ఫిన్ కార్ప్ తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు క్వాంటమ్ ఎనర్జీ మేనేజింగ్ డైరెక్టర్ చక్రవర్తి చుక్కపల్లి సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హీరో ఫిన్కార్ప్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అభిమన్యు ముంజల్ తోకలసి ఆయన మాట్లాడుతూ ఈ ఒప్పందంతో కస్టమర్లకు తక్షణ ఈఎంఐ గణన, పూర్తిగా డిజిటల్ లోన్ ప్రాసెస్, సరసమైన వడ్డీ రేట్లు, సౌకర్యవంతమైన రీపేమెంట్ ఎంపికలతో ఎలక్ట్రిక్ స్కూటర్ల కొనుగోలు మరింత సులభతరం కానుందని తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా ఎలక్ట్రిక్ మొబిలిటీని మరింత మందికి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. వేగవంతమైన, పారదర్శక ఫైనాన్సింగ్ ద్వారా మరింత మంది భారతీయులు ఎలక్ట్రిక్ వాహనాలను స్వీకరించేందుకు ఇది దోహద పడుతుందని పేర్కొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి



నారాయణపేట , జూలై 6 ( విజన్ ఆంధ్ర) : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 31 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డి.ఆర్.ఓ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో, డి.ఆర్.ఓ.రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి వాకిటి శ్రీహరి ని కలిసిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు. - శివరాం రెడ్డి..



మాగనూరు, జులై 6 (విజన్ ఆంధ్ర) : నూతన మాగనూరు మండల అధ్యక్షుడు శివరాం రెడ్డి సోమవారం హైదరాబాదులో మంత్రి చాంబర్లో డాక్టర్ వాకిటి శ్రీహరిని కలిసి బుక్కెను అందించి శాలువతో మంత్రి నీ సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాగనూరు మండలంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను ,కార్యకర్తలను, కలుపుకొని సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారు తెలియజేశారు. ఈ సందర్భంగా శివరాం రెడ్డి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మంత్రి వాకిటి శ్రీ హరి గారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి, ఆనంద్ గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, కృష్ణమూర్తి, వాకిటి శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి మౌలాలి, రాఘవరెడ్డి, రామచంద్ర గౌడ్,, తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపట్ల జాగ్రత్త చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 06 ( విజన్ ఆంధ్ర ) : సీజనల్ వ్యాధులు విస్తరించకుండా పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించు కోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐడిఓసి మీటింగ్ హాల్ నందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. సుధాకర్ లాల్ సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న వివిధ చర్యలను వివిధ శాఖల మధ్య సమన్వయం గురించి వివరించారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రబలే మలేరియా, డెంగ్యూ నివారణ, నియంత్రణకు తీసుకోవలసిన వివిధ జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా డెంగ్యూ వివిధ సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వ కార్యాలయాలలో, సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ లలో అవగాహన కల్పించే బోర్డులను ఏర్పాటు చేయించాల్సిందిగా డిఎంహెచ్ఓ ను ఆదేశించారు. ఈ సమన్వయ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ బసవరాజ్, జిల్లా పరిషత్ సీఈవో సుధీర్ మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఐడిఓసిలో ఏర్పాటుచేసిన దోమలు పెరిగే ప్రదేశాలైన వాడి పరవేసిన కొబ్బరి బొండాలు, పగిలిన మట్టి కుండలు, పాత టైర్లు, ప్లాస్టిక్ వస్తువులు వంటివి ఏర్పాటు చేసిన అవగాహన శిబిరాన్ని సందర్శించారు.

# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 06,(విజన్ ఆంధ్ర ) : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భావన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. హాజీపూర్ మండలం నమ్నూర్ గ్రామపంచాయతీ చందనాపూర్ గ్రామవాసులు తమ గ్రామంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో 136 రేషన్ కార్డులు ఉన్నాయని, స్థానికంగా రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైపూర్ మండలం రామారావుపేట గ్రామానికి చెందిన కడియాల పద్మ తనకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకొనుటలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆలస్యం జరిగిందని, ఇప్పుడు ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతి అందించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నెన్నెల మండలం గంగారం గ్రామానికి చెందిన పాగిడి శోభ తాను ఏ ఎన్ ఎం, ఇంటర్, ఎం పి హెచ్ డబ్ల్యు అర్హత కలిగి ఉన్నానని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణం కాంట్రాక్టర్ బస్తీకి చెందిన కొలిపాక శ్రీనివాస్ తాము నివసిస్తున్న ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి టౌన్షిప్ ప్రాంతానికి చెందిన బాసపోయిన రవీంద్ర కుమార్ తాను మంచిర్యాల జిల్లాలోని గరిమెళ్ళ గ్రామంలో కొనుగోలు చేసిన భూమికి మ్యుటేషన్ ద్వారా పట్టా జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం చందారం గ్రామానికి చెందిన రాచర్ల సంతోష్ తన తండ్రి పేరిట గ్రామ శివారులో భూమి ఉందని, ఆయన మరణించారని, ఇదే అదనుగా కొందరు భూమిని అక్రమంగా ఆక్రమించి పట్టా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తెలంగాణ లైబ్రరీ సైన్స్ విద్యార్థులు – నిరుద్యోగుల సంఘం ప్రతినిధులు తమ దరఖాస్తులలో జిల్లా కేంద్ర గ్రంథాలయం, శాఖా గ్రంథాలయాలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో లైబ్రరీ అండ్ పోస్టులను ప్రత్యక్ష పద్ధతిన డి ఎస్ సి ద్వారా భర్తీ చేయాలని కోరారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలలో సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలని దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 79 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 06,(విజన్ ఆంధ్ర ) : రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ లు, ఏ.ఈ.ఆర్.ఓ లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 25వ తేదీ నుండి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని, ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లు వివరాలు నమోదు చేసిన పిదప తిరిగి తీసుకొని సంబంధిత బిఎల్ఓ యాప్ లో డిజిటైజేషన్ చేపట్టాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలలో ఓటర్ల వివరాల నమోదుకు వాలంటీర్లను ఉపయోగించుకొని ఓటర్లకు సహాయ పడాలని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జులై 20 వ తేదీ నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. డిజిటైజేషన్ పూర్తయిన తర్వాత పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని, ఒక పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 ఓటర్లకు మించి ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా తప్పుడు సమాచారం సమర్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులకు సూపర్వైజర్లు, వాలంటీర్లు సహాయం అందించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో నేటి వరకు 99 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ చేయడం జరిగిందని, 6.8 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని, వచ్చే సోమవారం నాటికి 50 శాతం డిజిటైజేషన్ పూర్తి చేస్తామని, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పకడ్బందీగా చేపడతామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు, బూత్ స్థాయి ఏజెంట్లకు కార్యాచరణ ప్రకారంగా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతం చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ, ఈబీసీ విద్యార్థులకు ప్రీ-మెట్రిక్ స్కాలర్షిప్ దరఖాస్తులు ప్రారంభం

**- జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జె.రంగారెడ్డి వెల్లడి**

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై 06(విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 9వ, 10వ తరగతులు చదువుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థులకు 202627 విద్యా సంవత్సరానికి ప్రీ-మెట్రిక్ స్కాలర్షిప్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జె. రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన డే స్కాలర్ విద్యార్థులకు సంవత్సరానికి రూ.4,000 స్కాలర్షిప్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 60 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం, 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయని తెలిపారు. విద్యార్థులు ముందుగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎన్ఎస్పీ ఓటీఆర్ (చీఖా ాు=) యాప్ను డౌన్లోడ్ చేసుకుని, ఆధార్ లేదా ఫేస్ ఆథెంటికేషన్ ద్వారా 14 అంకెల వన్ టైమ్ రిజిస్ట్రేషన్ (ాు=) నంబర్ పొందాలని సూచించారు. అనంతరం సమీప మీసేవా కేంద్రంలో ఓటీఆర్ నంబర్తో పాటు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించి ఈ-పాస్ పోర్టల్లో ఫ్రెష్ లేదా రెన్యూవల్ దరఖాస్తు నమోదు చేయించుకోవాలని, బయోమెట్రిక్ ధృవీకరణను తప్పనిసరిగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, నోడల్ అధికారులు విద్యార్థుల దరఖాస్తులను ఈ-పాస్ పోర్టల్లో పరిశీలించి ధృవీకరించి, అర్హులైన విద్యార్థుల వివరాలను జిల్లా బీసీ అభివృద్ధి అధికారికి ఆన్లైన్లో పంపించాలని సూచించారు. జిల్లా బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్కాలర్షిప్ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించడంతో పాటు, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో సమన్వయం చేసి విద్యార్థుల నమోదు, ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం బిల్లులను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామని పేర్కొన్నారు. అర్హులైన బీసీ, ఈబీసీ విద్యార్థులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే ఎన్ఎస్పీ ఓటీఆర్ నమోదు పూర్తి చేసి, మీసేవా కేంద్రం ద్వారా ఈ-పాస్ పోర్టల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కోరారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లోని ప్రతి అర్హ విద్యార్థి స్కాలర్షిప్కు దరఖాస్తు చేసుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**- రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి**

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 6, విజన్ ఆంధ్ర : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సహాయ ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ రెండు రోజులలోగా 100 శాతం పూర్తి చేయాలని, నింపిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఇంకా 17 రోజులే మిగిలి ఉన్నాయని, బూత్ స్థాయి అధికారులు చురుకుగా లేని ప్రాంతాలలో సూపర్వైజర్లు పర్యవేక్షించాలని, బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్ల సహకారం తీసుకోవాలని, ఏ ఎస్ డి జాబితా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపట్టాలని తెలిపారు. ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పై వివరించాలని, రాజకీయ పార్టీల సహకారం తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 100 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కొరకు చర్యలు తీసుకోవడం జరిగిందని, ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ 29 శాతం పూర్తి చేశామని, నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు. ఏ ఎస్ డి జాబితా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేస్తామని, సరిహద్దు గ్రామాలలో కేవలం 2 పోలింగ్ కేంద్రాలలో సమస్య ఉందని, ఇప్పటివరకు అక్కడ 60 శాతం ఫారాలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్ల సహకారం, రాజకీయ పార్టీల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 06,(విజన్ ఆంధ్ర ) : గత ఐదు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐక్య విద్యార్థి సంఘాల(టివి యువి ,టివిఎస్ ,ఎన్ ఎస్ సి ) ఆధ్వర్యంలో సోమ వారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ ను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం పాటుపడ తామని ఎన్నికల్లో హామీలిచ్చి, ఇప్పుడు విద్యార్థులను పట్టించుకోవ దంలేదని ఆరోపించారు. గత ఐదు సంవత్సరాలుగా విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు రూ, 8 వేల కోట్లకు పైగా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు బకాయిలు చెల్లించక పోవడంతో విద్యా సంవత్సరంలో పాసైన విద్యార్థులు తమ సర్టిఫికెట్ల కోసం ప్రైవేటు కళాశాలల చుట్టూ తిరుగుతూ, నానా తిప్పలు పడు తున్నారని, యాజమాన్యాలు మాత్రం ఫీజులు చెల్లించని దే సర్టి ఫికేట్స్ ఇచ్చేది లేదని,మీరు దిక్కున్న చోట చెప్పుకోవాలంటూ విద్యా ర్థులను బెదిరింపులకు గురి చేస్తున్నాయన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిల నిధులు విడుదల చేయాలని ఐక్య విద్యార్థి సంఘాలుగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు రేగుంట క్రాంతి కుమార్,బచ్చలి అభిరామ్, విద్యార్థులు కిరణ్, అనిల్, స్వామి,జంగు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీకి చిక్కిన చేర్యాల ఎమ్మార్వో దిలీప్ నాయక్ .

**- బాధితుడి నుంచి రూ.70 వేల లంచం డిమాండ్ చేసినట్టు ఆరోపణ.?**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూలై 6 : సిద్దిపేట జిల్లా కేంద్రంలో గలచేర్యాల ఎమ్మార్వో గత 18 నెలలుగా కొండపాక నుండి బదిలీ పై వచ్చిన ఎమ్మార్వో దిలీప్ నాయక్ 70 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్హ్యాండెడ్గా చిక్కాడు. నాలా కన్వర్షన్ కొరకు ఫిర్యాదుదారుడి నుంచి రూ.70 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముందస్తు సమాచారంతో పక్కా ప్రణాళిక ప్రకారం ఏసీబీ అధికారులు లంచం పుచ్చుకుంటున్న సమయంలో దిలీప్ నాయక్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అధికారులు నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

# ప్రజావాణికి 152 ఫిర్యాదులు

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 06 ( విజన్ ఆంధ్ర ) : ప్రజా సమస్యలను నిశితంగా పరిశీలించి పరిష్కరించాలి అని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు సమస్యలకు సంబంధించిన 152 దరఖాస్తులను స్వీకరించారు. ప్రజల నుండి అందిన వినతులను స్వీకరించి, వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తూ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజల సమస్యలను పెండింగ్ ఉంచకుండా పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించాలని ,ప్రతి వినతిని పరిశీలించి అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, జడ్ పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ ఓ స్వర్ణ లత, జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చేనేత సహకార ఎన్నికల్లో సాయినేత సత్తా..!

**- డైరెక్టర్గా ఏకగ్రీవ ఎన్నిక...**

**- స్థానిక రాజకీయాల్లో కొత్త చర్చ..**



సూర్యాపేట జూలై 06:(విజన్ ఆంధ్ర) : చేనేత పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్గా సాయినేత ఏకగ్రీవంగా ఎన్నిక కావడం స్థానిక రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా మారింది. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎలాంటి పోటీ లేకుండా సభ్యులందరి మద్దతుతో ఆయన ఎన్నిక కావడం, సహకార సంఘంలో ఆయనకు ఉన్న ఆమోదాన్ని ప్రతిబింబిస్తోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. సాధారణంగా చేనేత పారిశ్రామిక సహకార సంఘాల ఎన్నికలు వర్గపోరు, రాజకీయ పోటీకి వేదికగా నిలుస్తాయి. అయితే ఈసారి సభ్యుల మధ్య ఏకాభిప్రాయం నెలకొని సాయినేతను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం వెనుక సమన్వయ రాజకీయాలు పనిచేశాయనే చర్చ సాగుతోంది. ఈ ఎన్నికతో సాయినేత స్థానికంగా తన ప్రభావాన్ని మరింత బలోపేతం చేసుకున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రానున్న రోజుల్లో చేనేత సహకార సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, పారదర్శక పాలనపై ఆయన తీసుకునే నిర్ణయాలే ఈ విజయానికి అసలైన అర్థాన్ని నిర్ధారించనున్నాయి. ఏకగ్రీవ ఎన్నికతో వచ్చిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సభ్యుల అంచనాలను నెరవేర్చడం ఇప్పుడు సాయినేత ముందున్న ప్రధాన బాధ్యతగా మారింది. ఈ ఎన్నికతో సహకార సంఘ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేచిందా..? లేక సభ్యుల ఏకాభిప్రాయానికి ఇది నిదర్శనమా..? అనే చర్చ మాత్రం స్థానిక రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది.

# ఘనంగా గస్టోస్ బేకరీ ప్రారంభం



సూర్యాపేట జూలై 06:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో పీఎస్ఆర్ సెంటర్ లో సోమవారం గస్టోస్ బేకరీ షాపును 37వ వార్డు కౌన్సిలర్ బైరు శైలేందర్, హఫీజ్ ఖలీల్, మౌలానా అత్తర్ సాబ్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపారంలో నాణ్యత, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. నాణ్యమైన బేకరీ ఉత్పత్తులను అందించి వినియోగదారుల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బేకరీ నిర్వాహకుడు హకీమ్, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.

## అన్నదాన సేవకు అండగా రూ.11 లక్షలు..

### రాజన్న ఆలయ నిత్యాన్నదాన ట్రస్టుకు ఉదార విరాళం



వేములవాడ రాజన్న సిరిసిల్ల, జూలై 06 (విజన్ ఆంధ్ర బ్యూరో): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నిత్యాన్నదాన ట్రస్టుకు హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన శ్రీ చంద్రమౌళి, శ్రీమతి కమల దంపతులు రూ.11 లక్షల విరాళాన్ని అందజేశారు. దేవస్థానం పీఆర్వో కార్యాలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎల్. రమాదేవికి చెక్కు రూపంలో విరాళాన్ని అందించిన దాతలు, అనంతరం శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేదపండితులు దాతలకు స్వామివారి శేషవస్త్రం, లడ్డు ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రోటోకాల్ అధికారి అశోక్ కుమార్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ, "అన్నదానం మహాదానం" అనే సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ నిత్యాన్నదాన ట్రస్టుకు ఉదారంగా విరాళం అందించిన దాతలను అభినందించారు. స్వామివారి అనుగ్రహం దాతలు, వారి కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

## ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీలో వేగం పెంచాలి

### - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట జూలై 06:(విజన్ ఆంధ్ర) : జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని, ప్రతి ఇంటికీ ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. హరితహారంలో భాగంగా ఇచ్చే మొక్కలు అన్ని రకాలు ఉండేలా చూడాలని, ప్రజలు నాటుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా ఊరూరా పచ్చదనం పరుచుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. కేవలం మొక్కలు నాటడమే కాదు.. వాటిని కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పంచాయతీ రాజ్, మున్సిపాలిటీలు, అటవీ శాఖ, వ్యవసాయం, నీటి పారుదల శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఖాళీ ప్రదేశాలు ఎక్కడ ఉన్నా మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలన్నారు. స్కూళ్లలో పండ్ల మొక్కలు, హాస్టళ్లలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్ పరిసరాల్లో ఎకో క్లబ్ లను యాక్టివేట్ చేసి మొక్కల సంరక్షణ బాధ్యతను



అప్పగించాలని సూచించారు. కేవలం ప్రభుత్వ కార్యాలయాలే కాకుండా పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు, పరిశ్రమలు కూడా ఈ వనమహోత్సవంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఇండస్ట్రీ మేనేజ్‌మెంట్ తమ పరిసరాల్లో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టాలని స్పష్టం చేశారు. మొక్కలు నాటడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మొక్కల పంపిణీకి సంబంధించి మున్సిపల్ అధికారులు ముందస్తు ప్లానింగ్‌తో ఉండటంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పోస్టర్లు, ప్రచార చిత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న తీరు బాగుందని మెచ్చుకున్నారు. ఇదే ఉత్సాహంతో క్షేత్రస్థాయిలో పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జడ్.పి. సిఇఓ శిరీష, హౌసింగ్ పిడి సిద్ధార్థ్, డిఎంహెచ్ఓ వెంకటరమణ డిపిఓ యాదగిరి, సిపిఓ కిషన్, డిఎఓ శ్రీధర్ రెడ్డి, డిఎఫ్ ఓ దామోదర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజావాణి' దరఖాస్తులను పెండింగ్ లో ఉంచొద్దు

కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూలై 06..ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్ లో



ఉంచకుండా అత్యంత ప్రాధాన్య మిచ్చి.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా.. అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 169 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 67, కరీంనగర్ నగరపాలికకు 54 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

## ప్రజల సమస్యల పరిష్కారం కోసమే పోలీస్ గ్రీవెన్స్ డే

### - సూర్యాపేట జిల్లా ఎస్పి కె నరసింహ ..



సూర్యాపేట జూలై 06:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి ని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు.ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది

- రాష్ట్ర పుష్ప మర్దక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- షాద్‌నగర్ పాల శీతలీకరణ కేంద్రానికి 60 ఏళ్ల స్వర్ణోత్సవం..
- 1966లో ప్రారంభమైన షాద్‌నగర్ పాల శీతలీకరణ కేంద్రం స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా
- పెండింగ్‌లో ఉన్న పాడి రైతుల బిల్లుల చెల్లింపునకు కృషి చేస్తాం
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- వేలాది మంది పాల ఉత్పత్తిదారుల ఆర్థికాభివృద్ధికి కేంద్రం దోహదం

రంగారెడ్డి బ్యూరో, జూలై 06(విజన్ ఆంధ్ర ): షాద్‌నగర్ పట్టణంలోని షాద్‌నగర్ పాల శీతలీకరణ కేంద్రం 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సేవలు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ



(టీజీఎల్ డి ఏ) చైర్మన్ చరణ్ కౌశిక్, తెలంగాణ డైరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్త అమిత్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు కేంద్రం చరిత్రను వివరించారు. 1966లో స్థాపించబడిన షాద్‌నగర్ పాల శీతలీకరణ కేంద్రం గత ఆరు దశాబ్దాలుగా వేలాది మంది పాల ఉత్పత్తిదారుల నుంచి పాలను సేకరించి పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కీలకంగా సేవలందిస్తోందని తెలిపారు. పాడి రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి వాకిటి శ్రీహరి మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, పాడి పరిశ్రమ రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కీలకమని అన్నారు. పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, పాడి పరిశ్రమ మరింత అభివృద్ధి చెందేలా అవసరమైన మౌలిక సదుపాయాలు, సాంకేతిక సహాయం అందిస్తామని తెలిపారు.

పెండింగ్ బిల్లులు త్వరలో చెల్లించేలా కృషి చేస్తాం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, షాద్‌నగర్ పాల శీతలీకరణ కేంద్రం 60 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం సంతోషకర విషయమని అన్నారు. ఈ కేంద్రం ద్వారా వేలాది మంది రైతులు తమ పాలను విక్రయించి ఆర్థికంగా అభివృద్ధి చెందారని పేర్కొన్నారు. పాడి రైతులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వీలైనంత త్వరగా విడుదల చేయించేలా మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాడి రైతుల సంక్షేమం, పాల ఉత్పత్తి పెంపు, సహకార పాల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, షాద్‌నగర్ పాల శీతలీకరణ కేంద్రం భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (టీజీ ఎల్ డి ఏ ) చైర్మన్ చరణ్ కౌశిక్, తెలంగాణ డైరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్త అమిత్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, పాడి రైతులు, పాల సంఘాల ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.

### - రెవెన్యూ అధికారులను ఆదేశించారు? : మంత్రి జూపల్లి.



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జులై 06 : కొల్లాపూర్ నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మంత్రి జూపల్లి కృష్ణారావు నాగర్‌కర్నూల్ జిల్లాకలెక్టరేట్‌కుచేరుకున్నారు. సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లను వెంటబెట్టుకొని కలెక్టరేట్‌కు వెళ్లిన మంత్రి.. జిల్లా కలెక్టర్, అటవీ శాఖ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులతో సమీక్షనిర్వహించారు.దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా ప్రస్తావిస్తూ వాటి పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శాఖల మధ్య సమన్వయ లోపంతో ప్రజా సమస్యలు పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. రెవెన్యూ, అటవీశాఖలకుసంబంధించిన సమస్యలపై సమన్వయంతో పనిచేసి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

## కేర్‌లో అరుదైన శస్త్ర చికిత్స విజయవంతం

హైదరాబాద్, జూలై 06 (విజన్ ఆంధ్ర) : రొమ్ములో గడ్డ అనుమానంతో పరీక్షలకు వచ్చిన 59 ఏళ్ల మహిళలో కేర్ హాస్పిటల్స్ వైద్యులు ప్రైమరీ హైపర్ పారా థైరాయిడిజం అనే అరుదైన హార్మోన్ వ్యాధిని గుర్తించి విజయవంతంగా చికిత్స అందించినట్లు కేర్ హాస్పిటల్స్ బంజారాహిల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అభినవ్ జోషి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్ సర్జికల్ ఎండోక్రైనాలజిస్ట్ డా.సంగీతా ఝా తోకలసి ఆయన మాట్లాడుతూ



మామోగ్రామ్‌లో రొమ్ము సాధారణంగా ఉన్నప్పటికీ, మూడో పక్కటెముక వద్ద బ్రౌన్ ట్యూమర్‌ను గుర్తించి తదుపరి పరీక్షల్లో ఎడమ దిగువ పారాథైరాయిడ్ గ్రంథిలో అడెనోమా ఉన్నట్లు నిర్ధారించినట్లు చెప్పారు. అనంతరం శస్త్రచికిత్స ద్వారా గ్రంథిని తొలగించగా మహిళ కోలుకున్నట్లు చెప్పారు. ప్రైమరీ హైపర్ పారా థైరాయిడిజం చాలాసార్లు లక్షణాలు లేకుండానే ఉండే 'సైలెంట్ డిసీజ్' అని, ముందస్తు నిర్ధారణతో తీవ్రమైన ఎముక సమస్యలను నివారించవచ్చని తెలిపారు. రేడియాలజీ, ఎండోక్రైనాలజీ, సర్జరీ, ల్యాబ్ విభాగాల సమన్వయంతో వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స అందించామని చెప్పారు.

## షీ టీమ్ ఆధ్వర్యంలో డెకాయ్ ఆపరేషన్

### - ముగ్గురు యువకులకు కౌన్సిలింగ్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 06,(విజన్ ఆంధ్ర ) : బహిరంగ ప్రదేశాల్లో ఆకతాయిల ఆగడాల నుంచి రక్షించేందుకు మహిళలు, పిల్లల భద్రత కోసం నిత్యం షీ టీమ్స్ పహారా కాస్తున్నాయి. షీ టీమ్ ఎస్ ఐ. హైమ తన సిబ్బంది తో కలిసి సోమవారం నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్ లో ముగ్గురు యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎస్ఐ. హైమ మాట్లాడుతూ పట్టణంలోని రాముని చెరువు పార్క్ లో అమ్మాయిల పట్ల వెకిలి చేష్టలు చేస్తున్న ముగ్గురిని పట్టుకుని కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు.మహిళలు, విద్యార్థినిల పట్ల ఎవరైన అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని సూచించారు. ప్రతిఒక్కరు మహిళల పట్ల గౌరవంగా మెదలాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది శ్రవణ్,శ్రీలత పాల్గొన్నారు.

## జవహర్ నవోదయ విద్యాలయాల్లో చదివే ప్రతి విద్యార్థి జాతీయ స్థాయిలో రాణించాలి

### వట్టెం జవహర్ నవోదయ విద్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) జులై 06 : తరగతి గదుల్లో బోధన పరిశీలన, స్వయంగా బయాలజీ పాఠం బోధించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, విద్యార్థులతో గంటన్నర పాటు ఆత్మీయ సంభాషణ.. సమస్యలుంటే నేరుగా పోస్టుకార్డు రాయాలని భరోసాగ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అత్యున్నత విద్యా అవకాశాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని విద్యార్థులకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విజ్ఞానం, సాధారణ జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలనుపెంపొందించుకొని దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ సూచించారు. సోమవారం ఉదయం నాగర్‌కర్నూల్ నియోజకవర్గం పరిధిలోని బిజినపల్లి మండలంలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ఆకస్మికంగాసందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో కొనసాగుతున్న విద్యా బోధన, విద్యార్థులకు అందుతున్న వసతి, భోజనం, ప్రయోగశాలలు, తరగతి గదుల నిర్వహణ, విద్యా ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించారు. ఒక్కో తరగతి గదిలోకి వెళ్లి ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును నిశితంగా గమనించడంతో పాటు విద్యార్థులతో నేరుగా సంభాషించి వారి విద్యా ప్రగతి, అవగాహన, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎలాంటి హడావుడి లేకుండా నేరుగా తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ ముందుగా 12వ తరగతి విద్యార్థులకు గణితశాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీధర్ నిర్వహిస్తున్న బోధనను పరిశీలించారు. విద్యార్థులు పాఠాలను ఎంతవరకు అర్థం చేసుకుంటున్నారో తెలుసుకునేందుకు వారితో ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. గణితంలో సూత్రాలను బట్టీ పట్టడం కంటే వాటి వెనుక ఉన్న భావాన్ని అర్థం చేసుకుంటేనే సమస్యలను సులభంగా పరిష్కరించగలమని కలెక్టర్ సూచించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే ప్రతిరోజూ సాధన చేయాలని, సమయపాలన పాటించాలని, ప్రతి అధ్యాయంపై పూర్తి పట్టు సాధించాలని కలెక్టర్ సూచించారు. గణితశాస్త్రం పై భయం కాకుండా ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. అనంతరం బయాలజీ ప్రయోగశాలను సందర్శించిన కలెక్టర్ అక్కడ ఉన్న పరికరాలు, నమూనాలు, ప్రయోగ సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ప్రయోగశాలలో కొంత సమయం గడిపి బయాలజీ సబ్జెక్టులోని పలు ముఖ్యమైన అంశాలను కలెక్టర్ స్వయంగా బోధించారు. జీవశాస్త్రంలో ప్రతి అంశాన్ని కేవలం చదవడమే కాకుండా ప్రయోగాత్మకంగా అర్థం చేసుకోవడం ద్వారా విజ్ఞానం మరింత పెరుగుతుందని వివరించారు.వైద్య, శాస్త్ర పరిశోధన, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో రాణించాలంటే ప్రాథమిక స్థాయి నుంచే బయాలజీపై బలమైన అవగాహన ఉండాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఓర్పుతో సమాధానాలు ఇస్తూ సందేహాలను సైతం కలెక్టర్ నివృత్తి చేశారు. పదో తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ఎంతో ఆత్మీయంగా మాట్లాడారు. చదువులు ఎలా సాగుతున్నాయి, పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారు, పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాధారణ జ్ఞానాన్ని పెంపొందించే ఉద్దేశంతో శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాల మధ్య తేడా ఏమిటని విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థుల సమాధానాలను శ్రద్ధగా విన్న అనంతరం భారతదేశంలోని వివిధ రాష్ట్రాల సాంస్కృతిక సంప్రదాయాలను వివరిస్తూ భరతనాట్యం, కూచిపూడి, కథక్, కథకళి, ఒడిస్సీ, మణిపురి వంటి శాస్త్రీయ నృత్య రూపాల ప్రత్యేకతలను కలెక్టర్ విద్యార్థులకు వివరించారు. అలాగే పంజాబ్‌లో భాంగ్రా, గుజరాత్‌లో గర్బా, రాజస్థాన్‌లో ఘూమర్, తెలంగాణలో లంబాడి తదితర జానపద నృత్యాల ప్రత్యేకతలను వివరించి భారతదేశ సంస్కృతిలోని వైవిధ్యాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా జిల్లా కలెక్టర్ వివరించారు. విద్య అంటే కేవలం పుస్తక విజ్ఞానం మాత్రమే కాదని, దేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా సూచించారు.అనంతరం తొమ్మిదో తరగతి గదిలోరాజస్థాన్,మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి జాతీయ స్థాయి మైగ్రేషన్ పథకం ద్వారా ఎంపికై వచ్చిన 26 మంది విద్యార్థులతో ప్రత్యేకంగా కలెక్టర్ సమావేశమయ్యారు. వారు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ చదువుకుంటున్న అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. వసతి, భోజనం, తాగునీరు, తరగతి గదులు, ఉపాధ్యాయుల సహకారం, ఆరోగ్య సదుపాయాలు, క్రీడా అవకాశాలు వంటి అంశాలపై ఒక్కొక్కరిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు ఇక్కడ కుటుంబ సభ్యుల మాదిరిగా సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా కలెక్టర్ మాట్లాడుతూ. పాఠశాలలో ఎప్పుడైనా ఏదైనా సమస్య ఎదురైతే దానిని మనసులో పెట్టుకోవద్దని సూచించారు. ప్రస్తుతం ప్రిన్సిపల్ ఉన్నందున ప్రిన్సిపల్ ముందు చెబితే ఇబ్బంది ఉందని అనుకుంటే, ప్రస్తుతం ఒకవేళ ఏ కారణం చేతనైనా చెప్పలేకపోతే నేరుగా నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పేరుపై పోస్టుకార్డు రాసి పంపాలని సూచించారు. పోస్టుకార్డుపైపేరురాయకపోయినా ఎలాంటి ఇబ్బంది లేదని, సమస్యను స్పష్టంగా రాసి వట్టెం జవహర్ నవోదయ విద్యాలయం అని పేర్కొని పంపిస్తే అది తనకు చేరుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి సమస్యను వ్యక్తిగతంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత, నాణ్యమైన విద్య కల్పించడం జిల్లా పరిపాలన ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రభుత్వం జవహర్ నవోదయ విద్యాలయాల ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులకు దేశంలోనే అత్యుత్తమ విద్యను పూర్తిగా ఉచితంగా అందిస్తోందని కలెక్టర్ తెలిపారు. అలాంటి అరుదైన అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. హాస్టల్, భోజనం, గ్రంథాలయం, డిజిటల్ తరగతి గదులు, ప్రయోగశాలలు, క్రీడా సౌకర్యాలు వంటి అన్ని వనరులను సమర్థంగా వినియోగించుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఐఏఎస్, ఐపీఎస్, వైద్యులు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, రక్షణ రంగ అధికారులు, పరిశోధకులు వంటి అత్యున్నత లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ప్రేరణనిచ్చారు.విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన, నిరంతర శ్రమ, మంచి విలువలను అలవర్చుకోవాలని, ఉపాధ్యాయులను గౌరవిస్తూ ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. నవోదయ విద్యాలయానికి, నాగర్‌కర్నూల్ జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.ప్రతి విద్యార్థి తన ప్రతిభతో దేశం గర్వించే పౌరుడిగా ఎదగాలని, భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే బాధ్యతగల వ్యక్తిగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. పాఠశాలలోని చేపట్టిన రిపేర్ల పనిని,మౌలికసదుపాయాలు, పరిశుభ్రత, ప్రయోగశాలలు, తరగతి గదులు, హాస్టల్, భోజనశాల తదితర అంశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి ప్రతిభను వెలికితీయాలని, నవోదయ విద్యాలయాన్ని విద్యా రంగంలో మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలో గదుల కొరతపై ప్రిన్సిపల్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు ఈనెల చివరి నాటికి మరోసారి సందర్శించి వాటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో గంటన్నర సమయాన్ని విద్యార్థులతో కలెక్టర్ గడిపారు. జిల్లా కలెక్టర్ వెంట బిజినపల్లి మండల తహశీల్దార్ మునీరుద్దీన్, నవోదయ ప్రిన్సిపల్ డి పూర్ణిమ, నవోదయ హిస్టరీ సీనియర్ ఉపాధ్యాయుడు భాస్కరాచారి, ఇతర సబ్జెక్టుల ఉపాధ్యాయుల బృందం , తదితరులు ఉన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**- జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై 06(విజన్ ఆంధ్ర) : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. శ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామానికి చెందిన ఏ లక్ష్మి తమ గ్రామ నందు ఖాళీగా ఉన్న అంగన్వాడి ఆయా పోస్ట్ తమకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సొసైటీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన మహంకాళి వీరమ్మ, గొట్టె లింగమ్మ సర్వేనెంబర్ 294 నందు ప్రభుత్వం తరపున ఉమ్మడిగా బోర్వెల్ ఏర్పాటు చేయుట గురించి దరఖాస్తు చేసుకోగా ఈడీఎస్సీ కార్పొరేషన్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. మంథని పట్టణం రాఘవ ఊర్ల నగర్ కు చెందిన భీమనపల్లి సురేందర్ తన కుమార్తెకు ఏదైనా బిసి గురుకుల పాఠశాలలో 8వ తరగతి నందు సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా గురుకుల పాఠశాల సొసైటీ అధికారుల కొరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్ , సంబంధిత జిల్లా అధికారులు, కలెక్టరేట్ డి.విభాగ పర్యవేక్షకులు ఈశ్వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 80 దరఖాస్తులు



కామారెడ్డి బ్యూరో జులై 6(విజన్ఆంధ్ర) : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన 80 దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులను కలెక్టర్ స్వయంగా వారి సమస్యలను తెలుసుకున్నారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ, వాటిని ప్రాధాన్యతతో పరిశీలించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పెండింగ్ దరఖాస్తుల పై ఆరా తీశారు. తహసీల్దార్ లు, ఆయా శాఖల అధికారులు ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులతో పాటు, ఆయా సంక్షేమ, అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండరాదని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్.వి గిరి, పీడీసీ రవితేజ, చెప్పడానికి చెప్పు డిఆర్వో పాండు, జడ్పీ సీఈఓ చందర్, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల రైల్వే పాసుల పునరుద్ధరణకు కృషి

**- హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ**




హైదరాబాద్, జూలై 06 (విజన్ ఆంధ్ర) : జర్నలిస్టులకు ఆరోగ్య బీమా, గృహ వసతి, పింఛన్, ప్రమాద బీమా వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో టీజేఏ రాష్ట్ర అధ్యక్షుడు కే.వి.రమణారావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అలాగే జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసుల పునరుద్ధరణ అంశాన్ని మరోసారి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. టీజేఏ రాష్ట్ర అధ్యక్షుడు కే.వి.రమణారావు మాట్లాడుతూ 12 ఏళ్ల పోరాట ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం అక్రిడిటేషన్ కమిటీల్లో టీజేఏకు స్థానం కల్పించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఏ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ ఉప్పల లక్ష్మణ్, ఎన్‌యూజే(ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు ఉక్కల్కర్ రాజేందర్ నాథ్, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ నిజమొద్దీన్, టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ ఏ.ఎస్.రావు, ఎన్‌యూజే(ఐ) కార్యవర్గ సభ్యుడు ధన్నారపు రాజలింగం, టీజేఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరీ, ఉపాధ్యక్షుడు ఖాసీం, కార్యదర్శి నాగస్వామి, కోశాధికారి ఖలీల్ అహ్మద్, మాజీ ఉపాధ్యక్షుడు చింతల నీలకంఠం పాల్గొన్నారు.
వేములవాడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో రబీ ఎండాకాలం ధాన్యం కొనుగోళ్లు పూర్తి

# 11 కొనుగోలు కేంద్రాల ద్వారా 2,21,532.40 క్వింటాళ్ల ధాన్యం సేకరణ.. 2,878 మంది రైతులకు ప్రయోజనం




వేములవాడ రాజన్న సిరిసిల్ల, జులై 06 (విజన్ ఆంధ్ర బ్యూరో): వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన రబీ ఎండాకాలం ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తయ్యాయి. సంఘం పరిధిలోని 11 కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 2,21,532.40 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, 2,878 మంది రైతులు తమ పంటను విక్రయించారు.
సెంటర్ వారీగా కొనుగోళ్ల వివరాలు ఇలా ఉన్నాయి:
వేములవాడ: 35,880.40 క్వింటాళ్లు, శత్రాజుపల్లి: 8,836.40 క్వింటాళ్లు, వట్టెంల: 23,534.40 క్వింటాళ్లు, బొల్లారం: 9,624.40 క్వింటాళ్లు, చెక్కపల్లి: 30,302.00 క్వింటాళ్లు, హన్మాజీపేట: 10,207.20 క్వింటాళ్లు, లింగంపల్లి: 20,963.60 క్వింటాళ్లు, మల్లారం: 31,092.40 క్వింటాళ్లు, మర్రిపల్లి: 11,713.20 క్వింటాళ్లు
నూకలమర్రి: 27,116.80 క్వింటాళ్లు, వెంకటంపల్లి: 12,361.60 క్వింటాళ్లు, ఈ సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు ఏనుగు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, రైతుల సహకారంతో కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

## ఈ నెల 7న జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం....

**- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు**

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 6,(విజన్ ఆంధ్ర) : జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించడం జరుగుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతి శాఖల వారీగా సమీక్షించడం జరుగుతుందని, గ్రామీణ అభివృద్ధి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జల్ జీవన్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గ్రామ సడక్ యోజన, వ్యవసాయం, ఉద్యానవనం, విద్య, వైద్యం ఇతర శాఖల పనితీరుపై సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు,, సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

# NH-30పై పశువుల సంచారానికి చెక్..

**- అర్ధరాత్రి రహదారిపైకి దిగిన కొత్తగూడెం 2 టౌన్ పోలీసులు**

**- పశువుల కొమ్ములకు రేడియం స్టిక్కర్ల అమరిక..**

**- యజమానులకు ఎస్ఐ కిన్నెర రాజశేఖర్ కఠిన హెచ్చరిక**

కొత్తగూడెం బ్యూరో జూలై 07(విజన్ ఆంధ్ర) : జాతీయ రహదారి (చీఎ-30)పై రాత్రి వేళల్లో పశువులు స్వేచ్ఛగా సంచరిస్తుండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు కొత్తగూడెం 2వ టౌన్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రాత్రి సమయంలో వాహనదారులకు పశువులు స్పష్టంగా కనిపించేలా వాటి కొమ్ములకు రేడియం స్టిక్కర్లు అమర్చుతూ, పశువుల యజమానులను అప్రమత్తం చేస్తూ కొత్తగూడెం 2వ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కిన్నెర రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవలి కాలంలో చీఎ-30పై ఆవులు, ఎద్దులు రహదారిపైకి వచ్చి సంచరించడం వల్ల ద్విచక్ర వాహనదారులు, కార్లు, భారీ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో వెలుతురు తక్కువగా ఉండటంతో రహదారిపై ఉన్న పశువులను వాహనదారులు గుర్తించలేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రమాదాలను తగ్గించేందుకు ముందస్తు చర్యగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా రహదారులపై పశువులను వదిలే యజమానులను గుర్తించి, సంబంధిత శాఖలకు అధికారిక లేఖల ద్వారా సమాచారం అందజేశారు. అనంతరం 2026 జూలై 5వ తేదీ అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఎస్ఐ కిన్నెర రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి స్వయంగా జాతీయ రహదారిపైకి వెళ్లి సంచరిస్తున్న ఆవులు, ఎద్దుల కొమ్ములకు ప్రతిబింబించే (రేడియం) స్టిక్కర్లు అమర్చారు. ఈ స్టిక్కర్ల వల్ల రాత్రివేళల్లో వాహనాల హెడ్‌లైట్ వెలుతురులో పశువులు దూరం నుంచే స్పష్టంగా కనిపించి ప్రమాదాలను నివారించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ కిన్నెర రాజశేఖర్ మాట్లాడుతూ, పశువులను రహదారులపై స్వేచ్ఛగా వదిలేయడం చట్టవిరుద్ధమే కాకుండా అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేనని పేర్కొన్నారు. పశువుల యజమానులు తమ పశువులను వెంటనే స్వాధీనంలో ఉంచుకోవాలని, రహదారులపైకి వదలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఇదే పరిస్థితి పునరావృతమైతే సంబంధిత యజమానులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వాహనదారులు కూడా ముఖ్యంగా రాత్రి వేళల్లో అతివేగంతో ప్రయాణించకుండా అప్రమత్తంగా ఉండాలని, రహదారిపై ఏ సమయంలోనైనా పశువులు కనిపించే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ఇలాంటి ప్రత్యేక చర్యలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ పోలీస్ సిబ్బంది రాత్రి వేళల్లో పశువులకు రేడియం స్టిక్కర్లు అమర్చడంలో చురుకుగా పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన




పోలీసు సిబ్బందికి ఎస్ఐ కిన్నెర రాజశేఖర్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. "ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే.. ప్రమాదం జరగకుండా ముందుగానే చర్యలు తీసుకోవడమే నిజమైన పోలీసింగ్" అనే భావనతో కొత్తగూడెం 2 టౌన్ పోలీసులు చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం స్థానిక ప్రజలు, వాహనదారుల నుంచి ప్రశంసలు అందుకుంటోంది.

# ప్రభుత్వం వెంటనే 51 శాతం ఫిట్మెంట్ ప్రకటించాలి

**- పి ఆర్ టి యు పేట జిల్లా అధ్యక్షులుయాదగిరిజనార్దన్ రెడ్డి.**




నారాయణపేట, జులై 6 (విజన్ ఆంధ్ర) : ఉపాధ్యాయుల సంక్షేమం పి ఆర్ టి యు తోనే సాధ్యమని నారాయణపేట పిఆర్టియు టీఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి జనార్ధన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ నివేదికను తెప్పించుకొని 51 శాతం ఫిట్మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సోమవారం మక్తల్ మండల శాఖ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాబు ఆధ్వర్యంలో టిఆర్టియు 2026 - 2027 ఏడాది సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ అపరిష్కృత ఉపాధ్యాయ సమస్యల సాధన పిఆర్టియుతోనే సాధ్యమవుతుందనిఅన్నారు. బతకలేని బడిపంతులు స్థాయి నుండి అనేక సౌకర్యాలను తీసుకొచ్చిన సంఘం అని అన్నారు. ప్రస్తుతము రాష్ట్ర ప్రభుత్వాలు కొంత నిర్లక్ష్యం కారణంగా పి.ఆర్.సి, డి ఏ లు మరి బిల్లులు పెండింగ్లో పెట్టడం సగటు ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా పరిణమిచ్చిందని అన్నారు. ప్రభుత్వము కొన్ని అంశాలను పరిష్కరిస్తామని చెబుతూ ఆలస్యం చేయడము బాగోలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వము, హైకోర్టు 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఇవ్వాలని చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వము కాలయాపన చేయడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారి మేనిఫెస్టోలో సిపిఎస్ ని రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ అమలుపరుస్తామని చెప్పి దాదాపు మూడు సంవత్సరాలైనా అమలు చేయకపోవడం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులలో అసహనం పెరిగిపోతుందని దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వము వెంటనే సిపిఎస్ రద్దు, అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలను కలగజేయాలని అదేవిధంగా ఏకీకృత సర్వీస్ రూల్స్ ను అమలు చేసి అన్ని రకాల ప్రమోషన్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంఘపక్షాన పెద్ద మొత్తంలో ఉద్యమ బాట పడతామని ఉపాధ్యాయులు అందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంలు వెంకటయ్య,లలిత,పి ఆర్ యు టి ఎస్ మాజీ మక్తల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అసోసియేటర్ అధ్యక్షులు శ్రీనివాసరావు, గాయత్రి రమేష్,బాలరాజ్,కే శ్రీనివాస్,శివ శంకర్ పిఆర్టియు సభ్యులు గాలి చంద్రశేఖర్ వరుణ్, అంజనేయులు, ఆర్అశోక్ కుమార్, డి వెంకటేష్,మారుతీ, కె. అశోక్ డి వై ఎస్ ఓ వెంకటేష్ శెట్టి ఆయా పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు ఉపాధ్యాయ బృందము పాల్గొన్నారు.

# భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

**- AITUC జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్.**

**- ప్రతి నెల ఒకటో తేదీన వేతనం ఇవ్వాలి.**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 6(విజన్ ఆంధ్ర) : మిషన్ భగీరథ కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ కార్మికులకు గత 3 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ AITUC ఆధ్వర్యంలో ఈరోజు కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ యువరాజు మర్మాట్ కు మెమోరండం ఇవ్వడం జరిగింది. ఆసిఫాబాద్ సెగ్మెంట్‌లో పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులకు గత కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. LÊT, ఎవరెస్ట్ మరియు ఇతర ఏజెన్సీలను అనేకసార్లు కలిసినప్పటికీ వేతనాల చెల్లింపులో కాలయాపన చేస్తున్నారు. వేతనాలు అందకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మా ప్రధాన డిమాండ్లు:

1. పెండింగ్ 3 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలి
2. ప్రతి నెల 1వ తేదీన వేతనం చెల్లించాలి
3. 26 రోజుల పని + 8 గంటల పని విధానం అమలు చేయాలి
4. ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలు భగీరథ కార్మికులకు వర్తింపజేయాలి
5. ఎక్స్-గ్రేషియా, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి
6. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి
7. ఉద్యోగ భద్రత కల్పించాలి
8. సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలి
9. 20% బోనస్ లేదా ఒక నెల జీతం ఇవ్వాలి
10. గ్రాట్యుటీ, ESI, EPF సౌకర్యాలు కల్పించాలి
11. జాతీయ పండుగ సెలవులు మంజూరు చేయాలి

ప్రభుత్వం సహృదయంతో స్పందించి పై సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఆత్మకురి చిరంజీవి – జిల్లా గౌరవ అధ్యక్షుడు . చాపిడి బాలేష్ – జిల్లా అధ్యక్షులు నాఖ. జంషద్ – జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ SK. షకీర్ – జిల్లా ప్రధాన కార్యదర్శి

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**- ప్రజావాణి దరఖాస్తులు 76**

**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్..**



సూర్యాపేట జూలై 06:(విజన్ ఆంధ్ర) : ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 43 దరఖాస్తులు,డీపీఓ 5 మున్సిపాలిటీ 5, డిడబ్ల్యుఓ 4 మిగిలిన 19 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని మొత్తం 76 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజు, జడ్ పిసిఇఓ శిరీష, డీపీఓ యాదగిరి, డిఎంహెచ్ఓ వెంకటరమణ, పిడి హౌసింగ్ సిద్ధార్థ్, డిఎఫ్ఓ దామోదర్ రెడ్డి, సిపిఓ కిషన్ డిఇఓ అశోక్ , సంక్షేమ అధికారులు నరసింహారావు, దయానంద రాణి ఇతర జిల్లా అధికారులు తదితరులు హాజరైనారు.

## దోమకొండ లో ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభం

కామారెడ్డి బ్యూరో జూలై 6(విజన్ఆంధ్ర): కామారెడ్డి జిల్లా దోమకొండ గ్రామ పరిధిలోని పలుగుగడ్డ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేస్తూ ఆరోగ్య ఉపకేంద్రాన్ని (హెల్త్ సబ్-సెంటర్) సోమవారం ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన సర్పంచ్ ఐరేణి నర్సయ్య రిబ్బన్ కట్ చేసి, ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పలుగుగడ్డ పరిసర ప్రాంతాల ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు కూడా దూరంగా బస్టాండ్ వద్ద గల ఆరోగ్యకేంద్రానికి వెళ్లకుండా, పలుగుగడ్డ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించాలనే సత్సంకల్పంతో ఈ ఉపకేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆరోగ్య కేంద్రం ఇంచార్జ్ సంజీవని సిస్టర్ మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలకు పరీక్షలు, చిన్న పిల్లలకు టీకాలు, బీపీ, షుగర్ వంటి సాధారణ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు మరియు



మందులు ఈ కేంద్రం ద్వారా ఉచితంగా లభిస్తాయని వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం చైర్మన్ బత్తిని సిద్దరాములు, ఉపసర్పంచ్ బొమ్మెర శ్రీనివాస్, వార్డు సభ్యులు పాలకుర్తి శేఖర్, నాగారపు ఎల్లయ్య, బాలే సురేందర్, బీసు సంతోష్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆశా వర్కర్లు పలుగుగడ్డ ప్రాంత కాలనీ వాసులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బంది సంక్షేమానికి మరో అడుగు..

**- జిల్లా పోలీసులకు రెయిన్ కోట్స్ పంపిణీ**



రాజన్న సిరిసిల్ల, జూలై 06 (విజన్ ఆంధ్ర బ్యూరో) : వర్షాకాలంలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కోకుండా వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా పోలీసు శాఖ రెయిన్ కోట్స్‌ను పంపిణీ చేసింది. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, ఐపీఎస్ జిల్లా పోలీసు సిబ్బందికి మంజూరైన రెయిన్ కోట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది అన్ని వాతావరణ పరిస్థితుల్లో ప్రజలకు సేవలందిస్తున్నారని, వర్షాకాలంలో విధులు సులభంగా నిర్వహించేందుకు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం నుంచి మంజూరైన రెయిన్ కోట్స్‌ను పంపిణీ చేసినట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తుందని, విధి నిర్వహణకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ (అడ్మిన్) సురేష్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన కుంట్లూరు కురుమ సంఘం ఎన్నిక

**-పెద్ద కురుమ దడిగ కొమురయ్య కురుమ**

**-శేలోజీ కంకల సత్తయ్యకురుమ**



రంగారెడ్డి/అబ్దుల్లాపూర్ మెట్ జులై 6 (విజన్ ఆంధ్ర): రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, అబ్దుల్లాపూర్ మెట్ మండలం, ఎంఎంసీ నాగోల్ సర్కిల్ కుంట్లూరు గ్రామం నూతన కురుమ సంఘం ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఈ సందర్భంగా గ్రామంలో ఆదివారం నిర్వహించిన కురుమ కుల పెద్దల సమావేశంలో కురుమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెద్ద కురుమ దడిగ కొమురయ్యకురుమ, శేలోజీ కంకల సత్తయ్యకురుమ, అధ్యక్షులుగా నీళ్ల జంగయ్య కురుమ, ప్రధాన కార్యదర్శిగా పల్లె మల్లేశం కురుమ, కోశాధికారిగా కోడూరి అశోక్ కురుమ, ఉపాధ్యక్షులుగా రావుల నరసింహ కురుమ, అచ్చిన శీను కురుమ, గుత్తి రమేష్ కురుమ, బండ శంకరయ్య కురుమ, కార్యదర్శులుగా నర్రి శ్రీశైలం కురుమ, కొత్త కురుమ మల్లేష్ కురుమ, కొండే ప్రదీప్ కురుమ, బర్ల లింగస్వామి కురుమ, సహాయ కార్యదర్శులుగా పాలంచి రాజు కురుమ, మీస బాలరాజు కురుమ, మంగ కృష్ణ కురుమ, మంగ నరసింహ కురుమ, గౌరవ సలహాదారుగా కప్పె రమేష్ కురుమ, అదే మల్లేష్ కురుమ, జమ్ము వీరభద్రం కురుమ, కమిటీ సభ్యులుగా జమ్ము యాదయ్య కురుమ, అరిగే లింగస్వామి కురుమ, ఒగ్గు అయోధ్య కురుమ, కుండే బిక్షపతి కురుమ, నర్రి శ్రీశైలం కురుమలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కురుమ సంఘం కమిటీ సభ్యులకు కురుమ ప్రతినిధులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎంపీడీవో పర్యవేక్షణ కరువు

**- సమయపాలన పాటించని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది.**

**- పట్టించుకోని ఉన్నత అధికారులు**




ఇబ్రహీంపట్నం జూలై 06(విజన్ ఆంధ్ర): ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న అధికారుల తీరు ఉన్నత అధికారులు హెచ్చరించిన మారడం లేదు అని విమర్శలువినిపిస్తున్నాయి. కార్యాలయ సిబ్బంది మేం అధికారులం మాకు నచ్చినప్పుడు కార్యానికి వస్తాం నచ్చినప్పుడు కార్యాలయం నుంచి వెళ్తాం అనే రీతిగా తయారయింది. పలుమార్లు అధికారుల తీరుపై పలు పత్రికల లో వచ్చిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అంతా మా ఇష్టం కార్యాలయానికి ఎప్పుడయినా వస్తాం. ఎప్పుడయినా వెళ్తాము అనే తీరుగా తయారైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బంది కొందరు ఉదయం 11 గంటలు దాటినావిధులకు హాజరు కాకపోవడం తో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం10.00 గంటలకు వచ్చి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులు ఉదయం 11 దాటినా కార్యాలయానికి రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవోలు వివరణ కోరగా ఆదివారం రోజున సిబ్బంది పని చేసినారు కాబట్టి సోమవారం లేటుగా రావడం జరుగుతుంది అని చెప్పడం జరిగింది. ఉన్నత అధికారులు ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయం పై దృష్టి సారించి గాడితప్పిన అధికారులను గాడిలో పెట్టి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనకుండా అధికారులపై చర్యలు తీసుకొనవలసిందిగా మండల ప్రజలు కోరుతున్నారు, పలుమార్లు అధికారులు సమయపాలన పాటించడం లేదని, ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పత్రికల్లో వచ్చినా ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకాకపోవడంతో అందరూ అధికారులు ఒక్కటేనా... ఈ అధికారులు మారరా... మా సమస్యలను పట్టించుకునే అధికారులే లేరా అని మండల ప్రజలు అసహనానికి గురి అవుతున్నారు . ఇప్పటికయినా ఉన్నతాధికారులు స్పందించి సమయపాలన పాటించని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

**ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**



కామారెడ్డి బ్యూరో జులై 6(విజన్ఆంధ్ర) : రైతులకు ఆదర్శంగా నా 12 ఎకరాల వరి సాగును నిలిపివేసి ఆయిల్ ఫామ్ సాగు ప్రారంభించాను రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పిలుపునిచ్చారు.కామారెడ్డి జిల్లాలోని తన సొంత వ్యవసాయ క్షేత్రంలో వరి సాగు చేస్తున్న 12 ఎకరాల భూమిలో వరి పంటను నిలిపివేసి ఆయిల్ ఫామ్ సాగును ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. రైతులకు కేవలం సూచనలు ఇవ్వడం మాత్రమే కాకుండా, తానే ఆచరించి చూపాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ,రాష్ట్రంలో భూగర్భ జలాల పరిరక్షణ, నీటి వినియోగం తగ్గింపు, రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తోందన్నారు. ముఖ్యంగా ఆయిల్ ఫామ్ వంటి వాణిజ్య పంటలకు భవిష్యత్తులో మంచి మార్కెట్‌తో పాటు స్థిరమైన ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం వరి సాగులో సాగునీటి వినియోగం అధికంగా ఉండటంతో పాటు ఉత్పత్తి వ్యయం కూడా పెరుగుతోందని, మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు నీటిని ఆదా చేసే పంటల సాగుపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్ ఫామ్ సాగు ద్వారా దీర్ఘకాలికంగా అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల వైవిధ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు కూడా రైతులకు శాస్త్రీయ సలహాలు అందిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చేందుకు అవసరమైన ప్రోత్సాహకాలు, సాంకేతిక సహకారం అందిస్తోందన్నారు. రైతులు ప్రభుత్వ సూచనలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించాలని ఆకాంక్షించారు.రైతుల్లో విశ్వాసం పెంపొందించడమే తన లక్ష్యమని, అందుకే ముందుగా తన వ్యవసాయ క్షేత్రంలోనే పంట మార్పు చేపట్టానని షబ్బీర్ అలీ తెలిపారు. రైతులు కూడా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆయిల్ ఫామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు నాయకులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల బాధితులకు వేగవంతమైన న్యాయం అందించడమే లక్ష్యం

**- సైబర్ వారియర్స్‌కు ప్రత్యేక శిక్షణ**

**- ఎస్పీ యం. రాజేష్ చంద్ర,**



కామారెడ్డి బ్యూరో జులై 6(విజన్ఆంధ్ర) : జి.ఆర్.ఎం, ఎం ఆర్ ఎం మాడ్యూళ్ల వినియోగంపై జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, దిశానిర్దేశం చేశారు.సైబర్ నేరాల దర్యాప్తును మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, బాధితులకు వేగవంతమైన సేవలు అందించడం లక్ష్యంగా కామారెడ్డి జిల్లా పోలీసు అధికారి యం. రాజేష్ చంద్ర, ఆదేశాల మేరకు జిల్లా సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (డి 4 సి) ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల సైబర్ వారియర్స్‌కు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రీవెన్స్ రెడ్రెస్సల్ మాడ్యూల్ ( జి ఆర్ ఎం ), మనీ రెస్టోరేషన్ మాడ్యూల్ (ఎం ఆర్ ఎం)ల వినియోగం, వాటి విధివిధానాలు, అమలు ప్రక్రియ, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించారు.సైబర్ నేరాల్లో ఎటువంటి ప్రమేయం లేకపోయినా దర్యాప్తు ప్రక్రియలో బ్యాంకు ఖాతాలు లేదా అందులోని నగదు ఫ్రీజ్ అయిన పౌరులు జి ఆర్ ఎం పోర్టల్ ద్వారా తమ వినతులను సమర్పించుకోవచ్చని తెలిపారు. అనంతరం సంబంధిత దర్యాప్తు అధికారి బ్యాంకులతో సమన్వయం చేసి దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల మేరకు అర్హులైన వారి బ్యాంకు ఖాతాలను డీ-ఫ్రీజ్ చేయడం లేదా ఫ్రీజ్ అయిన నగదును విడుదల చేసే చర్యలు చేపడతారని వివరించారు.అలాగే సైబర్ మోసాలకు గురైన బాధితులకు కోల్పోయిన నగదును త్వరితగతిన తిరిగి అందించేందుకు ఎం ఆర్ ఎం మాడ్యూల్ కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ విధానం ప్రకారం రూ.50,000 లోపు ఫ్రీజ్ అయిన అర్హత కలిగిన మొత్తాన్ని కోర్టు ఉత్తర్వులు అవసరం లేకుండానే, సంబంధిత నిబంధనలు, పరిశీలన అనంతరం బాధితులకు పునరుద్ధరించే అవకాశం ఉందని వివరించారు. దీంతో బాధితులకు త్వరితగతిన న్యాయం అందడంతో పాటు కోర్టు ప్రక్రియకు పట్టే సమయం కూడా గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల సైబర్ వారియర్స్ జి ఆర్ ఎం, ఎం ఆర్ ఎం మాడ్యూళ్లను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజల వినతులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. బ్యాంకులు, దర్యాప్తు అధికారులతో సమన్వయం పెంచి అర్హులైన వారి బ్యాంకు ఖాతాలను త్వరితగతిన డీ-ఫ్రీజ్ చేయడంతో పాటు సైబర్ మోసాలకు గురైన బాధితులకు నగదు పునరుద్ధరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. జి ఆర్ ఎం, ఎం ఆర్ ఎం మాడ్యూళ్ల సమర్థ వినియోగం ద్వారా సైబర్ నేరాల బాధితులకు సకాలంలో న్యాయం అందించడంతో పాటు పోలీసు సేవలను మరింత పారదర్శకంగా, ప్రజలకు చేరువగా తీసుకెళ్లవచ్చని, తద్వారా పోలీసు శాఖపై ప్రజల విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధన్యత ఇవ్వాలి

**- క్షేత్ర స్థాయి లో విచారణ త్వరగా చేయాలి**

**- గ్రీవెన్స్ వినతులు పెండింగ్ లో ఉండొద్దు**

**- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, జూలై6(విజన్ ఆంధ్ర): జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చి తమ సమస్య ల పైన వినతులను సమర్పించే ప్రజలకు నమ్మకం కలిగేల వారి సమస్యలను త్వరితగతిన పరిష్కారించేందుకు జిల్లా అధికారులు కృషి చేయాలనీ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వినతిపత్రాలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రజల నుంచి కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులను తీసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకుని సమస్య పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.ప్రజల వినతులను పెండింగ్‌లో లేకుండా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, పారదర్శకంగా ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం అని స్పష్టం చేశారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి అర్జీలను త్వరగా పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులకు సూచించారు. ఈ గ్రీవెన్స్ లో 396 వినతులు స్వీకరించారు. అందులో జనగాం మండలం వెంకీర్యాల గ్రామానికి చెందిన రామగుండం పద్మ అనే మహిళ ఇందిరమ్మ ఇళ్ళు కోసం దరఖాస్తు సమర్పించింది.దేవరుప్పుల మండలం నిర్మల గ్రామానికి చెందిన అంగల మనోహర్ రెడ్డి అనే వ్యక్తి తనకు చెందిన భూమి పూర్తిగా పాస్ బుక్ లో నమోదు కాలేదని సర్వే ప్రక్రియ పూర్తి అయిన భూమికి సంబందించిన వివరాలను పాస్ బుక్ లో నమోదు చేయాలనీ కోరారు. జనగాం మండలం ఇప్పగూడెం కి చెందిన శ్రీకాంత్ తను పేదవాడిని అలాగే అందుడని పేర్కొంటూ అంత్యోదయ కార్డు కావాలని కోరారు.బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామానికి చెందిన లక్ష్మయ్య తనకు చెందిన భూమిని వారసత్వ పట్టా ప్రకారం తన పేరు మీదకు మార్చాలని వినతి సమర్పించాడు.ఈ ప్రజావాణిలో డీఆర్డీఓ భాస్కర్, గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృ నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూదాన భూమిపై అధికారులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలి..

**- హక్కు కల్పించాలంటూ దళిత కుటుంబం వినతి..**



సూర్యాపేట జూలై 06:(విజన్ ఆంధ్ర) : నూతనకల్ మండలం ఎర్రపాడు గ్రామానికి చెందిన పిడమర్తి అంజయ్య తన కుటుంబానికి భూదానంగా లభించిన భూమిపై తమకే చట్టబద్ధమైన హక్కు ఉందని, అధికారులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రం ఆర్డీఓ ఆఫీస్ ఎదుట వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు 1960లో భూదాన యజ్ఞం సందర్భంగా ఆచార్య వినోబా భావే ఎర్రపాడు గ్రామంలో పర్యటించిన సమయంలో గ్రామానికి చెందిన భూస్వామి జన్నారెడ్డి శ్యాంసుందర్ రెడ్డి చందుపట్ల శివారులోని సర్వే నంబర్ 280లో 1 ఎకరం 35 గుంటలు, సర్వే నంబర్ 283లో 24 గుంటలు కలిపి మొత్తం 2 ఎకరాల 19 గుంటల భూమిని తన తండ్రి పిడమర్తి రాములు (తండ్రి వెంకటయ్య)కు భూదానంగా ఇచ్చారని తెలిపారు. అప్పటి నుంచి తమ కుటుంబం ఆ భూమిని అనుభవిస్తూ సాగు చేసుకుంటూ వచ్చిందని పేర్కొన్నారు.తండ్రి మరణానంతరం తాము వారసులుగా భూమిని సాగు చేసుకుంటున్నామని, జీవనోపాధి కోసం 2020 హైదరాబాద్‌కు వెళ్లిన సమయంలో గ్రామానికి చెందిన అగ్ర కులానికి చెందిన అనంతుల రాములు కోడిదెల వెంకన్న, కుంచం పెద్ద మల్లయ్య, కుంచం చిన్న మల్లయ్య, గోగుల రాములు తమ భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. భూమిలోకి వెళ్లిన ప్రతిసారి తమను అడ్డుకోవడం, బెదిరించడం, దౌర్జన్యానికి పాల్పడటం జరిగిందని తెలిపారు.ఈ విషయమై 2021 జనవరి 27న జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంబంధిత భూములపై కోర్టు వివాదం ఉన్నందున ప్రత్యేక నిర్ణయం అనంతరం పరిశీలిస్తామని అధికారులు అప్పట్లో తెలిపారని చెప్పారు. అయినప్పటికీ తమ వద్ద సంబంధిత సర్వే నంబర్లకు సంబంధించిన చట్టబద్ధమైన ఆధారాలు, హక్కు పత్రాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఇటీవల ప్రభుత్వం సీలింగ్ భూముల సర్వే చేపట్టిన సమయంలో కూడా తమ భూమిని అధికారులకు చూపించినట్లు తెలిపారు. అయితే సర్వే సమయంలో ఆక్రమణదారులు అధికారులు జిపిఓ ఇందిరా సమక్షంలోనే బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. మరోసారి సర్వే సందర్భంగా తాము భూమిపై లేమని రాసి ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారని, అయితే అందుకు నిరాకరించినట్లు తెలిపారు. అనంతరం నిర్వహించిన తుది సర్వేలో తమకు సమాచారం ఇవ్వకుండా తమ పేర్లను తొలగించి, ఇతరుల పేర్లు నమోదు చేశారని ఆరోపించారు.తమ వద్ద ఉన్న అధికారిక రికార్డులను పరిశీలించి, భూదానంగా లభించిన భూమిపై తమ చట్టబద్ధ హక్కును గుర్తించి పట్టా మంజూరు చేయాలని, అలాగే వివాదాస్పద భూమిపై పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని పిడమర్తి అంజయ్య అధికారులను విజ్ఞప్తి చేశారు.

# కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ధర్నాకు బీసీఎస్సీ జేఏసీ, తెలంగాణ విద్యావంతుల వేదిక సంపూర్ణ మద్దతు




భూపాలపల్లి జిల్లా : 6 జులై ( విజన్ ఆంధ్ర ) భూపాలపల్లి జిఎం కార్యాలయం ముందు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బొగ్గు గనుల వేలం విధానానికి వ్యతిరేకంగా, అలాగే సింగరేణి ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ చేపట్టిన ధర్నాకు బీసీఎస్సీ జేఏసీ మరియు తెలంగాణ విద్యావంతుల వేదిక సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా బీసీఎస్సీ జేఏసీ జిల్లా కన్వీనర్ రాదండి దేవేందర్ తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ రాదండి దేవేందర్ మాట్లాడుతూ, సింగరేణి అధికారులు, ఉద్యోగులు చేస్తున్న డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవని పేర్కొన్నారు. వెంటనే జీతాల ఎక్స్‌గ్రేషియా పెంపును అమలు చేయాలని, జీతంలో భాగమైన పీఆర్‌పీని పెంచి చెల్లించాలని, పారదర్శకమైన ప్రమోషన్ పాలసీని అమలు చేయాలని, సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ దేశ ఆర్థికాభివృద్ధికి కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థ అని, అలాంటి సంస్థలో పనిచేస్తున్న అధికారుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల సంక్షేమం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ ఉద్యమానికి అన్ని ప్రజాస్వామ్య శక్తులు, కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దీజ రాజ రా జీూజ జిల్లా కో కన్వీనర్ జోగుల సమ్మయ్య కొత్తూరి రవీందర్ జిల్లా కో ఆర్డినేటర్ జిల్లా నాయకులు శిలపాక హరీష్,మేకల ఓంకార్ రేణుకుంట్ల మహేష్ పక్కల రాజేందర్ పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ కె. హరిత**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై:06 (విజన్ ఆంధ్ర) : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను శాఖల వారీగా, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వెంకటులు కలసి కలెక్టర్ పాల్గొని అర్జీల స్వీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమం ద్వారా వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, చట్ట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని, లాంగ్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు.

ప్రజావాణిలో అందిన ముఖ్యమైన అర్జీల వివరాలు:

వాంకిడి మండలం, తేజాపూర్ గ్రామం: నగారే శ్యాంరావు అనే వ్యక్తి తనకు దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. తిర్యాణి మండలం, అవలగూడ గ్రామం: బుర్క వెంకటి తనకు గతంలో వస్తున్న పింఛన్ ఆగిపోయిందని, కావున తిరిగి పునరుద్ధరించాలని దరఖాస్తు చేసుకున్నారు. రెబ్బెన మండలం, వక్కులం గ్రామం: శ్రీరాముల పార్వతి అనే మహిళ తమ తండ్రి గారి పేరిట గల భూమిని ఇతరులు అక్రమంగా ఆక్రమించుకున్నందున తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. కాగజ్‌నగర్ మండలం, అంకుశాపూర్ గ్రామం: చునార్కార్ మురళీబాయి అను ఆమె తన భూమి పట్టా గురించిన సమస్యపై దరఖాస్తు చేసుకున్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ, రాంనగర్ (కాపువాడ): శేఖ నాబోతుమ్మ తమ కాలనీలో గల రహదారిని ఆక్రమించి ఇల్లు నిర్మాణం చేస్తున్నందున చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. తిర్యాణి మండలం, భింభినిగూడ గ్రామం: కొవ్వ పెద్ద రాజు.. తమ పట్టా భూమిలో ఎలాంటి ఒప్పందం లేకుండా పాఠశాల భవన నిర్మాణం చేపట్టడంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగజ్‌నగర్ మండలం, గువ్వలగుండి గ్రామం: గో28ంద్ లాల్ తమ పట్టా భూమి కిస్తోలీ విరాళముగా పోయినందున నష్టపరిహారం ఇప్పించాలని దరఖాస్తు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు - జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, జూలై 06 (విజన్ ఆంధ్ర బ్యూరో): ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రజా ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 144 దరఖాస్తులు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి, త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలని కలెక్టర్ సూచించారు. అలాగే హైదరాబాద్‌లో నిర్వహించే ప్రజావాణికి సంబంధించిన దరఖాస్తులను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించి, తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

సిరిసిల్ల, వేములవాడలోనూ ప్రజావాణి

సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. సిరిసిల్లలో 4, వేములవాడలో 2 దరఖాస్తులు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖితా రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# బోర్లకుంట గ్రామపంచాయతీ అంగన్వాడి కేంద్రంలో కుళ్ళిపోయిన సరుకుల పంపిణీ






కాగజ్నగర్ జులై 6(విజన్ ఆంధ్ర) కొమరం భీం జిల్లా దహెగాం మండలంలోని బోర్లకుంట గ్రామపంచాయతీ పరిధిలోని రాల్లగూడ అంగన్వాడీ కేంద్రంలో కాలం చెల్లిన సరకుల పంపిణీ జరిగిందనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపాయి. గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసిన గుడ్లు, పాల ప్యాకెట్ల గడువు తేదీ ముగిసిపోయిందని గ్రామస్థులు ఆరోపించారు. అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన సరకులను పంపిణీ చేసే ముందు వాటి ఎక్స్‌పైరీ తేదీలను సిబ్బంది పరిశీలించలేదని వారు విమర్శించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పోషకాహారం వారి ఆరోగ్యానికి ఎంతో కీలకమని గ్రామస్థులు పేర్కొన్నారు. అలాంటి సరకుల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం వల్ల లబ్ధిదారుల ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల ఆహార విషబాధతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. సరకులు కేంద్రానికి చేరుకున్న వెంటనే వాటి తయారీ తేదీ, గడువు తేదీ, నాణ్యత వంటి అంశాలను తప్పనిసరిగా పరిశీలించాల్సిన బాధ్యత సిబ్బందిపైనే ఉంటుందని గ్రామస్థులు గుర్తు చేశారు. అయితే ఈ విషయంలో తీవ్రమైన నిర్లక్ష్యం జరిగిందని ఆరోపించారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కూడా సరిగా లేకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి సరుకును నాణ్యత, గడువు తేదీల ఆధారంగా పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ ఘటనపై సంబంధిత అంగన్వాడీ సిబ్బంది లేదా ఉన్నతాధికారుల అధికారిక స్పందన ఇంకా వెలువడలేదు. ఆరోపణలపై విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## మానవత్వం చాటిన మాదిగ రాజ్య పోరాట సమితి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ బాగయ్య

కామారెడ్డి బ్యూరో జులై 6(విజన్ఆంధ్ర) : మానవత్వం చాటిన మాదిగ రాజ్య పోరాట సమితి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ బాగయ్య కామారెడ్డి జిల్లా కేంద్రంలో గవర్నమెంట్ హాస్పటల్ ఎదురుగా దిక్కుమక్కు తెలియని ఒక మహిళ ను ఆమెకు ఎవరు సాయం చేయలేదు చాలా బాధాకరమైన చాలా దుఃఖం అనిపించిందని మాదిగ రాజ్య పోరాట సమితి



ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ బాగయ్య ఆమెకు బట్టలు అందించారు. ఆ భగవంతుడు ఆమెను చల్లగా చూడాలని కోరారు.

# న్యాయవాదుల దరఖాస్తులకు ఆహ్వానం

- 202627 సంవత్సరానికి న్యాయశాస్త్ర శిక్షణ కోర్సు ప్రవేశాలు ప్రారంభం
- మెడ్చల్‌మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ప్రకటన
- అర్హులైన బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- లా కోర్సులకు రూ.2 లక్షలు.. గ్రామీణ విద్యార్థులకు రూ.1.50 లక్షల ఆదాయ పరిమితి
- శిక్షణ కాలంలో నెలకు రూ.1,000 స్టైపెండ్, పుస్తకాలకు ప్రత్యేక భృతి
- అడ్వకేట్ బాండ్లకు రూ.585, బార్ కౌన్సిల్ ఫీజుకు రూ.3 వేల ఆర్థిక సహాయం




దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ జూలై 13 : కుత్బుల్లాపూర్, జులై 6 (విజన్ ఆంధ్ర) : 202627 విద్యా సంవత్సరానికి న్యాయశాస్త్ర శిక్షణ (లా కోర్సు)లో ప్రవేశాల కోసం అర్హులైన బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుల వార్షిక కుటుంబ ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలకు మించరాదని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కాలంలో నెలకు రూ.1,000 స్టైపెండ్‌తో పాటు అడ్వకేట్ బాండ్ల కొనుగోలుకు రూ.585, లా పుస్తకాల కొనుగోలుకు రూ.3 వేల ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకునేందుకు అవసరమైన రిజిస్ట్రేషన్ గ్రాంట్ కూడా మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. అర్హతలు, దరఖాస్తు విధానం తదితర పూర్తి వివరాల కోసం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయం, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ: జూలై 13 అని అధికారులు స్పష్టం చేశారు. అర్హులైన బీసీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఉద్యమకారులకు పెన్షన్ ఇంటి స్థలాలు ఇవ్వాలి

- ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ విధానం రూపొందించాలి డాక్టర్ పిడమర్తి రవి



విజన్ ఆంధ్ర (06)హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమ కారులకు ప్రభుత్వం తగిన గుర్తింపు, గౌరవం కల్పించడంతో పాటు నెలవారీ పెన్షన్, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు, సోమవారం కేకే కమిటీ ఆధ్వర్యంలో అమరజ్యోతి భవన్‌లో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు, రాష్ట్ర సాధన కోసం జీవితాలను అంకితం చేసిన ఉద్యమ కారుల సేవలను ప్రభుత్వం మరువకూడదని అన్నారు, మాజీ శాసన సభ్యులకు కల్పిస్తున్న స్థాయిలోనే ఉద్యమ కారులకు కూడా గౌరవ ప్రదమైన పెన్షన్ అందించాలని విజ్ఞప్తి చేశారు, తెలంగాణ ఉద్యమ విజయంలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమైందని, అయితే గత ప్రభుత్వ హయాంలో ఉద్యమకారులు ఆశించిన స్థాయిలో గుర్తింపు, న్యాయం పొందలేదని విమర్శించారు, ప్రభుత్వ వ్యవస్థలో ఉద్యమ కారులకు సముచిత స్థానం కల్పించి, వారి అనుభవాన్ని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించు కోవాలని సూచించారు, జార్ఖండ్, అస్సాం రాష్ట్రాల్లో ఉద్యమ కారులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుని, తెలంగాణ ప్రభుత్వం కూడా ప్రత్యేక సంక్షేమ విధానాన్ని రూపొందించాలని కోరారు, ఉద్యమ కారులకు పెన్షన్‌తో పాటు ఇంటి స్థలాలు, వైద్య సదుపాయాలు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు, సమావేశంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉద్యమ కారులు, ఉద్యమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు, ఉద్యమ కారుల సంక్షేమం, గుర్తింపు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి, ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించాలని నిర్ణయించారు

# ఘనంగా జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల పంపిణీ

- మంత్రి వివేక్, ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్ చేతుల మీదుగా కార్డుల అందజేత
- కార్డు అందుకున్న 'విజన్ ఆంధ్ర' జిల్లా ప్రతినిధి దేవులపల్లి ఎల్లయ్య



సిద్దిపేట జిల్లా, 06 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా కేంద్రంలో సోమవారం జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి వివేక్, స్థానిక పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథులుగా పాల్గొని అర్హులైన జర్నలిస్టులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా 'విజన్ ఆంధ్ర' పత్రిక జిల్లా ప్రతినిధి దేవులపల్లి ఎల్లయ్య మంత్రి వివేక్, ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్ చేతుల మీదుగా తన అక్రిడేషన్ కార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల వృత్తిపరమైన గుర్తింపు, సామాజిక భద్రత మరియు వారు అందించే సేవలను మరింత బలోపేతం చేయడంలో ఈ అక్రిడేషన్ కార్డులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమించే జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని వారు ఈ సందర్భంగా స్పష్టం అహర్నిశల్ కష్టపడే జర్నలిస్టులందరికీ త్రిబుల్ బెడ్ రూమ్ నిర్మించుకునేలా స్థలాన్ని కేటాయించాలని ఎంపీ రఘునందన్ రావు కోరారు అలాగే ప్రతి జర్నలిస్టుకు పది లక్షల హెల్త్ కార్డు మంజూరు చేయాలని మంత్రి వివేక వెంకట్ స్వామిని కోరారు గతంలో తెలంగాణ ఉద్యమంలో మరణించినటువంటి మిడిదొడ్డి విలేఖరికి 10 లక్షలు ఇస్తామని ప్రకటించినారు కానీ ఇంతవరకు వారి కుటుంబానికి ఎలాంటి నష్టపరిహారం అందలేదని ఆయన కోరారు. జర్నలిస్టులు గృహము నిర్మించుకునే మీ ప్రభుత్వం నుండి ఇచ్చే అమౌంట్ కాకుండా అదనంగా అమౌంట్ కేటాయించి జర్నలిస్టులను ఆదుకోవాలని రఘునందన్ రావు వివేక్ వెంకటస్వామి ని కోరారు. వారికి నష్టపరిహారం అందలేదని కష్టపడే చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారులు, పలువురు సీనియర్ జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్థం లేని సంసారాలు..

# కూలిపోతున్న వేల జీవితాలు...

- పెళ్లయిన ఏడాదిలోనే 60% విడాకుల కేసులు..
- కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్న కొత్త జంటలు..
- డబ్బు, అహంకారం, సోషల్ మీడియా.. మూడూ కలువడంతో సంసారం నాశనం...



ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రతినిధి,05 (విజన్ ఆంధ్ర):
"ఏడు జన్మల బంధం" అన్న మాట ఇప్పుడు పుస్తకాలకే పరిమితమైంది. వాస్తవంలో "ఏడు నెలల బంధం" కూడా నిలవడం లేదు. పెళ్లయిన కొన్ని నెలలకే, కొన్ని సంవత్సరాలకే కోర్టుల చుట్టూ తిరుగుతున్న దంపతులు.. కుటుంబ కలహాలతో పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు.. డబ్బు, బంగారంతో ముదురుతున్న గొడవలు.. ఇవన్నీ ఈరోజు సమాజంలో సాధారణం అయిపోయాయి.



అత్త, మామలు వద్దంటూ విడిపోతున్న భార్యలు.

భార్యల మానసిక వేధింపులకు బలవుతున్న భర్తలు. కన్నతల్లికి ఒక సమాధానం, కట్టుకున్న భార్యకు మరో సమాధానం చెప్పలేక మధ్యలో నలిగిపోతున్న వేలాది మగాళ్లు. సంసారం అనే పవిత్ర బంధం ఇప్పుడు కోర్టు ఫైళ్లలో, కేసుల్లో చిక్కుకుపోతుంది.

### గణాంకాలు ఏం చెబుతున్నాయి?

గత 3 ఏళ్లలో ఫ్యామిలీ కోర్టుల్లో విడాకుల కేసులు 40% పెరిగాయి. వాటిలో 60% కేసులు పెళ్లయిన 1 నుంచి 3 సంవత్సరాల లోపు వాళ్లే.
పోలీస్ స్టేషన్లలో 498ఏ, డివి కేసులు రోజుకు 5 నుంచి 10 వరకు నమోదవుతున్నాయి.
కౌన్సెలింగ్ సెంటర్లకు వచ్చే 100 జంటల్లో 70 జంటలు "సర్దుకుపోయే ఆలోచనే లేదు" అని తేల్చి చెబుతున్నారు.

### ప్రధాన కారణాలు ఏంటి?

#### 1. డబ్బు, బంగారం - బంధానికి విలువ కట్టడం

"మేం 50 లక్షలు ఖర్చు పెట్టాం, 20 నుంచి 30 తులాలు పెట్టాం" అనే లెక్కలతోనే పెళ్లి మొదలవుతుంది. పెళ్లయ్యాక "ఇంకా కారు కావాలి, ఇంకా ప్లాట్ కావాలి" అనే డిమాండ్లు. ఇవ్వలేకపోతే వేధింపులు. ఇచ్చినా "సరిపోలేదు" అనే గొడవలు. ఫలితం.. విడాకులు...

#### 2. అత్త-కోడలు శీతల యుద్ధం

"నా మాట వినాలి" అనే అత్త. "నేను చెప్పినట్టే జరగాలి" అనే కోడలు. మధ్యలో భర్త. ఇంట్లో రెండు వంటలు, రెండు టీవీలు. చివరికి "లేదంటే నేను వెళ్లిపోతా" అనే అల్టిమేటం. చివరకు ఆ కుటుంబం చిన్నాభిన్నం చేస్తున్నాయి...

#### 3. భార్యల హింస - మాట్లాడని వాస్తవం

హింస అంటే కొట్టడమే కాదు. రాత్రంతా నిద్రపోనివ్వకుండా గొడవ, ఫోన్ లాక్కోవడం, స్నేహితులతో మాట్లాడనివ్వకపోవడం, "ఆత్మహత్య చేసుకుంటా" అని బెదిరించడం. మీ అమ్మ అలా అన్నది, మీ నాన్న ఇలా అన్నాడు అంటూ గొడవ మొదలు...



"మగాడివి కదా" అనే సమాజం వల్ల బయటకు చెప్పుకోలేక కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.మరికొందరు ఇంట్లో పోరు తట్టుకోలేక ఉద్యోగాల పేరుతో పారిపోతున్నారు.

#### 4. సోషల్ మీడియా - ఫేక్ లైఫ్‌తో పోలిక

ఇన్‌స్టాలో రీల్స్ చూసి "వాళ్ల భర్త ఇలా చేస్తున్నాడు, నా భర్త ఎందుకు చేయడు" అనే పోలికలు. చిన్న గొడవకే "నా లైఫ్ వేస్ట్" అనే ఫీలింగ్. ఓపిక చంపేస్తుండటం కూడా ఇబ్బందులు...

#### 5. సర్దుకుపోయే గుణం చచ్చిపోవడం

"నేను ఎందుకు తగ్గాలి" అనే ఈగో. పెద్దలు "మీ ఇష్టం" అని వదిలేయడం. కౌన్సెలింగ్‌కు వెళ్లడానికి సిగ్గు. ఫలితంగా చిన్న చిన్న సమస్యలు పెద్ద విడాకులకు దారితీస్తున్నాయి.
ఎవరు ఎక్కువ నష్టపోతున్నారు?
తల్లిదండ్రుల గొడవల్లో పిల్లల భవిష్యత్తు నాశనమవుతుంది. స్కూల్ డ్రాప్ అవుట్, మానసిక సమస్యల వల్ల కూడా పిల్లల బకతుకులు ఆగం అవుతున్నాయి...

### మధ్యతరగతి కుటుంబాలు:

కేసులు, లాయర్లు, కోర్టుల చుట్టూ తిరగడానికి లక్షల ఖర్చు. ఆర్థికంగా చితికిపోతున్నారు. వేల రూపాయల నుండి లక్షల వరకు ఖర్చు చేసుకోవాలంటే మధ్య తరగతి జీవితాలు మధ్యలోనే ఆవిరి అవుతున్నాయి...
కుటుంబ వ్యవస్థ కూలిపోతే సమాజం కూడా కూలిపోతుంది.

### నిపుణులు, సీనియర్లు ఏమంటున్నారు?

"పెళ్లి అంటే వ్యాపారం కాదు. ఇద్దరు మనుషులు కలిసి జీవించడం. ఈగో పక్కన పెట్టి వారానికి ఒకసారి కూర్చుని మాట్లాడుకోవాలి. సమస్య వస్తే వెంటనే కౌన్సెలింగ్ తీసుకోవాలి. సమస్యను పెద్దగా చేసుకోకుండా సద్దుమనిగే గుణాలు కలిగి ఉండాలని అంటున్నారు..
"498ఏ దుర్వినియోగం పెరిగింది. అలాగే మగవాళ్లపై జరిగే మానసిక వేధింపులకు చట్టం లేదు. రెండు వైపులా న్యాయం జరగాలి.అలా అయితేనే మగాళ్ల జీవితం కాస్త కుదుట పడుతుందని అంటున్నారు..
వెనకటి కాలంలో గొడవలు వచ్చేవి. కానీ పెద్దలు కూర్చుని 'సర్దుకుపో' అనేవారు. అంతటితో గొడవ అంతం అయిపోయేది.. ఇప్పుడు 'విడిపో' అని చెప్పేవాళ్లే ఎక్కువ అయ్యారు.అందుకే సంసారాలు ఎక్కువ కాలం నిలవడం లేదు. బంధువుల చెప్పుడు మాటలతో కూడా సంసారాలు ఆగం అవుతున్నాయి...

### పరిష్కారం ఏంటి? సమాజం ఏం చేయాలి?

పెళ్లికి ముందు కౌన్సెలింగ్ ఇస్తూ,పెళ్లికి ముందే ఇరు కుటుంబాలు కూర్చుని ఆర్థిక, సామాజిక అంశాలపై క్లారిటీ తెచ్చుకోవాలి. పాఠశాలల్లో వాల్యూస్ ఎడ్యుకేషన్ గురించి తెలుపుతూ "సర్దుకుపోవడం బలహీనత కాదు, గొప్పతనం" అని పిల్లలకు చిన్నప్పటి నుంచి నేర్పాలి. కుటుంబ కౌన్సెలింగ్ సెంటర్లు ప్రతీ మండలానికి ఏర్పాటు చేయాలి.ప్రతి మండలంలో ప్రభుత్వ కౌన్సెలింగ్ సెంటర్ ఉండాలి. కోర్టుకు వెళ్లే ముందు తప్పనిసరిగా కౌన్సెలింగ్ చేయాలి.
చట్టాల్లో మార్పులు తీసుకొని రావాలి. మహిళలపై దాడులకు కఠిన చట్టాలున్నట్లే, పురుషులపై జరిగే మానసిక వేధింపులకు కూడా చట్టం రావాలి.
గొడవ వస్తే "విడిపో" అని చెప్పకుండా "సర్దుకుపో" అని చెప్పే పెద్దలు కావాలి.
సంసారం అంటే రెండు కుటుంబాల కలయిక. దాన్ని డబ్బుతో కొలవకూడదు. అహంకారంతో కూల్చకూడదు.
"నువ్వు తగ్గు, నేను తగ్గుతా" అనే మాట ఉంటే ఏ గొడవ అయినా సర్దుకుంటుంది. లేకపోతే కోర్టులు నిండిపోతాయి.. కానీ ఇళ్లు ఖాళీగా మిగిలిపోతాయి.
పెళ్లి చేసుకోవడం ఈజీ. కానీ ఆ బంధాన్ని జీవితాంతం నిలబెట్టుకోవడమే అసలైన విజయం....

# ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి




నిర్మల్ జిల్లా,జూలై 06,(విజన్ ఆంధ్ర); ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యుమరేషన్ ఫాం ల పంపిణీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ, డిజిటలైజేషన్ పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడువులోగా ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఇప్పటివరకు పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ వివరాలు సమీక్షించారు. బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు) తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఫాం లు అందివ్వాలని అన్నారు. బిఎల్ఓ లు మాత్రమే ఫాంలు పంపిణీ చేయాలని, బిఎల్ఎ లు గానీ, ఇతర రాజకీయ పార్టీల వారికి గానీ ఎన్యుమరేషన్ ఫాం లు పంపిణీ చేసే అధికారం లేదని స్పష్టం చేశారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై సందేహాలు నివృత్తి చేయడానికి అవసరమైతే అదనపు హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎప్పటికప్పుడు వివిధ మీడియా మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. వీసీలో భాగంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియ పూర్తయిందన్నారు. అన్ని నియమాలు పాటిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహిస్తామని వివరించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నాటి క్షేత్రస్థాయి అధికారుల రికార్డు తప్పిదమే నేడు చౌడూరు ప్రజలకు శాపం

- చౌడూర్ శివారు 352 సర్వేనెంబర్‌లో అక్రమ క్రషర్ దుమ్ము ధూళితో గ్రామమంతా అల్లాడుతోంది
- పంచాయితీ నోటీసులను బేఖాతరు చేస్తున్న యజమాన్యం
- దుమ్ము ధూళితో ఊపిరి ఆడటం లేదు - పిల్లలకు ఆస్తమా ముప్పు
- బోర్లు ఎండిపోయి పంటలు బూడిద - భూగర్భ జలాలపై దెబ్బ
- పీసీబీ అనుమతి లేకుండానే యంత్రాల హోరు - నిబంధనల ఉల్లంఘున



నవాబుపేట, జూలై 06, (విజన్ ఆంధ్ర): వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం ప్రకృతిని సర్వనాశనం చేస్తున్నారు ఆ క్రషర్ యజమానులు. నవాబుపేట మండల పరిధిలోని చౌడూరు గ్రామ శివారు 352 సర్వేనెంబర్ లో ఏర్పాటు చేసిన అక్రమ క్రషర్ వల్ల స్థానిక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాడు మైనింగ్ అనుమతులు పొందే సమయంలో ప్రాథమిక క్షేత్రస్థాయి పరిశీలన, ఎన్ఓసి రికార్డు నమోదులో అప్పటి రెవెన్యూ అధికారులు తప్పుడు సమాచారం ఇవ్వడమే ఇవాళ శాపంగా మారింది. మైనింగ్ నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయి రిపోర్టు ఆధారంగానే అనుమతులు మంజూరవుతాయి. కానీ చౌడూరు క్రషర్ ఏర్పాటులో అధికారులు క్షేత్రస్థాయిలో లేని రైతుల వివరాలు, జనావాసాలు లేవు, నీటి వనరులు లేవు, వ్యవసాయ పొలాలు లేవంటూ రికార్డు ఎక్కించారు. ఫలితంగా నేడు గ్రామ శివారులోని పొలాలు, బోర్లు, నివాసాలు దుమ్ము, శబ్ద కాలుష్యంతో అతలాకుతలమవుతున్నాయి. క్రషర్ నుంచి వచ్చే దట్టమైన ధూళి వల్ల ఊపిరితిత్తుల సమస్యలు, కళ్ల మంటలు పెరిగాయని చావడానికి వయస్సు రాకముందే సచ్చిపోయేటట్లు అవుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. భారీ పేలుళ్లు, యంత్రాల శబ్దంతో పశువులు, పక్షులు అల్లాడుతున్నాయి. నిరంతర వాహన రాకపోకలతో రోడ్లు ధ్వంసమై రైతులు పొలాలకు వెళ్లలేని పరిస్థితి. బోర్లు ఎండిపోయి వ్యవసాయం గాల్లో కలిసిపోతోందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఇప్పటికే మూడు సార్లు నోటీసులు ఇచ్చినా క్రషర్ యజమాన్యం బేఖాతరు చేస్తోంది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి లేఖ ప్రకారం క్రషర్ ప్రస్తుతం నిలిపివేసి, పీసీబీ నుంచి చెల్లుబాటు అయ్యే సిఎఫ్ఓ అనుమతి వచ్చాకే నడపాల్సి ఉంది. కానీ యంత్రాలు నిరంతరం పనిచేస్తుండటంతో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయి రిపోర్టులోని తప్పులపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన క్రషర్‌ను వెంటనే మూసివేయాలని, బాధిత రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# తిరుమల దర్శించుకున్న పోచారం కుటుంబ సభ్యులు.

- మొక్కు తీర్చుకున్న ప్రత్యేక దర్శనం చేసుకున్న పోచారం....
- వర్షాలు వాయ కురిసి పంటలు పండే రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.....



బాన్సువాడ జులై 6 (విజన్ ఆంధ్ర ). తిరుమల ను సోమవారం దర్శించుకున్న పోచారం కుటుంబ సభ్యులు. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని కుటుంబ సభ్యుల తో కలిసి దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి. సతీమణి శ్రీమతి పుష్ప, కుమారులు శ్రీ డా. రవీందర్ రెడ్డి – శ్రీమతి డా. రాధిక దంపతులు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి – శ్రీమతి సోని రెడ్డి దంపతులు, మనవరాళ్లు, మనుమల తో కలిసి మొక్కు తీర్చుకోవడానికి ప్రత్యేక దర్శన సమయంలో స్వామి వారిని దర్శించుకుని వర్షాలు బాగా కురిసి, పంటలు పండి, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దేవున్ని ప్రార్థించిన పోచారం.

# ప్రైమ్ డ్రైవ్ ఆటోమోటివ్ షాప్‌ను ప్రారంభించిన మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి



నిర్మల్ జిల్లా,జూలై 06,(విజన్ ఆంధ్ర); నిర్మల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రైమ్ డ్రైవ్ ఆటోమోటివ్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి గారు ముఖ్య అతిథిగా పాల్గొని షాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఫెరోజ్, మరియు అఫు, అజీమ్,అజీమ్( ఫారెస్ట్), ౘఖ. మెహరా,అబ్దుల్ ఫరాన్ , అబ్దుల్ ఫర్దాన్,తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.